తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
RNI NO.TELTEL / 2013 /50370
మంగళవారం 04.11.2025 | సంపుటి : 12 సంచిక : 104 | పేజీలు : 12 వెల : రూ. 4/-
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్







చేవెళ్ల వద్ద

# ఘోర రోడ్డు ప్రమాదం

19 మంది దుర్మరణం



- పులువురికి తీవ్ర గాయాలు
- ఆర్టీసి బస్సును ఢీకొన్న కంకర టిప్పర్
- ప్రయాణికులపై కంకర పడటంతో అందులో కూరుకుపోయి పెరిగిన మృతులు




- ప్రమాదంపై సీఎం రేవంత్ దిగ్భ్రాంతి
- తక్షణ సహాయక చర్యలకు ఆదేశం
- బస్సు ప్రమాద ఘటన దురదృష్టకరం
- రాష్ట్రపతి, ప్రధాని మోడీ సంతాపం
- మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50వేల పరిహారం
- ప్రమాదంపై కేసీఆర్, కేటీఆర్, ఏపీ సీఎం చంద్రబాబు, సంతాపం
- మృతదేహాలకు పోస్ట్‌మార్టమ్ పూర్తి
- బంధువులకు శవాలు అప్పగింత

చేవెళ్ల,రంగారెడ్డి ప్రతినిధి(జనంసాక్షి): రంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్ర మాదం జరిగింది. తాండూరు డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సును కంకర లోడుతో వెళ్తున్న లారీ ఢీకొట్టింది. చేవెళ్ల మండలం మిర్జాగూడ సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో 19 మంది మృతి చెందగా.. 20 మంది తీవ్రంగా గాయడ్డారు. బస్సుపై కంకర లోడు పడిపోవడంతో పలువురు ప్రయాణికులు దానికింద మిగతా 2, 12లో..







బస్సును ఢీకొన్న టిప్పర్, బస్సులో పడ్డ కంకరలో కూరుకుపోయి క్షతగాత్రుల ఆర్తనాదాలు..

టిప్పర్ అతివేగంగా వచ్చి ఢీకొనడంతో నుజ్జునుజ్జైన ఆర్టీసీ బస్సు

## టిప్పర్ రాంగ్‌రూట్‌లో అతివేగంగా రావడంవల్లే..

- రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది
- ఇరుకు రోడ్డు, డివైడర్ లేకపోవడమూ ప్రమాదానికి కారణమే..
- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, ఆర్టీసీ తరపున రూ.2లక్షలు, క్షతగాత్రులకు రూ. 2 లక్షల పరిహారం
- ఘటనపై అధికారులతో మంత్రి పొన్నం సమీక్ష

## టిప్పర్ వేగమే కొంప ముంచింది

మలుపులో నియంత్రణ కోల్పోవడం వల్లే ప్రమాదం.. బస్సు డ్రైవర్ తప్పిదం లేదు

ప్రకటన విడుదల చేసిన తెలంగాణ ఆర్టీసి

2లో

## జైపూర్‌లో ట్రక్కు బీభత్సం..

ఐదు కిలోమీటర్ల మేర వాహనాలను ఈడ్చుకెళ్లిన వైనం.. 19మంది మృతి



అడ్డంకులు అధిగమించి ఎస్ఎల్‌బీసీ

# పూర్తి చేస్తాం

రాజకీయ దురుద్దేశంతోనే టన్నెల్ పనులు ఆలస్యం చేశారు

- పదేళ్లలో పనులు చేయలేకపోయిన కేసీఆర్
- కమీషన్లు రావనే ప్రాజెక్టుపై అశ్రద్ధ
- ఇప్పుడేమో హరీశ్ అవాకులు చవాకులు
- ఎట్టి పరిస్థితుల్లోనూ టన్నెల్ పనులు పూర్తి చేస్తాం : సీఎం రేవంత్ రెడ్డి



నాగర్‌కర్నూల్ జిల్లాప్రతినిధి(జనంసాక్షి): రాజకీయ దురుద్దేశంతోనే కేసీఆర్ హయాంలో ఎస్ ఎల్‌బీసీ ప్రాజెక్టు ను పక్కకు పెట్టారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తప్పులు చేసి.. అప్పులు చేసి దోపిడీ చేశారనే కారణంతోనే ప్రజలు బీఆర్ఎస్‌ని పక్కన బెట్టారని ఆరోపించారు. ఈ ప్రాజెక్టు పూర్తి చేయకపోతే తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ నేతలని క్షమించరని హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లోనైనా ఎస్ ఎల్‌బీసీ టన్నెల్‌ని తమ ప్రభుత్వంలో పూర్తి చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎస్ఎల్‌బీసీ విషయంలో తమ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు చిల్లర మాటలు మానుకోవాలని హితవు పలికారు. మిగతా 2లో..



## పత్తి కొనుగోళ్లలో సీసీఐ నిబంధనలు మార్చాలి

కేంద్రమంత్రికి మంత్రి తుమ్మల నాగేశ్వరావు లేఖ



హైదరాబాద్(జనంసాక్షి): పత్తి కొనుగోళ్లలో సీసీఐ విధించిన నిబంధనలు మార్చాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రాన్ని కోరారు. ఎకరాకు 7 క్వింటాళ్ల పత్తి మాత్రమే కొనుగోలు చేయాలన్న సీసీఐ కొత్త నిబంధన నేపథ్యంలో కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్, సీసీఐ సీఎండీ లలిత్‌కుమార్ గుప్తాకు లేఖ రాశారు. సాధారణంగా ఇప్పటి వరకు ఎకరాకు 12 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేస్తుండగా.. ఎకరాకు 11.74 క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడులు ఉన్నట్లు జిల్లా కలెక్టర్ల నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం డిక్లరేషన్ ఇచ్చిందని ఆ లేఖలో ప్రస్తావించారు. ఈ ఏడాది అధిక వర్షాల వల్ల పత్తి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో సీసీఐ తీసుకొచ్చిన కొత్త నిబంధన పత్తి రైతులకు నష్టం చేసేలా ఉంది. తేమ శాతం విషయంలో మిగతా 2లో..

## మరో 6 నెలలు మావైపు నుంచి కాల్పులుండవు

మావోయిస్టు పార్టీ ప్రకటన

హైదరాబాద్(జనంసాక్షి): కాల్పుల విరమణను మరో 6 నెలల పాటు కొనసాగిస్తున్నట్లు మావోయిస్టు పార్టీ తెలంగాణ అధికార ప్రతినిధి జగన్ తెలిపారు. సోమవారం ఉదయం పత్రికలకు విడుదల చేసిన ఓ ప్రకటనలో, గత ఏప్రిల్ నుంచి తెలంగాణ రాష్ట్రంలో అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు, సామాజిక వర్గాలు శాంతియుత వాతావరణం కొనసాగాలని పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తున్నారనీ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా స్పందించిందన్నారు. ఈ క్రమంలో గత మిగతా 2లో..




ప్రపంచస్థాయి కంపెనీలకు కేంద్రంగా

# హైదరాబాద్

- తెలంగాణ టెక్నాలజీ, ఆవిష్కరణలకు గుర్తింపు
- వాన్‌గార్డ్ గ్లోబల్ టెక్నాలజీ సెంటర్‌ను ప్రారంభించిన డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి
- లక్ష్యం 120 జీసీసీలు...1.2 లక్షల ఉద్యోగాలు : మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్(జనంసాక్షి): హైదరాబాద్‌లో ప్రపంచ ప్రసిద్ధి చెందిన వాన్‌గార్డ్ గ్లోబల్ టెక్నాలజీ సెంటర్ ప్రారంభం అంటే రాష్ట్రంలో టెక్నాలజీ, ఆవిష్కరణలకు ఒక గుర్తింపుగా భావిస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం సాయంత్రం నాలెడ్జ్ సెంటర్లో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తో కలిసి వాన్‌గార్డ్ గ్లోబల్ టెక్నాలజీ సెంటర్ ను ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. ప్రపంచ స్థాయి కంపెనీలకు హైదరాబాద్ ఒక కేంద్రం గా మారిందని డిప్యూటీ సీఎం అన్నారు. హైదరా బాదులో వాన్ గార్డ్ గ్లోబల్ టెక్నాలజీ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనడం నాకు ఆనందంగా ఉంది మిగతా 2లో..






## ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు

2లో..

- భూసేకరణకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- 700 ఎకరాలు సేకరించాలని కలెక్టర్‌కు ఆదేశం

మరో 12 రాష్ట్రాలు/యూటీల్లో

## ఎస్ఐఆర్




అమలుకు ఈసీ రెడీ • రేపటి నుంచి నుంచి డిసెంబరు 4 వరకు ప్రకియ


తమిళనాడులో 'ఎస్ఐఆర్'పై సుప్రీం కోర్టును ఆశ్రయించిన డీఎంకే..

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఓటర్ల జాబితా ప్రక్షాళనలో భాగంగా కేంద్ర ఎన్నికల సంఘం ఈ నెల 4 నుంచి తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టనుంది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్, గోవా, ఛత్తీస్‌గఢ్, అండమాన్ నికోబార్ దీవులు, మిగతా 2లో..

## ఆ దేశాలు అణ్వాయుధాలు తయారు చేస్తున్నాయి

రష్యా, చైనా, ఉత్తరకొరియా, పాకిస్థాన్‌లు అణు పరీక్షలు నిర్వహిస్తున్నాయి

మరో బాంబు పేల్చిన ట్రంప్



వాషింగ్టన్(జనంసాక్షి): మూడు దశాబ్దాల విరామం తర్వాత అణ్వాయుధ పరీక్షలను తిరిగి ప్రారంభించి ప్రపంచానికి కొత్త సవాల్ విసిరారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. ఈ నిర్ణయాన్ని సమర్థించుకున్న అగ్రరాజ్యాధినేత తాజాగా సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలో చాలా దేశాలు చురుగ్గా అణ్వాయుధాలను పరీక్షిస్తున్నాయన్నారు. ఈ జాబితాలో పాకిస్థాన్ కూడా ఉందని పేర్కొన్నారు. సీబీఎస్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు."రష్యా, చైనా, ఉత్తరకొరియా, పాకిస్థాన్ వంటి దేశాలు అణు పరీక్షలను నిర్వహిస్తున్నాయి. కానీ, వీటి గురించి ఆయా దేశాలు మాట్లాడట్లేదు. మేం అలా కాదు. ఏదైనా బహిరంగంగానే చేస్తాం. దాని గురించి మాట్లాడతాం. ఇన్నాళ్లూ ఎన్ని దేశాలు అణు పరీక్షలు చేపట్టినా మేం వాటి జోలికి వెళ్లలేదు. ఇకపై అలా మిగిలిపోవాలనుకోవట్లేదు. ఇతర దేశాల మాదిరిగానే మేమూ ఈ పరీక్షలు నిర్వహిస్తాం" అని ట్రంప్ వెల్లడించారు. "రష్యా, చైనా వద్ద చాలా అణ్వాయు ధాలు ఉండి ఉంటాయి. మా దగ్గర అంతకంటే ఎక్కువే ఉన్నాయి. మావద్ద ఉన్న అణ్వాయుధాలతో ఈ ప్రపంచం మొత్తాన్ని 150 సార్లు పేల్చేయొచ్చు. కానీ, అణ్వస్త్రాల నిరాయుధీకరణ గురిం చి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో చర్చించా" అని ట్రంప్ తెలిపారు. అమె రికా అణ్వాయుధ పరీక్షలకు ఇప్పటికే ఏర్పాట్లు ప్రారం భమైనట్లు ఆయన పేర్కొన్నారు. అయితే, ఎప్పుడు, ఎక్కడ ఈ పరీక్షలు నిర్వహించనున్నారన్న మిగతా 2లో..

## రూ.3వేల కోట్లు కొల్లగొట్టడం దిగ్భ్రాంతికరం

### డిజిటల్ అరెస్టులపై కఠినచర్యలు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ(జనంసాక్షి): దేశవ్యాప్తంగా ఇటీవలి కాలంలో పెచ్చు మీరుతున్న 'డిజిటల్ అరెస్టు' మోసాలపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. ఈ మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు కఠినచర్యలు తీసుకుంటామని పేర్కొంది. డిజిటల్ అరెస్టు స్కామ్‌లపై కొద్దిరోజులుగా సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. "ఒక్క మనదేశంలోనే ఈ అరెస్టు బాధితుల నుంచి రూ.3వేల కోట్లు కొల్లగొట్టడం దిగ్భ్రాంతికరం. ఇప్పుడు వీటిని మనం తీవ్రంగా తీసుకోకపోతే.. ఈ నేరగాళ్లు పెచ్చుమీరిపోతారు. వీటికి మిగతా 2లో..



## మోడీవి పసలేని ప్రసంగాలు

అనవసర అంశాలపైనే మాట్లాడుతున్నారు : ప్రియాంక

పట్నా(జనంసాక్షి): దేశాన్ని, బిహార్‌ను అవమానించారంటూ ప్రతిపక్ష నేతలందరిపై ప్రధాని నరేంద్ర మోదీ ముద్ర వేస్తున్నారని కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ విమర్శించారు. దీనికోసం కేంద్రంలో కొత్తగా 'అవమానాల మంత్రిత్వశాఖ'ను ఏర్పాటు చేయాలంటూ ఎద్దేవా చేశారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సోన్‌బర్సాలో నిర్వహించిన ప్రచార సభలో ఈమేరకు ప్రసంగించారు. ప్రధాని అనవసర విషయాలన్నీ మాట్లాడుతున్నారని, కానీ.. రాష్ట్రంలో ఎన్డీయే సర్కారు అవినీతి, దుష్పరిపాలనపై మాత్రం నోరు మెదపడం లేదన్నారు. "అభివృద్ధి గురించి మాట్లాడటానికి బదులుగా.. ప్రతిపక్ష నేతలు దేశాన్ని, బిహార్‌ను అవమానిస్తున్నారంటూ మిగతా 2లో..

## మెడికల్ పీజీ విద్యలో 85% లోకల్ విద్యార్థులకే..

జీవోలు విడుదల చేసిన ప్రభుత్వం




హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్రంలో మెడికల్ పీజీ విద్య యాజమాన్య కోటాలో 85 శాతం సీట్లు ఇక తెలంగాణ విద్యార్థులకే దక్కనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నాడు రెండు జీవోలు జారీ చేసింది. ఈ జీవో కారణంగా ఈ ఏడాది రాష్ట్ర విద్యార్థులకు అదనంగా 318 మెడికల్ పీజీ, 70 డెంటల్ పీజీ సీట్లు దక్కనున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రభుత్వ పీజీ వైద్య కాలేజీల్లో 50 శాతం సీట్లను అఖిల భారత కోటాలో, మిగతా 50 శాతం సీట్లను కన్వీనర్ కోటాలో స్థానికులతో భర్తీ చేస్తున్నారు. తెలంగాణలో మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
04.11.2025

# చేవెళ్ల వద్ద ఘోర రోడ్డు ప్రమాదం



కూరుకుపోయారు. మృతుల్లో 10 మంది మహిళలు, 8 మంది పురుషులు, ఒక చిన్నారి ఉన్నారు. ప్రమాద సమయంలో ప్రయాణికుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతం హృదయ విదారకంగా మారింది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మూడు జేసీబీల సాయంతో సహాయక చర్యలు చేపట్టారు. కంకరలో కూరుకుపోయిన వారిని బయటకు తీసారు. క్షతగాత్రులను చేవెళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. 14 మృతదేహాలకు చేవెళ్ల ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం పూర్తయినట్లు మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. క్షతగాత్రుల్లో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెప్పారు. టీఎస్ 34 టీఏ 6354 నంబరు గల ఆర్టీసీ బస్సు తాండూరు నుంచి హైదరాబాద్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. తాండూరులో ఉదయం 4.40 గంటలకు బస్సు బయల్దేరింది. అక్కడ 30 మందికి పైగా ఉద్యోగులు, కళాశాలలకు వెళ్లే ఉద్యోగులు ఎక్కారు. మొత్తంపై బస్సులో సుమారు 72 మంది ప్రయాణికులు ఉన్నారు. విద్యార్థులు హైదరాబాదలోని పలు కళాశాలల్లో చదువుతున్నట్లు సమాచారం. ఆదివారం సెలవు కావడంతో ఇళ్లకు వెళ్లి.. తిరిగి నగరానికి వస్తుండగా ఈ ఘటన జరిగింది. సహాయక చర్యలు జరుగుతున్న సమయంలో చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్‌పైకి జేసీబీ ఎక్కడంతో ఆయన ఎడమ కాలికి గాయమైంది. సీఐను చేవెళ్ల ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రమాదం జరగటంతో సీట్లలోనే వీరు ఇరుక్కుపోయారు. టిప్పర్‌లోని కంకర బస్సులో పడడంతో ముందు వరుసలో ఉన్న 5 సీట్లు డ్యామేజ్ అయ్యాయి. బస్సు తాండూరు నుండి హైదరాబాద్ వెళ్తుండగా చేవెళ్ల మండలం మిర్జాగూడ దగ్గర రోడ్డు ప్రమాదం జరిగింది. దీంతో చేవెళ్ల-వికారాబాద్ మార్గంలో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఇటీవల జరిగిన కర్నూల్ బస్సు ప్రమాదంలో 19 మంది సజీవ దహనం అయిన ఘటన మరువకముందే.. ఈ ఘటన జరగడం రాష్ట్రంలో విషాదాన్ని నింపింది.

**ముగ్గురు అక్కాచెల్లెళ్లు ప్రమాదంలో దుర్మరణం**

రంగారెడ్డి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదం ఓ కుటుంబంలో అంతులేని విషాదం నింపింది. వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన ఎల్లయ్య గౌడ్ ముగ్గురు కుమార్తెలు ఈ ప్రమాదంలో మృతిచెందారు. అక్కాచెల్లెళ్లు తనుష, సాయి ప్రియ, నందిని మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. హైదరాబాద్‌లోని కోఠి మహిళా కళాశాలలో చదువుతున్న ముగ్గురూ.. గత నెల 15న జరిగిన ఓ పెళ్లివేడుకలో సందడిగా గడిపారు. తల్లిదండ్రులతో పాటు బంధువులు ఘటనాస్థలికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. ఎల్లయ్యగౌడ్ డ్రైవర్‌గా పనిచేస్తూ పిల్లల్ని చదివించారు. ఆయనకు నలుగురు కుమార్తెలు. ఒక కుమార్తెకు వివాహం కాగా.. మిగిలిన ముగ్గురు కుమార్తెలు సోమరవాం జరిగిన రోడ్డు ప్రమాదంలో విగత జీవులుగా మారడంతో ఆ కుటుంబం, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. మరోవైపు యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్‌కు చెందిన అఖిలరెడ్డి అనే యువతి కూడా ఇదే ప్రమాదంలో చనిపోయారు. ఎంబీఏ చదువుతున్న కుమార్తె మృతితో అఖిల తల్లి, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఘటనాస్థలానికి వచ్చి బోరున విలపించారు.

**రాష్ట్రపతి, ప్రధాని మోదీ సంతాపం**

తెలంగాణలోని చేవెళ్లలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. క్షతగ్రాతులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు ప్రధాని తెలిపారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మిర్జాగూడ సమీపంలో చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో 19 మంది మృతి చెందారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు.

**ప్రమాద ఘటనపై సీఎం రేవంత్ దిగ్భ్రాంతి**

చేవెళ్ల మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంపై సీఎం రేవంత్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఘటనపై దిగ్భ్రాంతి చెందారు. అధికారులు వెంటనే అక్కడికి చేరుకొని, అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు ఎప్పటికప్పుడు తెలియజేయాలని రేవంత్ రెడ్డి తెలిపారు. బస్సు ప్రమాదంలో గాయపడిన వారందరినీ వెంటనే హైదరాబాద్‌కు తరలించి మెరుగైన వైద్య చికిత్స అందించేలా ఏర్పాట్లు చేయాలని డీజీపీలను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. అందుబాటులో ఉన్న మంత్రులు వెంటనే ప్రమాద సంఘటనకు చేరుకోవాలని పేర్కొన్నారు. సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, అందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు సీఎం సూచించారు. ప్రమాదంపై టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చేవెళ్ళలో జరిగిన రోడ్డు ప్రమాదంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గాయపడ్డవారికి తగిన వైద్య చికిత్సలు చేయాలని సూచించారు. అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మృతులకు మహేష్ కుమార్ గౌడ్ ప్రగాఢ సంతాపం తెలియజేశారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మిర్జాగూడ దగ్గర ఆర్టీసీ బస్సు టిప్పర్ ఢీకొన్న ఘోర ప్రమాదంలో 20 మంది దుర్మరణం పాలైన ఘటనపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబాలకు సంతాపాన్ని ప్రకటించారు. మరణించిన వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవడంతో పాటు గాయపడిన ప్రయాణికులకు మెరుగైన వైద్య సదుపాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. మృతుల కుటుంబాలకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రోడ్డు ప్రమాదంపై కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ప్రమాదంపై చంద్రబాబు, లోకేశ్ తీవ్ర సంతాపం

ప్రమాదంపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటీ,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన తమను కలచివేసిందన్నారు. ప్రమాదంపై స్పందిస్తూ... మృతులకు సంతాపం ప్రకటించారు. ఈ ప్రమాదం తీవ్రంగా కలిచివేసిందని.. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం, మంత్రి తెలిపారు. 'తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో పలువురు ప్రయాణికుల మృతి తీవ్రంగా కలచివేసింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను" అని అన్నారు.

## టిప్పర్ వేగమే కొంప ముంచింది

**హైదరాబాద్(జనంసాక్షి):** చేవెళ్ల బస్సు ప్రమాదం ఘటనపై ఆర్టీసీ అధికారులు వివరణ ఇచ్చారు. బస్సు ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ ఆర్టీసీ ప్రకటన విడుదల చేసింది. టిప్పర్ అతివేగమే ప్రమాదానికి కారణమని దర్యాప్తులో తేలిందని చెప్పింది. రోడ్డు మలుపులో అతివేగం వల్ల టిప్పర్ డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడని, ప్రమాదానికి ఆర్టీసీ బస్సు గానీ, బస్ డ్రైవర్ కారణం కాదని స్పష్టం చేసింది. బస్ పూర్తి ఫిట్‌నెస్‌తోనే ఉందని.. డ్రైవర్ సర్వీసు రికార్డులోనూ గతంలో యాక్సిడెంట్లు లేనట్లు తేలిందని చెప్పింది. రోడ్డు మలుపు వద్ద అతి వేగంతో ఉన్న టిప్పర్ డ్రైవర్ నియంత్రణ కోల్పోవడం ఈ దుర్ఘటన జరిగిందని ప్రత్యక్ష సాక్షులు చెప్పినట్లుగా సంస్థ పేర్కొంది. సోమవారం తెల్లవారు జామున 4.40 గంటల ప్రాంతంలో తాండూరు నుంచి బయలుదేరిన ప్రైవేట్ హైర్ ఎక్స్‌ప్రెస్ బస్‌ను ఇందిరానగర్ సమీపంలో కంకర లోడ్‌తో ఎదురుగా వచ్చిన టిప్పర్ ఢీకొట్టిన విషయం తెలిసిందే. దాంతో బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. టిప్పర్ లారీ ఢీకొట్టడం బస్‌పై ఒరిగిపోవడంతో అందులో ఉన్న కంకర అంతా బస్‌లో ఉన్న ప్రయాణికులపై పడిపోయింది. దాంతో ఎక్కువ మంది ప్రయాణికులు ఊపిరాడక ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో బస్ డ్రైవర్ దస్తగిరి సైతం ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం తర్వాత ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖుష్రో షా ఖాన్, ఆపరేషన్స్ ఇన్‌చార్జి ఈడీ శ్రీధర్, రంగారెడ్డి రీజినల్ మేనేజర్ శ్రీలత, ఇతర సీనియర్ అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలను ముమ్మరం చేసినట్లు వివరించింది. గాయపడిన 25 మందికి మెరుగైన చికిత్స అందించాలని అధికార బృందం, అక్కడి డాక్టర్లను కోరిందని చెప్పింది. చనిపోయిన 19 మందిలో 5 గురు మహిళలు, 14 మంది పురుషుల మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి వారి బంధువులకు అప్పగించడం జరిగిందని చెప్పింది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మృతి చెందిన వారికి ఒక్కొక్కరికి ప్రభుత్వం తరుపున రూ.5 లక్షలు, ఆర్టీసీ నుంచి రూ.2లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించినట్లు తెలిపింది. గాయపడిన వారికి రూ.2 లక్షల ఎక్స్‌ప్రేషియా ప్రభుత్వం ప్రకటించిందని.. అలాగే, వాహనం ఇన్సురెన్స్ పాలసీ ద్వారా బాధితులకు తగిన మొత్తంలో పరిహారం చెల్లించడం చెప్పింది. ఈ దురదృష్టకర సంఘటనలో చనిపోయిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని, గాయపడ్డ వారు త్వరగా కోలుకోవాలని ఆర్టీసీ ఆకాంక్షించింది.

## జైపూర్‌లో ట్రక్కు బీభత్సం..

**జైపూర్,అమరావతి(జనంసాక్షి):** రాజస్థాన్‌లోని జైపుర్‌లో ఘోర ప్రమాదం జరిగింది. మద్యం మత్తులో ఉన్న ఓ డంపర్ ట్రక్కు డ్రైవర్ జైపుర్‌లోని లోహమండి రోడ్డుపై ఐదు కిలోమీటర్ల మేర బీభత్సం సృష్టించాడు. మద్యం మత్తులో రోడ్డుపై పలు వాహనాలను ఢీకొట్టడంతో 19మంది మృతి చెందగా..50మందికిపైగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. మద్యం మత్తులో నియంత్రణ కోల్పోయిన ట్రక్కు డ్రైవర్ దాదాపు ఐదు కిలోమీటర్ల మేర అనేక వాహనాలను ఢీకొంటూ వెళ్లినట్లు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న భద్రతా బలగాలు, పోలీసు బలగాలు సహాయక చర్యలు చేపట్టాయి. రోడ్డుపై వాహనాల శిథిలాల కింద అనేకమంది చిక్కుకున్నారని.. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని.. కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

బాపట్ల జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం సత్యవతిపేటలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆదివారం అర్ధరాత్రి దాటాక ఒంటిగంట సమయంలో కారు, లారీ ఢీకొన్నాయి. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు మృతిచెందారు. మృతులను కర్లపాలెంకు చెందిన బేతాళం బలరామరాజు (65), బేతాళం లక్ష్మి (60), గాదిరాజు పుష్పవతి (60), ముదుచారి శ్రీనివాసరాజు (54)గా గుర్తించారు. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న 13, 11 ఏళ్ల వయసున్న ఇద్దరు బాలురు గాయపడ్డారు. ప్రస్తుతం వాళ్లకు ప్రాణాపాయం తప్పినట్లు డాక్టర్లు చెప్పారు. బాపట్ల ఎమ్మెల్యే నరేంద్రవర్మ కుమారుడి సంగీత్‌కు వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు

**హైదరాబాద్(జనంసాక్షి):** ఆదిలాబాద్‌లో విమానాశ్రయం కోసం భూసేకరణకు ప్రభుత్వం అనుమతులు జారీ చేసింది. ఎయిర్ పోర్టు కోసం భూసేకరణ చేయాలని ఆదేశించింది. ఆదిలాబాద్‌లో 700 ఎకరాలు సేకరించాలని కలెక్టర్‌ను ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలోని వరంగల్, ఆదిలాబాద్‌లలో బ్రౌన్‌ఫీల్డ్ విమానాశ్రయాలను రానున్న రెండేళ్లలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. భూసేకరణకు సంబంధించిన అన్ని ప్రక్రియలు పూర్తి కాగానే పనులు ప్రారంభించడానికి ఏఏఐ సిద్ధమవుతోంది. ఇప్పటికే వరంగల్‌లోని మామునూరు విమానాశ్రయ అభివృద్ధికి కావాల్సిన భూసేకరణ పూర్తి కావొచ్చింది. ఇక్కడ అవసరమైన 253 ఎకరాల భూసేకరణకు రూ.205 కోట్లను ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఆదిలాబాద్‌లోనూ బ్రౌన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి భారత వాయుసేన అంగీకారం తెలుపడంతో ఏఏఐ రాబోయే రెండేళ్లలో ఎయిర్‌పోర్ట్‌ను అభివృద్ధి చేయడానికి సిద్ధమవుతోంది. ఈ రెండు విమానాశ్రయాలను 2027 జూన్ నాటికి అందుబాటులోకి తేవాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. కాగా, స్థానిక పరిస్థితులను బట్టి 2027 డిసెంబరులోగా అందుబాటులోకి తెస్తామని కేంద్రం గతంలో తెలిపినట్లు సమాచారం.

### రూ.3వేల కోట్లు కొల్లగొట్టడం దిగ్భ్రాంతికరం

అడ్డుకట్టవేసేలా కఠినచర్యలు తీసుకోవాలని నిశ్చయించుకున్నాం" అని సుప్రీంకోర్టు పేర్కొంది. "డిజిటల్ అరెస్ట్ సమస్య పెద్దసవాల్‌గా ఉంది. ఇతర దేశాల్లో ఎలాంటి పరిస్థితి ఉందో తెలియదు. సాంకేతిక, ఆర్థిక విభాగాలు ఎలా పనిచేస్తున్నాయో తెలియదు. ఆ విభాగాలు మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది" అని హెచ్చరించింది. ఇలాంటి కేసుల్లో బాధితులు ఎక్కువగా వయోధికులే ఉండటం అత్యంత దయనీయమని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా న్యాయస్థానానికి వెల్లడించారు. అలాగే ఈ కేసుల్లో ఫిర్యాదులపై దర్యాప్తు చేసేందుకు కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక యూనిట్ ఉందని తెలిపిన మెహతా.. ఈ వ్యవహారంలో సమగ్ర దర్యాప్తు వివరాలు దాఖలు చేసేందుకు సమయం కావాలని కోరారు. ఈ మోసాలు దేశవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న నేపథ్యంలో మొత్తం వ్యవహారంపై దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని యోచిస్తున్నట్లు గత విచారణలో సుప్రీంకోర్టు పేర్కొంది. దేశవ్యాప్తంగా విభిన్న రాష్ట్రాల్లో నమోదైన ఎఫ్ఐఆర్‌లను కలిపి విస్తృతస్థాయిలో దర్యాప్తు జరిపే సాంకేతిక, సిబ్బందిపరమైన వనరులు సీబీఐకి ఉన్నాయా? అని కూడా ఆరా తీసింది. ఇందుకు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సమాధానం ఇస్తూ ఇప్పటికే సీబీఐ ఇలాంటి మోసాలపై దర్యాప్తు చేస్తోందని చెప్పారు. కేంద్రహోంశాఖ పరిధిలోని సైబర్ క్రైమ్ డివిజన్ నుంచి ఇందుకు అవసరమైన సాంకేతిక సాయం అందుతున్నట్లు వివరించారు.

## మెడికల్ పీజీ విద్యలో 85% లోకల్ విద్యార్థులకే..

ఉన్న 19 ప్రైవేటు పీజీ మెడికల్ కాలేజీల్లో 1511 వరకు సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో సగం సీట్లను కన్వీనర్ కోటా కింద స్థానికులకు కేటాయిస్తున్నారు. మిగతా సీట్లను ఎంక్యూ1, ఎంక్యూ2 (ఎన్ఆర్ఐ), ఎంక్యూ3(ఇన్‌స్టిట్యూషనల్) కోటా కింద భర్తీ చేస్తారు. వీటిలో ఎంక్యూ 1 కింద 25 శాతం సీట్లు ఉండగా.. వీటన్నింటిని ఆలిండియా కోటాకే కేటాయించేవారు. అయితే ఎంక్యూ1లోని 85 శాతం సీట్లను స్థానికులతోనే భర్తీ చేయాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది.

## టిప్పర్ రాంగ్‌రూట్‌లో అతివేగంగా రావడంవల్లే..

**చెవెళ్ల(జనంసాక్షి):** రంగారెడ్డి జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంపై ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో మంత్రి ఫోన్‌లో మాట్లాడారు. ఆర్టీసీ అధికారులు హుటాహుటిన ఘటనాస్థలికి వెళ్లాలని ఆదేశించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ప్రమాదం ఎలా జరిగిందనే దానిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. టిప్పర్ రాంగ్‌రూట్‌లో వచ్చి బస్సును ఢీకొట్టడంతోనే ప్రమాదం జరిగినట్లు అధికారులు చెప్పారని తెలిపారు. ప్రమాద ఘటనపై విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు పరిహారం ప్రకటించినట్లు వెల్లడించారు. చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శించిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు.'ఈ బస్సు ప్రమాదంలో 19 మంది చనిపోయారు. మృతదేహాలకు పోస్టుమార్టం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో జరుగుతోంది. మృతుల్లో పది మంది మహిళలు, 8 మంది పురుషులు, ఒక చిన్నారి ఉన్నారు. 19 మందిలో 13 మృతదేహాలను పోలీసులు గుర్తించారు. వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, క్షతగాత్రులకు రూ. 2 లక్షల పరిహారం ప్రకటించాం. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందిస్తున్నాం" అని మంత్రి తెలిపారు. మృతుల కుటుంబాలకు ఆర్టీసీ తరపున రూ.2 లక్షలు ఇస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

బస్సు దుర్ఘటనకు అదీ ఒక కారణమే

రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో బస్సు దుర్ఘటన నేపథ్యంలో తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. వరుస ప్రమాదాలు, నివారణా చర్యలపై జూమ్ వేదికగా నిర్వహించిన ఈ కీలక భేటీలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, రవాణాశాఖ కమిషనర్ ఇలంబర్తి , జేటీసీలు, డీటీసీలు, ఇతర రవాణాశాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులకు ఆయన పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. "ఈ రోజు జరిగిన ప్రమాదంలో రెండు వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఉన్నప్పటికీ.. ఇరుకు రోడ్డు, డివైడర్ లేకపోవడం ప్రమాదానికి ఒక కారణం. తీవ్రత కూడా అధికంగా ఉంది. వాహనాల స్పీడ్ లాక్ ఎంతవరకు అమలవుతుందో చూడాలి. వాహనదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే ట్రిపుల్ పెనాల్టీ వేయాలి. రవాణాశాఖ అధికారులు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీరియస్‌గా, క్రియాశీలంగా ఉండాలి" అని అన్నారు.



## మరో 6 నెలలు మావైపు నుంచి కాల్పులుండవు

మే నెలలో మేము ఆరు నెలల పాటు కాల్పుల విరమణను ప్రకటించామన్నారు. ఈ ఆరు నెలల కాలంలో అనుకున్న పద్దతులను మా వైపు నుండి అమలు జరిపి శాంతియుత వాతావరణం కొనసాగేలాగా వ్యవహరించామని గుర్తు చేశారు. ఇదే శాంతియుత వాతావరణం కొనసాగాలని తెలంగాణ సమాజం కోరుకుంటున్నందున ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మరో ఆరు నెలల పాటు కాల్పుల విరమణను పొడిగిస్తున్నట్లు జగన్ తెలిపారు. గతంలో కొనసాగిన విధంగానే మా వైపు నుండి శాంతియుత వాతావరణాన్ని కొనసాగించేందుకు కృషిచేస్తామన్నారు. ప్రభుత్వం వైపు నుండి కూడా గతంలో వ్యవహరించిన విధంగానే ఉండాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న శాంతియుత వాతావరణాన్ని భంగం చేయదానికి ప్రయత్నాలు చేస్తున్నదనీ, ఇటువంటి ప్రయత్నాలకు వ్యతిరేకంగా అన్ని పార్టీలు, సామాజిక వర్గాలు, సంఘాలు, విద్యార్థులు, మేధావులు, ప్రజాస్వామికవాదులు ముక్త కంఠంతో కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాలకు వ్యతిరేకంగా పోరాడాలని విజ్ఞప్తి చేశారు.

## ఆ దేశాలు అణ్వాయుధాలు తయారు చేస్తున్నాయి

విషయాన్ని మాత్రం ట్రంప్ వెల్లడించలేదు. దక్షిణ కొరియాలోని బుసాన్‌లో ఇటీవల చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీకి ముందు 'ట్రూత్ సోషల్'లో దీనిపై పోస్ట్ చేసిన సంగతి తెలిసిందే. "అణ్వాయుధాలకు ఉన్న విధ్వంసకర శక్తి కారణంగా ఆ పరీక్షలు చేయకూడదని గతంలో అధికారంలో ఉన్నప్పుడు నిర్ణయించుకున్నా. కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయి. రష్యా, చైనా సహా ఇతర దేశాలు వేగంగా తమ అణు సామర్థ్యాలను పెంచుకుంటున్నాయి. అణ్వాయుధాల విషయంలో అమెరికా, రష్యా, చైనా ఐదేళ్లలోపు సమాన స్థాయికి చేరుకునే అవకాశముంది. అందుకే మన దేశం మళ్లీ అణ్వాయుధ పరీక్షలు ప్రారంభించాల్సిన సమయం వచ్చింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్‌కు దీనికి సంబంధించిన ఆదేశాలు జారీ చేశాను" అని ట్రంప్ తెలిపారు.

## పత్తి కొనుగోళ్లలో సీసీఐ నిబంధనలు మార్చాలి

20శాతం వరకు ఉన్నా సరే పత్తి పంట సీసీఐ కొనుగోలు చేయాలి. కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన లేకపోవడం వల్ల కూడా పత్తి రైతులకు ఇబ్బందులు తలెత్తాయి. రాష్ట్ర రైతాంగ ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని 7 క్వింటాళ్ల నిబంధన ఎత్తి వేసి పాత పద్ధతిలో పత్తి కొనుగోళ్లు చేయాలి. జిన్నింగ్ మిల్లర్ల సమస్యలను కూడా వెంటనే పరిష్కరించాలని మంత్రి తుమ్మల కేంద్రానికి రాసిన లేఖలో పేర్కొన్నారు.

## అడ్డంకులు అధిగమించి ఎస్ఎల్‌బీసీ పూర్తి చేస్తాం

నాగర్ కర్నూల్ జిల్లాలోని ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రాంతంపై సీఎం రేవంత్‌రెడ్డి జియో ఫిజికల్ సర్వే నిర్వహించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను పూర్తి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ ప్రాజెక్టు 1983లో మంజూరైందని, ఇప్పటికీ పూర్తికాకపోవడం బాధాకరమని చెప్పారు. నాగర్‌కర్నూల్ జిల్లా మన్నేవారిపల్లెలో పర్యటించిన సీఎం.. హెలీ మ్యాగ్నటిక్ సర్వేకు సిద్ధంగా ఉన్న సర్వే హెలికాప్టర్, అధునాతన పరికరాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. టన్నెల్ బోర్ మిషన్‌తో పనులు చేయడం కష్టంగా మారిందని, పనులపై భారత రాష్ట్ర సమితి నాయకులు రాజకీయం చేయడం తగదని అన్నారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా.. టన్నెల్ పనులు పూర్తి చేసి తీరుతామని స్పష్టం చేశారు. ప్రాజెక్టు మంజూరు చేసినప్పుడు టన్నెల్ పనుల అంచనా విలువ రూ.1,968 కోట్లు. రెండు దశాబ్దాలుగా సాగుతున్న టన్నెల్ పనుల్లో ఎన్నో అవాంతరాలు ఎదురయ్యాయి. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడేనాటికి 30 కిలోమీటర్ల టన్నెల్ నిర్మాణం పూర్తయింది. కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లలో మిగతా 10కి.మీ టన్నెల్ పూర్తి చేయలేదు. పెద్దగా కమీషన్లు రావని ఈ ప్రాజెక్టును పక్కకు పెట్టారు. ఏపీలో జగన్ ప్రభుత్వం పోతిరెడ్డిపాడును విస్తరిస్తుంటే కేసీఆర్ చూస్తూ ఊరుకున్నారు. రూ.2 వేల కోట్లు ఖర్చు చేసి ఉంటే ఉమ్మడి నల్గొండ జిల్లాలకు నీరు అందేది. ఈ ప్రాజెక్టు పూర్తయితే.. కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందనే దురుద్దేశంతో పట్టించుకోలేదు. కృష్ణా నది మీద చేపట్టిన అన్ని ప్రాజెక్టులను కేసీఆర్ నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. గత పదేళ్లలో సాగునీటి ప్రాజెక్టు కాంట్రాక్టర్లకు కేసీఆర్ ప్రభుత్వం రూ.1.86 లక్షల కోట్లు చెల్లించింది. ఆ మొత్తంలో కాళేశ్వరం కాంట్రాక్టర్లకే రూ.1.06 లక్షల కోట్లు చెల్లించారు. గత పదేళ్లలో ఏపీ ప్రభుత్వం కృష్ణా నదిపై ఎన్నో ప్రాజెక్టులు చేపట్టి పూర్తి చేసింది. తెలంగాణలో మాత్రం కేసీఆర్ ప్రభుత్వం కృష్ణానదిపై ప్రాజెక్టులు పూర్తి చేయలేదని రేవంత్‌రెడ్డి అన్నారు. గత పదేళ్లలో ఏ ప్రాజెక్టునూ కేసీఆర్ పూర్తి చేయలేదని మండిపడ్డారు. ఇప్పుడు ఆయా ప్రాజెక్టులపై ఏపీ అభ్యంతరం చెబుతోందని పేర్కొన్నారు. కేసీఆర్ నిర్వాకం వల్లే ఆంధ్రప్రదేశ్‌కు అలుసైపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉండి ఉంటే టన్నెల్ పనులు ఎప్పుడో పూర్తయ్యేవని చెప్పుకొచ్చారు. ఎస్ఎల్‌బీసీని గత కేసీఆర్ ప్రభుత్వం గాలికొదిలేసిందని ధ్వజమెత్తారు. కమిషన్లు రావని మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ఎస్ఎల్‌బీసీని పట్టించుకోలేదని ఫైర్ అయ్యారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో 10 కిలోమీటర్లు కూడా టన్నెల్ పనులు పూర్తికాలేదని చెప్పుకొచ్చారు. టన్నెల్ పూర్తి చేస్తే కాంగ్రెస్‌కు పేరొస్తుందనే కారణంతోనే గాలికొదిలేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 30 టీఎంసీల తరలింపు, 3 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో 1983లో ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు మంజూరైందని గుర్తుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2004లో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఎస్ఎల్‌బీసీ టన్నెల్-1, టన్నెల్-2 పనులను ప్రారంభించారని చెప్పుకొచ్చారు. రూ.1968 కోట్లతో టెండర్లు పిలిచారని గుర్తుచేశారు. ఈ దేశంలోనే తొలిసారిగా ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌కు టన్నెల్ బోర్ మిషన్‌ని ఉపయోగించారని వివరించారు. 2014 వరకు కిలోమీటరు వరకు టన్నెల్ పనులు పూర్తి అయ్యాయని తెలిపారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వాత కేసీఆర్ హయాంలోని పదేళ్లలో పది కిలోమీటర్ల వరకు కూడా ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. ఇప్పుడు తమ ప్రభుత్వంలో గ్రావిటీ ద్వారా నల్గొండకు నీళ్లు తీసుకెళ్లాలను కుంటే అడ్డంకులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ప్రపంచంలో 40 కిలోమీటర్ల టన్నెల్ ఎక్కడా లేదని చెప్పుకొచ్చారు. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు పూర్తయితే తెలంగాణకు ఆ రికార్డు దక్కుతుందని ఉద్ఘాటించారు. ఆనాడు రూ.2 వేల కోట్ల ఖర్చుతో ఈ ప్రాజెక్టు పూర్తయ్యేదని స్పష్టం చేశారు. ఇప్పుడు పెరిగిన అంచనాలతో రూ.4600 కోట్ల మేర ఖర్చవుతోందని తెలిపారు. కేసీఆర్ హయాంలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయకపోవడమే కాదని.. కృష్ణా నదిపై ఏ ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేశారని ధ్వజమెత్తారు. కేసీఆర్ పదేళ్లలో రూ.1.86 లక్షల కోట్లు కాంట్రాక్టర్లకు ఇచ్చారని ఫైర్ అయ్యారు. అందులో రూ.1.5 లక్షల కోట్లు కాళేశ్వరం కోసమే ఖర్చు చేశారని మండిపడ్డారు. కృష్ణాలో తెలంగాణ వాటాని మనం తీసుకోకపోవడం వల్ల ఆ నీటిని ఆంధ్రప్రదేశ్ తరలించుకుపోతోందని చెప్పుకొచ్చారు. 299 టీఎంసీలు చాలని ఆనాడు హరీశ్‌రావు సంతకం పెట్టి వచ్చారని ధ్వజమెత్తారు. తెలంగాణ వాటా మనకు దక్కాల్సిందేనని ట్రిబ్యునల్‌లో ఈ విషయంపై తాము వాదనలు వినిపిస్తూ ఒక కొలిక్కి తీసుకొస్తున్నామని వివరించారు. ఇంత తక్కువ ఖర్చుతో 30 టీఎంసీల నీటిని తీసుకెళ్లే ప్రాజెక్టు దేశంలో ఎక్కడా లేదని స్పష్టం చేశారు. తాము అధికారంలోకి వచ్చాక ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు పనులు మొదలు పెట్టామని తెలిపారు. అయితే, ఈ పనుల నేపథ్యంలో దురదృష్టవశాత్తూ 8 మంది కార్మికులు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

## ప్రపంచస్థాయి కంపెనీలకు కేంద్రంగా హైదరాబాద్

అన్నారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల తరఫున వాన్ గార్డ్ నాయకత్వ బృందానికి హృదయ పూర్వక స్వాగతం తెలియజేస్తూ, కంపెనీ చరిత్రలో ముఖ్యమైన మైలురాయికి మీకు అభినందనలు తెలియజేస్తున్నాను అని సిబ్బందిని ఉద్దేశించి డిప్యూటీ సీఎం ప్రసంగించారు. పెట్టుబడుల నిర్వహణలో వాన్ గార్డ్ ఒక విశ్వసనీయ గ్లోబల్ నాయకుడు, కొత్త ఆవిష్కరణలు, నైతికత, మరియు దీర్ఘకాలిక విలువ సృష్టి పట్ల కట్టుబాటుతో ప్రసిద్ధి చెందింది అన్నారు. వాన్ గార్డ్ హైదరాబాదులో గ్లోబల్ టెక్నాలజీ సెంటర్‌ను స్థాపించాలనే నిర్ణయం తీసుకోవడం తెలంగాణ రాష్ట్రంలో టెక్నాలజీ మరియు ఆవిష్కరణల కేంద్రంగా ఎదుగుతున్న భాగ్యనగరం ప్రతిష్టకు గొప్ప గుర్తింపు అని అభివర్ణించారు. బలమైన మౌలిక వసతులు, వ్యాపారానుకూల విధానాలు, మరియు ప్రతిభతో నిండిన ఎకోసిస్టమ్ కారణంగా, ప్రపంచ స్థాయి కంపెనీలకు హైదరాబాద్ ప్రాధాన్య గమ్యస్థానంగా ఎదిగింది అని వివరించారు. దేశంలోని అత్యుత్తమ ఇంజనీరింగ్ మరియు టెక్నాలజీ విద్యాసంస్థలు ఉన్న నగరంగా, ప్రతి సంవత్సరం వేలాది మంది నైపుణ్యం కలిగిన వృత్తి నిపుణులను హైదరాబాద్ అందిస్తుంది అని తెలిపారు.



**1.2లక్షల ఉద్యోగాలు – మంత్రి శ్రీధర్ బాబు**

హైదరాబాద్ ప్రస్తుతం విశ్వసనీయత, సమగ్రత, ఇన్నోవేషన్ కు చిరునామాగా మారిందని అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద పెట్టుబడి నిర్వహణ సంస్థల్లో ఒకటైన వాన్‌గార్డ్ తమ 'గ్లోబల్ వ్యాల్యూ సెంటర్(జీవీసీ)' ను ప్రారంభించేందుకు హైదరాబాద్ ను ఎంచుకోవడం ఈ నగర సామర్థ్యానికి నిదర్శనమన్నారు. వాన్‌గార్డ్ ప్రపంచవ్యాప్తంగా 6.4 ట్రిలియన్ డాలర్ల ఆస్తులను నిర్వహిస్తోందని, అలాంటి సంస్థ మన దగ్గర కార్యకలాపాలు ప్రారంభించడం మనకు గర్వకారణమన్నారు. ప్రపంచ ఆర్థిక, సాంకేతిక పటంలో "తెలంగాణ" బ్రాండ్ మరింత విశ్వవ్యాప్తం అవుతుందన్నారు. ప్రస్తుతం వరల్డ్ టాప్ – 7 అస్సెట్ మేనేజ్మెంట్ కంపెనీలు హైదరాబాద్ లో తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయన్నారు. ఈ కంపెనీలు 30 ట్రిలియన్ డాలర్ల ఆస్తులను నిర్వహిస్తున్నాయని వివరించారు. వచ్చే ఏడాదిలో 120 గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల(జీసీసీ)ను ప్రారంభించి... 1.2 కొత్తగా 1.2 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

## 12 రాష్ట్రాలు/యూటీల్లో 'ఎస్ఐఆర్'

లక్షద్వీప్, పుదుచ్చేరిలు ఈ జాబితాలో ఉన్నాయి. ఈ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మొత్తం 51 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. ఈ నెల 4 నుంచి డిసెంబరు 4 వరకు ఈసీ ఓటర్ల వివరాల సేకరణ నిర్వహించనుంది. డిసెంబరు 9న ఓటర్ల జాబితా ముసాయిదాను విడుదల చేయనుంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 7న తుది ఓటర్ల జాబితా ప్రచురణతో 'ఎస్ఐఆర్' ముగియనుంది. ఈ జాబితాలోని పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరిల్లో 2026లో ఎన్నికలు నిర్వహించనున్నారు. అస్సాంలోనూ వచ్చే ఏడాది ఎన్నికలు ఉండగా.. అక్కడ 'ఎస్ఐఆర్' కోసం ప్రత్యేక తేదీని ప్రకటిస్తామని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఇటీవల వెల్లడించారు.

**సుప్రీం కోర్టును ఆశ్రయించిన డీఎంకే..**

తమిళనాడులో 'ఎస్ఐఆర్'ను సవాల్ చేస్తూ అధికార డీఎంకే సుప్రీం కోర్టును ఆశ్రయించింది. డీఎంకే కార్యదర్శి, సీనియర్ నేత ఆర్ఎస్ భారతి ఈ విషయాన్ని వెల్లడించారు. తమ పిటిషన్ నవంబర్ 6 లేదా 7న సర్వోన్నత న్యాయస్థానం లో విచారణకు వచ్చే అవకాశం ఉందని డీఎంకే ఓ ప్రకటనలో తెలిపింది.

# డిసెంబర్ 19 నుంచి 29 వరకు
# 38వ హైదరాబాద్ బుక్ ఫెయిర్

**లోగోను ఆవిష్కరించిన నిర్వాహకులు**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఈ ఏడాది డిసెంబర్ 19 నుంచి 29వ తేదీ వరకు 38వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ ను హైదరాబాద్ లోని ఎన్టీఆర్ కళాభారతి ప్రాంగణంలో నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని సోమాజీగూడ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షులు డాక్టర్ యాకూబ్ షేక్, కార్యదర్శి వాసు, కోశాధికారి పి.నారాయణరెడ్డి, సలహా మండలి సభ్యులు ఎమ్మెల్సీ ఎం.కోదండరాం, కె.రామచంద్రమూర్తి, ఎగ్జిక్యూటివ్ కమిటీ ఉపాధ్యక్షులు కె.బాల్ రెడ్డి, బి.శోభన్ బాబు, జాయింట్ సెక్రెటరీ కె.సురేశ్, సభ్యులు ఎ.జనార్ధన్ గుప్తా, యు.శ్రీనివాసరావు, టి.సాంబశివరావు, స్వరాజ్ కుమార్, డి.కిస్టారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాకుబ్ షేక్ మాట్లాడుతూ మూడేండ్లుగా ప్రతి ఏడాది డిసెంబర్‌లో పుస్తక మహోత్సవాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ ఉత్సవంలో పిల్లల పుస్తకాలు మొదలు శాస్త్రీయ పుస్తకాల వరకు అన్ని రకాల జాతీయ, అంతర్జాతీయ బుక్ స్టాల్స్ ఉంటాయని తెలిపారు. 10 రోజుల్లో 360 మంది సాహిత్యకారులను పరిచయం చేస్తున్నామనీ, ప్రతి రోజు 4 గంటల పాటు పిల్లల కోసం కార్యక్రమాలుంటాయని తెలిపారు. స్థానిక సాంస్కృతిక ఈవెంట్స్ ను నిర్వహించనున్నట్టు వెల్లడించారు. పల్లె గ్రంధాలయాలకు గతేడాది 6 వేల నుంచి 7 వేల వరకు పుస్తకాలను అందజేసినట్టు తెలిపారు. ఈ ఏడాది కూడా పుస్తకదాతల నుంచి బుక్ ఫెయిర్ లో బుక్స్ సేకరించనున్నట్టు చెప్పారు. వాసు మాట్లాడుతూ ఈ ఏడాది ముఖ్యమైన పబ్లిషర్స్ కు స్థానం కల్పించాలని నిర్ణయించినట్టు తెలిపారు. బుక్ ఫెయిర్ లో 250 నుంచి 260 వరకు స్టాళ్లు ఉంటాయని చెప్పారు. ఈ ఏడాది బుక్ ఫెయిర్ బ్యాక్ గ్రౌండ్ కలర్ గా నీలిరంగును ఎంచుకున్నట్టు తెలిపారు. గత రెండేండ్లలో వివాదానికి దారి తీసిన పుస్తకాలు, ఇతర మతాలను కించపరిచేలా ఉన్న సాహిత్యం విషయంలో కమిటీ చర్చించినట్టు చెప్పారు. అలాంటి ఘటనలు తలెత్తకుండా ఈ ఏడాది వాటిని బుక్ ఫెయిర్ లో వాటిని తగ్గించి, నిషేధించాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ ఈ ఏడాది బుక్ ఫెయిర్ గతేడాది కంటే బాగుండబోతుందని తెలిపారు. గతేడాది బుక్ ఫెయిర్ ముగిసిన వెంటనే హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ సమావేశమై సమీక్షించిందనీ, ఆ మేరకు లోటుపాట్లు మరింత సరిదిద్దుకుని రానుందని చెప్పారు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ప్రభుత్వ సహకారం కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బుక్ ఫెయిర్ ఏర్పాటుతో హైదరాబాద్ కు ప్రత్యేక గుర్తింపు వచ్చిందని హర్షం వ్యక్తం చేశారు. కె.రామచంద్రమూర్తి మాట్లాడుతూ ఈ ఏడాది బుక్ ఫెయిర్ లో ఢిల్లీ పబ్లిషర్స్ ను ఎక్కువ మందిని తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నట్టు తెలిపారు. విజ్ఞానాన్ని అందిస్తున్న బుక్ ఫెయిర్ ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

**30 వరకు దరఖాస్తులకు ఆహ్వానం**

హైదరాబాద్ బుక్ ఫెయిర్ లో పాల్గొనేందుకు దరఖాస్తులను నవంబర్ 30 వరకు అన్ని పని దినాల్లో బాగ్ లింగంపల్లి ఎం.హెచ్.భవన్ లోని హైదరాబాద్ బుక్ ఫెయిర్ కార్యాలయంలో తీసుకుంటున్నట్టు తెలిపారు. స్టాళ్ల కేటాయింపు డ్రా తేదీని తర్వాత ప్రకటిస్తారు

## షాద్ నగర్ సాంఘిక సంక్షేమ శాఖ కాలేజీని ఆకస్మికంగా సందర్శించిన చిన్నారెడ్డి

- కాలేజీ దుస్థితి, ప్రిన్సిపాల్ వ్యవహారంపై సీఎంకు త్వరలో నివేదిక అందిస్తా
- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి
- విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన చిన్నారెడ్డి





**హైదరాబాద్ (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్‌లోని నాగర్ కర్నూల్ సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల స్థితిగతులపై, ప్రిన్సిపాల్ వ్యవహారంపై సమగ్రంగా నివేదికను రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి త్వరలోనే అందించనున్నట్లు రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్, సీఎం ప్రజావాణి ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి తెలిపారు. సోమవారం షాద్ నగర్ లోని నాగర్ కర్నూల్ సాంఘిక సంక్షేమ శాఖ కాలేజిని చిన్నారెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ప్రిన్సిపాల్ వైఖరిని నిరసిస్తూ నిన్న 400 మంది విద్యార్థినిలు ఆందోళనకు దిగిన నేపథ్యంలో చిన్నారెడ్డి గురుకుల కాలేజీని సందర్శించారు. విద్యార్థినుల పట్ల కళాశాలలో ప్రిన్సిపల్ శైలజ ప్రవర్తించిన తీరును, ఇతర వివరాలు సిబ్బంది, విద్యార్థినులను చిన్నారెడ్డి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి సహ పంక్తి భోజనం చేశారు. కాలేజీలో విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలేజీ ప్రాంగణం అంతా కలియ తిరిగారు. వాష్ రూమ్స్, తరగతి గదులు అధ్వన్నంగా ఉన్న విషయాన్ని, ఇతర సమస్యలు సీఎంకు ఇచ్చే నివేదికలో ప్రస్తావిస్తానని చిన్నారెడ్డి తెలిపారు.

## దయనీయంగా పత్తిరైతుల పరిస్థితి

- తేమ పేరుతో మోసం చేస్తున్నారు
- జిల్లా పర్యటనలో కవిత విమర్శలు



**ఆదిలాబాద్, నవంబర్3 (జనంసాక్షి) :** రాష్ట్రంలో పత్తి రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని.. తేమ పేరిట రైతులను మోసం చేస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. వేరే దిక్కు లేక రైతులు ప్రైవేటుకు అమ్ముకుంటున్నారని చెప్పారు. తెలంగాణ జాగృతిబాటలో భాగంగా ఆమె జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ..ఇక్కడ బీజేపీ ఎమ్మెల్యే, ఎంపీలు ఉండి కూడా రైతులకు ప్రయోజనం లేకుండా పోయిందని ఫైర్ అయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ప్రచారం ఆపేసి రైతుల సమస్యలపై దృష్టి సారించాలన్నారు. తేమతో సంబంధం లేకుండా గిట్టుబాటు ధరకు సీసీఐ పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కవిత జాగృతి జనం బాట కార్యక్రమం ఆదిలాబాద్‌కు చేరుకుంది. షెడ్యూల్ ప్రకారం ఇవాళ ఆమె ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పర్యటించారు. ఈ మేరకు కవితకు సంప్రదాయ వాయిద్యాలు, గుస్సాడీ నృత్యాలతో ఆదివాసీలు, తెలంగాణ జాగృతి నాయకులు ఘన స్వాగతం పలికారు. జిల్లా కేంద్రంలో ఆదివాసీల ఆరాధ్య దైవం కొమురం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

## అంతా క్షణాల్లో జరిగిపోయాయి

- బస్సు ప్రమాద ఘటనపై కండక్టర్ రాధ



**రంగారెడ్డి, నవంబరు 3 (జనంసాక్షి) :** చేవెళ్ల సమీపంలో జరిగిన ఘోర బస్సు ప్రమాదం అనేక కుటుంబాలను శోకసంద్రంలో ముంచేసింది. ప్రమాదంలో ప్రాణాలతో బయటపడ్డ బస్సు కండక్టర్ రాధ ఆ భయానక ఘటనను కన్నీళ్లతో గుర్తుచేసుకున్నారు. కండక్టర్ రాధ మాట్లాడుతూ.. అంతా క్షణాల్లో జరిగిపోయిందన్నారు. టిప్పర్ చాలా వేగంగా వస్తున్నదని నేను, మా డ్రైవర్ గమనించాము. డ్రైవర్ బస్సును కిందకు తిప్పే ప్రయత్నం చేశాడు.. అలా చేయకపోయి ఉంటే ఇంకా ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోయేవారని చెప్పారు. చిట్టేపల్లి దగ్గర ఒక మహిళ బస్సులో ఎక్కింది. వికారాబాద్ దగ్గర ముగ్గురు పోలీసులు ఎక్కారు, తరువాత వారు దిగిపోయారు. అందరూ సంతోషంగా తమ పనులకెళ్లడానికి బయల్దేరారు. ఒక్క క్షణంలోనే అంతా చిద్రం అయిపోయింది. ఆ తర్వాత ఏమైందో గుర్తులేదని అన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే బస్సు లోపల కలిగిన పరిస్థితులను రాధ వర్ణిస్తూ.. డ్రైవర్ వెనుక కూర్చున్న వాళ్లపై చాలా కంకరాళ్లు పడ్డాయి. నేను పక్కకు పడిపోయాను. ఓ వ్యక్తి నన్ను లాగి కాపాడాడు. తల నుంచి రక్తం కారుతుండడంతో నా చున్నీతో నేనే కట్టుకున్నానని వివరించారు. డ్రైవర్ దస్తగిరి చాలా మంచివాడు. డ్రైవింగ్‌లో ఎప్పుడూ జాగ్రత్తగా ఉండేవాడు. నన్ను అక్కా అని పిలిచేవాడు. ఇవాళ మధ్యాహ్నం రమ్మని అడిగితే 'రాలేను అక్కా' అన్నాడు. అంతలోనే ఇంత పెద్ద విషాదం జరగడం చాలా బాధగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే వెనుక వస్తున్న వాహనాలు, జేసీబీ బృందాలు సహాయ చర్యల్లో పాల్గొన్నాయని, బస్సు, టిప్పర్ వాహనాలను పక్కకు తొలగించి గాయపడిన వారిని బయటకు తీయడం జరిగినట్లు రాధ వివరించారు.



## ఆర్య వైశ్యులకు అండగా ఐవీఎఫ్

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆర్యవైశ్యులకు అండగా ఉంటుందని, సేవా కార్యక్రమాలు తో ద్వతరగతి ఆర్యవైశ్యులకు భరోసా ఇస్తుందని అంతర్జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్త స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐవీఎఫ్ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మెన్ గౌరవాధ్యక్షుడు డూండీ రాకేష్‌కు ప్రధాన కార్యదర్శి గొంట్ల రామ్మోహనరావు, కోశాధికారి కూసుమంచి.. సుబ్బరాయులు, యువ ముజన సంఘం అధ్యక్షుడు గాజులపల్లి అభినయ్, యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మనాభుని శివ కుమార్, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు గుండా నాగ సుప్రజ, చీఫ్ కో ఆర్డినేటర్ గ్రంథి అజయ్ చంద్రాఖ్యకో ఆర్డినేటర్ చక్కా సూర్యప్రకాష్, యువజన విభాగం కోశాధికారి రవి చంద్ర లకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ గత దశాబ్దిన్నర నుంచి ఐ ఎఫ్ పలు రాష్ట్రాల్లో ఎన్నో సేవా కార్యక్రమాల మాలు నిర్వహిస్తూ అందరి గుర్తు చేశారు. పదవులు తీసుకున్న వారు బాధ్యతగా సేవలు అందించాలని, సంఘం బలోపేతం చేయడంతో పాటు ఆర్యవైశ్యులకు మేమున్నాం అనే భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఐ వి ఎఫ్ అంతర్జాతీయ సలహాదారుడు గంజి రాజమౌళి గుప్త మాట్లాడుతూ ఆర్యవైశ్యులు సంస్కృతీ, సాంప్రదాయాలకు సేవకు చిరునామా అన్నారు. కార్యక్రమం లో ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు ప్రధాన కార్యదర్శి గొంట్ల రామ్మోహనరావు తదితరులు ప్రసంగించారు. అనంతరం జాతీయ నాయకులు ఉప్పల శ్రీనివాస్ గుప్త గంజి రాజమౌళికి సన్మానం చేశారు. ఈ ఐవీఎఫ్ సలహాదారుడు ముత్యాల సత్తయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప బ్బా చంద్రశేఖర్ గుప్త, ప్రధమ మహిళ ఉప్పల స్వప్న, ఐవీఎఫ్ మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల, ఐవీఎఫ్ రాష్ట్ర యువజన కోశాధికారి నరేష్ గుప్త , రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చింతల రజినీకాంత్ , ఐవీఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎంల కమిషన్ ప్రక్రియ పూర్తి

**హైదరాబాద్ (జనంసాక్షి) :** నగరంలోని కోట్ల విజయ భాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక కు సంబంధించి ఈవీఎం ల కమిషన్ ప్రక్రియ ఈ నెల 2, 3 వ తేదీలలో రిటర్నింగ్ అధికారి చేపట్టారు. పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి ఏజెంట్ల సమక్షంలో జరిగిన ఈ ప్రక్రియను ఎన్నికల సాధారణ పరిశీలకులు రంజిత్ కుమార్ సింగ్, పోలీస్ పరిశీలకులు ఓం ప్రకాశ్ త్రిపాఠి, జిల్లా ఎన్నికల అధికారి జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ లు పరిశీలించారు.

## మణిపూర్ అభివృద్ధికి యాక్షన్ ప్లాన్ ఇవ్వండి


- మణిపూర్ పర్యటనలో కేంద్ర మంత్రి బండి సంజయ్ వెల్లడి



**ఇంపాల్ (జనంసాక్షి) :** మణిపూర్ రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం వారం రోజుల్లో కార్యాచరణ రూపొందించి పంపాలని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యంగా విద్య, వైద్యం, రవాణా, టూరిజం, విద్యుత్, వ్యవసాయ, అనుబంధ రంగాల అభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. మణిపూర్ అల్లర్ల బాధితుల సహాయ పునరావాసం కోసం ఇప్పటికే కేంద్రం రూ.500 కోట్లు ఖర్చు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. మణిపూర్ ప్రజల అభివృద్ధి, సంక్షేమమే నరేంద్రమోదీ ప్రభుత్వ లక్ష్యమని, అందులో భాగంగా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై నివేదిక ఇవ్వాలని సూచించారు. మణిపూర్ ప్రజలు హ్యాండ్లూం ఉత్పత్తులకు పెద్ద ఎత్తున డిమాండ్ ఉన్న దృష్ట్యా ప్రతి రాష్ట్రంలో 'మణిపూర్ మేళా' పేరుతో స్థానిక ఉత్పత్తులను విక్రయించేలా కార్యాచరణ రూపొందంచాలని కోరారు. మణిపూర్ సాంస్కృతిక, వారసత్వ సంపద చాలా గొప్పదని, వాటని కాపాడుకుంటూ పర్యాటక అభివృద్ధి కోసం పాటుపడాలని సూచించారు. మూడు రోజుల మణిపూర్ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ రాష్ట్ర రాజధాని ఇంపాల్ కు చేరుకున్నారు. స్థానిక ఎయిర్ పోర్టులో అధికారులు కేంద్ర మంత్రికి ఘన స్వాగతం పలికారు. అక్కడి నుండి రాష్ట్ర సచివాలయానికి చేరుకున్న బండి సంజయ్ రాష్ట్రంలో అమలవుతున్న కేంద్ర సంక్షేమ పథకాల అమలు తీరుపై రెండు గంటలకుపైగా సమీక్షించారు. ముఖ్యంగా విద్య, వైద్యం, రవాణా, టూరిజం, విద్యుత్, హెూం, వ్యవసాయం, అనుబంధ రంగాలపై 2 గంటలకుపైగా సమీక్ష జరిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మణిపూర్ జనాభా 28 లక్షలు. రాష్ట్రంలోని 92 శాతం ప్రజలు కొండ ప్రాంతాల్లో (హిల్ స్టేషన్స్) లోనే నివసిస్తున్నారు. ఆయా ప్రాంతాల ప్రజలకు అందుతున్న విద్య, వైద్యం, విద్యుత్, రవాణా సౌకర్యాలపై ఆరా తీశారు. వీటితోపాటు టూరిజం, హెూం, వ్యవసాయ, అనుబంధ రంగాల అభివృద్ధి కోసం కేంద్రం ఖర్చు చేస్తున్న నిధులు ఎంత మేరకు సక్రమంగా వినియోగం అవుతున్నాయనే అంశంపై చర్చించారు. మణిపూర్ లో ప్రధానంగా ఉపాధి కొరత ఉందని, గ్రామీణ ప్రాంతాలకు పూర్తి స్థాయిలో రవాణా సౌకర్యం లేదని, కొండ చరియలు విరిగిపడటంసహా ప్రకృతి విపత్తుల వల్ల నిత్యం రోడ్లు ధ్వంసమవుతున్నాయని వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఈ సందర్భంగా అధికారులు కేంద్ర మంత్రికి విన్నవించారు.

## ధర్మం ముసుగులో దాడి చేస్తే కేసులు ఉండవా?

- దేశభక్తులు ఎవరో, దేశద్రోహులు ఎవరో చర్చ జరగాలి
- రాజ్యాంగాన్ని ధిక్కరించేవారు దేశద్రోహులు
- సీజేఐపై దాడికి చట్టపరమైన చర్యలు ఎందుకు లేవు?
- నవంబర్ 17న 'ఛలో ఢిల్లీ'
- ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



**హైదరాబాద్, నవంబర్ 3 (జనంసాక్షి) :** సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయిపై జరిగిన అమానుష దాడి ఘటన నేపథ్యంలో దేశభక్తులు ఎవరో, దేశద్రోహులు ఎవరో అనే అంశంపై విస్తృత చర్చ జరగాలని, భారత రాజ్యాంగాన్ని ధిక్కరించే వారు దేశద్రోహులేనని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ప్రెస్‌మీట్లో ఆయన మాట్లాడుతూ.. "దేశంలో సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్, అది కూడా దళితుడైన గవాయి మీద దాడి జరిగి నెలరోజులు కావస్తున్నా చట్టపరమైన చర్యలు లేకపోవడం అత్యంత దారుణం. ఒక సాధారణ ఘటనపై కూడా వ్యవస్థలు సుమోటోగా స్పందిస్తుంటే, చీఫ్ జస్టిస్‌పై దాడి జరిగినా ఎందుకు స్పందించడం లేదో అర్థంకావడం లేదు," అని ప్రశ్నించారు. 'ధర్మం' ముసుగులో దాడులు చేస్తే చట్టం మౌనంగా ఉండకూడదని, ధర్మం, విశ్వాసం అన్నవి రాజ్యాంగం, చట్టం కిందనే ఉండాలని మంద కృష్ణ మాదిగ స్పష్టం చేశారు. "రాజ్యాంగం ఏర్పడిన తర్వాతనే దళితులు మనుషులుగా గుర్తింపు పొందారు. రాజ్యాంగాన్ని ధిక్కరించడం అంటే దళితుల గౌరవాన్ని ధిక్కరించడం," అని ఆయన పేర్కొన్నారు. దళితులపై దాడులు చేయడం అంటే రాజ్యాంగంపై దాడి చేయడమేనని, అలాంటి చర్యలను సహించబోమని హెచ్చరించారు. "భారతదేశంలో ఉంటూ భారత రాజ్యాంగాన్ని గౌరవించే వారే దేశభక్తులు. రాజ్యాంగాన్ని అవహేళన చేసేవారు దేశద్రోహులు," అని ఆయన స్పష్టం చేశారు. గవాయిపై దాడి దళితులపై, రాజ్యాంగంపై దాడిగా ఉందని పేర్కొంటూ, దాడికి సంబంధించిన కేసు నమోదు చేయకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. నవంబర్ 17న ఢిల్లీలో "దళితుల ఆత్మగౌరవ ర్యాలీ"ని విజయవంతం చేయాలని, దేశవ్యాప్తంగా ఉన్న దళితులు, అణగారిన వర్గాలు, ప్రజాస్వామికవాదులు పెద్దఎత్తున పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. "మొన్న హైదరాబాద్‌లో జరిగిన దళితుల ఆత్మగౌరవ ర్యాలీని మీడియా సంస్థలు ఉద్దేశపూర్వకంగా ప్రచురించకపోవడం దళితులపై వివక్షతకు మరో నిదర్శనం," అని ఆయన విమర్శించారు.

## ముఖ్యమంత్రిని కలిసిన అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రతినిధులు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** కొడంగల్ నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేందుకు అక్షయ పాత్ర ఫౌండేషన్ ముందుకు వచ్చింది. సోమవారం ఉదయం అక్షయ పాత్ర పౌండేషన్ ప్రతినిధులు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని కలిశారు. నవంబర్ 14వ తేదీన కొడంగల్ లో నిర్మించ తలపెట్టిన గ్రీన్ ఫీల్డ్ కిచెన్ ప్రారంభోత్సవానికి రావాలని ముఖ్యమంత్రిని ఆహ్వానించారు. మధ్యాహ్న భోజనం తయారు చేసేందుకు కొడంగల్ సమీపంలోని ఎన్కేపల్లిలో రెండెకరాల విస్తీర్ణంలో అక్షయ పాత్ర ఫౌండేషన్ గ్రీన్ ఫీల్డ్ కిచెన్ నిర్మించనుంది. గ్రీన్ ఫీల్డ్ కిచెన్ లో వండిన భోజనాన్ని నియోజకవర్గం లోని అన్ని పాఠశాలలకు సరఫరా చేస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనానికి ఒక్కో విద్యార్థికి రూ.7 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తోంది. నాణ్యమైన భోజనం తయారు చేసి అందించేందుకు అక్షయ ఫౌండేషన్ దాదాపు రూ.25 వరకు ఖర్చు పెడుతుంది. ప్రభుత్వం చెల్లించే నిధులకు అదనంగా అయ్యే ఖర్చును అక్షయ పాత్ర ఫౌండేషన్ భరిస్తుంది. కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) నిధుల సాయంతో ఈ పథకం అమలు చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటోంది. గత ఏడాది డిసెంబర్ నుంచి ఈ నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల్లో పిల్లలకు బ్రేక్ ఫాస్ట్ అందించే పథకం విజయవంతంగా అమలవుతుంది. 312 పాఠశాలల్లో దాదాపు 28 వేల మంది విద్యార్థులకు ప్రతి రోజు ఉదయాన్నే అల్పాహారం అందిస్తున్నారు. అన్ని గ్రామాల్లో పిల్లలు, తల్లిదండ్రుల నుంచి ఈ పథకానికి మంచి స్పందన వచ్చింది. ఈ పథకం దేశంలోనే అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది.

# భారత వ్యవసాయ విధానానికి
# ధర సమీక్ష అవసరం!

భారత దేశంలోని వ్యవసాయ విధానం చాలా కాలంగా చర్చనీయాంశంగా ఉంది. రైతుల ఆదాయాలు తరచుగా ధరల పతనం, డిమాండ్–సరఫరా అసమతుల్యతలు, కొనుగోలుదారుల ఆధిపత్యం వంటి కారణాలతో తీవ్రంగా మారుతున్నాయి. మార్కెట్‌లోని లోపాలను సరిచేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వ విధానాలు రూపొందించినా, రైతులకు సరైన ధర లభించడమే ప్రధాన సమస్యగా మిగిలిపోతోంది. సరుకు రవాణా, నిల్వ సదుపాయాలు, కొనుగోలుదారుల ఆధిపత్యాన్ని అరికట్టకపోతే రైతు సంక్షేమానికి ఉద్దేశించిన ఏ విధానం అయినా ఫలప్రదం కాబోదు.



భారత రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ధరల అస్థిరత. మార్కెట్ లోపాలు, విధాన అమలులో లోపాలు, డిమాండ్‌లో అనిశ్చితి ఈ అస్థిరతకు కారణమవుతున్నాయి. ధరల మార్పుల నుండి రైతులను రక్షించడానికి ఉద్దేశించిన కనీస మద్దతు ధర పద్ధతి అనేక పరిమితులు కలిగి ఉంది. అనేక పంటలకు మద్దతు ధర ఉత్పత్తి వ్యయాన్ని కూడా పూర్తిగా కవర్ చేయడం లేదు. ప్రభుత్వ కొనుగోలు కూడా కొద్ది పంటలు, కొద్ది ప్రాంతాలకు మాత్రమే పరిమితమై ఉండడం వల్ల ఎక్కువ మంది రైతులు వ్యాపారుల చేతిలో నష్టపోతున్నారు.

వ్యవసాయ మార్కెట్ వ్యవస్థలో అనేక నిర్మాణాత్మక సమస్యలు ఉన్నాయి. సరైన రహదారి సదుపాయాలు లేకపోవడం, నిల్వ కేంద్రాల కొరత, గిడ్డంగుల లేకపోవడం వల్ల రైతులు తమ పంటలను నిల్వ చేయడం లేదా సరైన సమయానికి మార్కెట్‌కు చేర్చడం సాధ్యం కావడం లేదు. అనేక మార్కెట్లలో కొద్దిమంది వ్యాపారులు కలసి ధరలను నియంత్రిస్తున్నారు. ఫలితంగా రైతులు తక్కువ ధరకు తమ పంటలను అమ్ముకోవాల్సి వస్తోంది. చిన్న రైతులు ఎక్కువగా నష్టపోతున్నారు, ఎందుకంటే వారికీ మార్కెట్ ప్రాప్యత చాలా తక్కువగా ఉంది, ధరలపై చర్చించే స్థాయి లేదు. ఈ సమస్యలను పరిష్కరించడానికి బహుముఖ దృక్పథం అవసరం. మొదటగా కొనుగోలుదారుల వర్గాన్ని విస్తరించడం అత్యంత ముఖ్యం. ప్రాసెసింగ్ యూనిట్లు, ఎగుమతిదారులు, సంస్థాగత కొనుగోలుదారులను మార్కెట్‌లోకి తీసుకురావడం ద్వారా వ్యాపారుల ఆధిపత్యాన్ని తగ్గించవచ్చు. గ్రామీణ రహదారులు, చల్లని నిల్వ కేంద్రాలు, తక్కువ ఖర్చుతో గిడ్డంగులు వంటి బలమైన రవాణా సదుపాయాలను అభివృద్ధి చేయడం ద్వారా పంట నష్టాలు తగ్గుతాయి. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు లేదా సమీకరణ కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా చిన్న రైతులు సామూహికంగా తమ పంటలను అమ్ముకునే అవకాశం పొందుతారు. ఈ చర్యలు లావాదేవీ ఖర్చులను తగ్గిస్తాయి. ఈశాన్య రాష్ట్రాలు, కొండప్రాంతాలు, ఎండకు గురయ్యే ప్రాంతాలకు ప్రత్యేకంగా తగిన విధానాలను రూపొందించడం అవసరం. సేంద్రీయ వ్యవసాయం, సమగ్ర పురుగు నియంత్రణ, పంట వైవిధ్యీకరణ వంటి పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా ఉత్పత్తి వ్యయాలను తగ్గించి నేల సారాన్ని పెంచవచ్చు.

మొత్తానికి, భారతదేశం యొక్క వ్యవసాయ విధానం ధరల పునఃపరిశీలన అవసరమైన దశకు చేరుకుంది. ఉత్పత్తి లక్ష్యాలకంటే రైతు ఆదాయం స్థిరత్వంపైనే దృష్టి పెట్టాలి. రైతులకు న్యాయమైన మార్కెట్ ప్రాప్యత, పారదర్శక ధర వ్యవస్థ, బలమైన గ్రామీణ మౌలిక వసతులు అందించగలిగితేనే వ్యవసాయ రంగం అభివృద్ధి సాధ్యమవుతుంది. కొనుగోలుదారుల ఆధిపత్యాన్ని తగ్గించే, గ్రామీణ సదుపాయాలను బలపరిచే, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించే సమగ్ర విధానం ద్వారా గ్రామీణ జీవనోపాధి మెరుగుపడుతుంది, రైతు ఆదాయం పెరుగుతుంది, దేశానికి ఆహార భద్రత బలపడుతుంది.ప్రస్తుతం భారత వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న అత్యంత తీవ్రమైన సమస్య ఉత్పత్తి ధరల మధ్య ఉన్న అసమతుల్యత. రైతులు కష్టపడి పండిస్తున్నా, తగిన లాభం పొందడం లేదు. ఇది వ్యవస్థాపక లోపం వల్ల ఏర్పడిన విరుద్ధ పరిస్థితి. ఈ పరిస్థితి సరిచేయాలంటే రైతు కేంద్రీకృత విధానాలు, సరైన మార్కెట్ వ్యవస్థ, నిష్పాక్షిక ధర నియంత్రణ అవసరం. రైతు చెమట చుక్కకు విలువ ఇచ్చే సమాజం ఏర్పడితేనే భారత వ్యవసాయం నిజమైన అర్థంలో వికసిస్తుంది.



డాక్టర్. రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం.

# నిన్నటి అక్షరం నేటి వెలుగు

సారస్వత ప్రపంచంలో ప్రతి భాషకు ఒక ఉజ్వలమైన భూతకాలం ఉంటుంది. అదే నేటి వర్తమానానికి దిశానిర్దేశం చేసి, రేపటి భవిష్యత్తుకు బాటలు వేస్తుంది. తెలుగు భాషా సౌందర్యం, సంస్కృతీ వైభవం వేల సంవత్సరాలుగా మన పూర్వ కవుల కలాల నుండి జాలువారిన గ్రంథాలలో నిక్షిప్తమై ఉన్నాయి. నేటి ఆధునిక జీవన వేగంలో పరుగులు తీస్తున్న తరుణంలో, నిన్నటి తరాల సాహిత్య వారసత్వాన్ని – ముఖ్యంగా మహాభారత కవులైన నన్నయ, తిక్కన, ఎర్రన త్రయం నుండి ప్రబంధ యుగపు అష్టదిగ్గజాల వరకు వెలసిన ప్రాచీన కావ్యాలను ఎందుకు పరిశీలించాలి? అనే ప్రశ్న తలెత్తుతుంది. ఈ ప్రాచీన సారస్వతం కేవలం చరిత్రకు సంబంధించిన గ్రంథం కాదుబీ ఇది మన సంస్కృతికి మూలస్తంభం, మన భాషకు ప్రాణవాయువు, మన వ్యక్తిత్వ వికాసానికి దర్పణం.

**భాషా నిర్మాణ విశ్లేషణ, శబ్ద సౌందర్యం:**
ప్రాచీన తెలుగు సాహిత్య అధ్యయనం మన భాషా సంస్కృతుల మూలాలను తెలుసుకోవడానికి కీలకం. నన్నయ భట్టారకుడి నుంచి పోతన, శ్రీనాథుడు, పెద్దన, క్షేత్రయ్య వంటి కవిశ్రేష్ఠులు తమ కావ్యాలలో, ప్రబంధాలలో, శతకాలలో ఉపయోగించిన తెలుగు పదజాలపు లోతులు, పదబంధాల సొగసులు నేటి భాషావేత్తలకు, రచయితలకు ఒక గొప్ప పాఠశాల. ఆ ప్రాచీన తెలుగు భాష శబ్ద సౌందర్యాన్ని, భావ గాంభీర్యాన్ని మనం పూర్తిగా ఆస్వాదించాలంటే ఈ అమూల్య నిధిని మననం చేయాలి. ప్రాచీన కవులు ఛందస్సు, అలంకారాలు, వ్యాకరణ పటిమ విషయంలో అద్భుతమైన నియమ నిబద్ధతను పాటించారు. దేశీ, మార్గ కవితా రీతులను మేళవించి, అక్షర రమణీయతను సాధించారు.

**సామాజిక, చారిత్రక దర్పణం:**
ప్రాచీన తెలుగు సాహిత్యం కేవలం కల్పిత కథల సమాహారం కాదుబీ అది ఆయా కాలాల సామాజిక, చారిత్రక పరిస్థితులకు అద్దం పడుతుంది. పల్నాటి వీరచరిత్ర వంటి కావ్యాలు నాటి వీరత్వం, యుద్ధ సంస్కృతిని వివరిస్తే, శ్రీనాథుడి రచనలు నాటి దారిద్ర్యం, రాజాశ్రయ వైభవం మరియు ఆనాటి దుస్థితిని సజీవంగా చిత్రీకరిస్తాయి. ప్రబంధాలలో వర్ణించిన రాజుల ఆచార వ్యవహారాలు, వేషధారణ, రాజధాని నగరాల శోభ, అంతఃపురాల తీరు తెన్నులు ఇవన్నీ చరిత్రకారులకు విలువైన సమాచారాన్ని అందిస్తాయి. ఆనాటి స్త్రీల స్థితిగతులు, కుల మతాల సంబంధాలు, ఆర్థిక కార్యకలాపాలు, వ్యవసాయ పద్ధతులు వంటి సామాజిక అంశాలను సాహిత్యం ద్వారానే మనం తెలుసుకోగలం. ఈ అధ్యయనం మన పూర్వీకుల జీవన విధానాన్ని, వారి ఆలోచనా ధోరణిని అర్థం చేసుకోవడానికి ఒక గొప్ప వారధిగా నిలుస్తుంది.

**నైతిక, తాత్విక మార్గదర్శనం:**
ప్రాచీన సారస్వత ప్రధాన లక్ష్యం కేవలం వినోదం అందించడమే కాదు, అది ధర్మాన్ని, నీతిని, వైరాగ్యాన్ని కూడా బోధిస్తుంది. పోతన భాగవతంలోని భక్తి తత్వం, సుమతీ శతకం, వేమన శతకంలోని లౌకిక నీతి, సామాజిక విమర్శనాత్మక దృక్పథం ఇవన్నీ కాలంతో సంబంధం లేకుండా, నిత్య జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి, ఉత్తమ జీవన మార్గాన్ని అనుసరించడానికి మార్గదర్శనం చేస్తాయి. వేమన పద్యాలలో నిక్షిప్తమైన నిష్కర్షమైన విమర్శ, ఆధునిక సమాజంలో కూడా ఆచరణీయమైన మానవ సంబంధాల తత్వాన్ని వివరిస్తాయి. ఈ రచనలు మనలో సహనం, దయ, సత్య నిష్ఠ, దాన గుణం వంటి ఉదాత్తమైన మానవ విలువలను పెంపొందించి, కేవలం ధనార్జన యంత్రాలుగా కాకుండా వివేకం కలిగిన పౌరులుగా మనల్ని తీర్చిదిద్దడానికి దోహదపడతాయి. ప్రాచీన సాహిత్యంలోని శాశ్వత విలువలు ఆధునిక మానవుడి ఆత్మాన్వేషణకు, తాత్విక వివేచనకు ప్రాతిపదికలు.

**సృజనాత్మకతకు శిక్షణ:**
ప్రాచీన సాహిత్య శైలీ విన్యాసం, అలంకార ప్రయోగ నైపుణ్యం, రసపోషణ నేటి రచయితలు, కవులు, కళాకారులకు అపారమైన సృజనాత్మక ప్రేరణను అందిస్తుంది. ప్రబంధాలలో కవులు ఎంచుకున్న అపూర్వమైన ఇతివృత్తాలు, పాత్రల మనస్తత్వ చిత్రణలో చూపిన సూక్ష్మత, కథా కథనంలో పాటించిన ఉత్కంఠభరితమైన నడక ఇవన్నీ ఆధునిక రచనలలో నూతన ప్రక్రియలను మేళవించడానికి ఉపకరిస్తాయి. అల్లసాని పెద్దన వంటి కవులు ప్రయోగించిన వర్ణనా వైవిధ్యం, తిక్కన సోమయాజి నాటకీయ శైలి, శ్రీనాథుడి పదగుంఫనం ఆధునిక రచయితలకు పాఠాలు.

**గుర్తింపు, వారసత్వ పరిరక్షణ:**
ప్రపంచీకరణ, సాంకేతిక విప్లవం నేపథ్యంలో, యువత తమ సాహితీ వారసత్వాన్ని విస్మరించే ప్రమాదం ఉంది. పాత తెలుగు సాహిత్యాన్ని చదవడం అనేది మన పూర్వీకుల జ్ఞానాన్ని, అనుభవాన్ని గౌరవించడం మాత్రమే కాదు, మన సాహితీ వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించడానికి మనం చేస్తున్న పవిత్ర ప్రయత్నం. నన్నయ భారతం నుండి కందుకూరి వీరేశలింగం గారి యుగం వరకు సాగిన సాహిత్య ప్రవాహం మన తెలుగుదనపు ఔన్నత్యాన్ని, మన ఉమ్మడి చరిత్రను సగర్వంగా చాటుతుంది. మన మూలాలను, మన చరిత్రను మనం బలంగా తెలుసుకున్నప్పుడే, ప్రపంచంలో మనం ఎక్కడ ఉన్నా, మన తెలుగు భాషా వైభవాన్ని గర్వంగా ప్రకటించగలం. ప్రాచీన తెలుగు సాహిత్యం అనేది కేవలం గతానికి సంబంధించిన వస్తువు కాదు. అది మన వర్తమానాన్ని ప్రకాశింపజేసి, భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేసే దివ్యమైన కాంతి. ఈ సాహిత్యం మన భాష కు పట్టుకొమ్మ, మన సంస్కృతికి జీవనది. ఈ అక్షయ సారస్వత సంపదను ప్రతి తెలుగు పాఠకుడూ, రచయితా అధ్యయనం చేయడం అనేది తమ వ్యక్తిగత వికాసానికి, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు అనివార్యమైన కర్తవ్యం.

డి జయరాం
9440485824

# ఏఐ మనిషికి వరమా!శాపమా!
# భవిష్యత్ మార్గం ఏమిటి?




మానవుడు పుట్టినది మొదలుకొని,గిట్టే వరకు ఎప్పుడూ సవాళ్లను ఎదుర్కొంటూనే ఉన్నాడు. అతని మేధస్సుఅతని మనుగడకు ఎదురయ్యే ప్రతి సమస్యలను, సవాళ్ళను అధిగమించి విటిని అవకాశాలుగా మార్చుకున్నాడు.ఇప్పుడు (ఏఐ) కూడా అలాంటి సవాలు మాత్రమే. ఇది భయం కాదు, మార్పు. శత్రువు కాదు మిత్రుడు.

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఎలా వచ్చింది?: మానవుడు శారీరక శ్రమ తగ్గించడానికి అనేక రంగాల్లో, పలు రకాల యంత్రాలు కనుగొన్నాడు. అలాగే కంప్యూటర్లు మానసిక శ్రమ తగ్గించాయి. ఇంటర్నెట్ దూరాలను చిన్నవి చేసింది. ఇవన్నీ మనిషి ఆదేశాల మేరకు పనిచేశాయి. కానీ (ఏఐ ) కూడా మానవ సృష్టే తన సౌలభ్యం, సౌకర్యకోసం సృష్టించుకొన్నదే. కాకపోతే ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) స్వయంగా ఆలోచిస్తుంది. స్వయంగా నిర్ణయాలు తీసుకుంటుంది. వేగంగా, దోషరహితంగా పనిచేస్తుంది.

**(ఏఐ)తో లాభాలు ఏమిటి?:**
ఏఐ మానవ మేధో శ్రమను తగ్గిస్తుంది. వైద్యంలో రోగ నిర్ధారణ సులభమవుతుంది. క్లిష్టమైన ఆపరేషన్లు సులభంగా చేస్తుంది. విద్యలో వ్యక్తిగత బోధన సాధ్యమవుతుంది. వ్యవసాయంలో పంటల దిగుబడి పెరుగుతుంది. పరిశ్రమల్లో ఉత్పత్తి వేగవంతం అవుతుంది. ఏఐ మనిషి కంటే ఖచ్చితంగా పనిచేస్తుంది. 24 గంటలూ అలుపులేకుండా పనిచేస్తుంది.

**(ఏఐ )తో సమస్యలు ఏమిటి?**
సాఫ్ట్‌వేర్ కంపెనీలు లక్షల మంది ఉద్యోగులని తొలగిస్తున్నాయి. చిన్న, మధ్య,భారీ తరగతి పరిశ్రమల్లో సైతం కార్మికుల అవసరం తగ్గింది. ఉద్యోగాలు ఊడిపోతున్నాయి. వారికి ఉపాధి కరువైంది. కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో పడుతున్నాయి. ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. మానవ మనుగడ భారంగా ప్రశ్నార్థకంగా మారింది. భవిష్యత్ మార్గం ఏమిటి? ఏఐని ఎదుర్కోవడం కాదు, దానితో కలిసి నడవడం అవసరం. మనిషి ఏఐని సృష్టించాడు. దాన్ని నియంత్రించగలడు. దాన్ని మెరుగుపరచగలడు. ఏఐ మనిషికి సేవకుడు, పోటీదారుడు కాదు. పరిష్కార మార్గాలు ఏమిటి? నైపుణ్యాలు పెంచుకోండి.ఏఐ నేర్చుకోండి. డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్ నేర్చుకోండి. ఏఐతో పనిచేసే ఉద్యోగాలు పుట్టుకొస్తాయి. మనిషి తన సృజనాత్మకతను పెంచుకోవాలి. బద్ధకం మనకు ప్రేమ శత్రువు. ఏఐ మనిషిలా ఆలోచిస్తుంది, కానీ మనిషి ని మంచి సృజన చేయలేదు.కళ, సాహిత్యం, సంగీతం, డిజైన్ రంగాలు సురక్షితం. మానవ భావాలు, ఊహలు ఏఐకి ఎప్పటికీ రావు. ఏఐ కూడా మనిషి సహాయం, సహకారం అందించే జ్ఞానం కలిగిన మిత్రునిగా భావించాలి. ఏఐ అనంతరం కూడా కొత్త వృత్తులు పుట్టుక వస్తాయి.వాటి మనం సృష్టించాలి. ఉదాహరణకు ఏఐ నిర్వహణ, ఏఐ ఎథిక్స్, ఏఐ భద్రత మొదలైన అనేక ఉద్యోగాలు వస్తాయి.గ్రీన్ టెక్నాలజీ, సస్టైనబుల్ డెవలప్‌మెంట్ రంగాలు విస్తరిస్తాయి. నిరుద్యోగాన్ని అన్ని స్థాయిల్లో తగ్గించటానికి కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలి. యూనివర్సల్ బేసిక్ ఇన్‌కమ్ (యూబీఐ) అమలు చేయాలి. ఉచిత విద్యను, శిక్షణ కార్యక్రమాలు ప్రవేశపెట్టాలి. ఏఐ పన్నులు విధించి,నిరుద్యోగులకు ఆ ఫండ్ తో సహాయం చేయాలి. సమాజం కూడా జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు, పరిణామాలకు తగిన విధంగా మారాలి. మనిషి కేవలం ఉద్యోగం కోసం కాక, జీవితం కోసం జీవించాలి.ప్రతి మనిషికీ మనసు ఉంటుంది.అతనికి కుటుంబం, స్నేహం, ఆరోగ్యం ముఖ్యం. వాలంటీరింగ్, సామాజిక సేవలు పెంచుకోవాలి . నిరాశ, నిస్పృహలు, అశాంతిని వీడాలి.

**మానసిక ధైర్యం ఎలా పొందాలి?**
భయపడకండి. ప్రతి మార్పు కొత్త అవకాశం కోసమే.గతంలో కూడా అనేక నూతన యంత్రాలు, పరికరాలు (కంప్యూటర్లు) వచ్చినప్పుడు కార్మికులు, ఉద్యోగులు ఇదే విధంగా భయపడ్డారు. ప్రతి యంత్రం,పరికరం నూతనంగా అప్‌డేట్స్‌తో కొత్త రూపాన్ని, కొత్త అదనపు సౌకర్యాలు అందించటానికి రూపాంతరం చెందుతాయి.పాత మోడళ్లు,పాత డిజైన్లు వస్తాయి.ఎందుకంటే మానవుని కోరికలు, అభిరుచులు అనంతం.వాటిని తీర్చడానికే మానవుడు సృజనాత్మకంగా కొత్త ఉద్యోగాలు సృష్టించాడు. ఇప్పుడు కూడా అదే జరుగుతుంది. భయం, నిరుత్సాహం, నిస్తేజం దేనికి?మనం మానషులం. మనలో ఉన్న శక్తి, సామర్థ్యం ,ఊహాలు, సృజనాత్మకత, కోర్కెలు, అనుభవాలు,అభిరుచులు, అనంతం. ఇవి ఏఐలో లేవు. రావు.అనుభవం, భావోద్వేగం, సహానుభూతి మనిషికే సొంతం.అవి ఏ యంత్రానికి,పరికరానికి రావు.

**మరి కొన్ని సలహాలు:**
రోజూ కొత్తది నేర్చుకోవాలనే జిజ్ఞాస పెంచుకోవాలి. ఏఐని స్నేహితుడిగా చూడండి. అది నీ శత్రువు కాదు.మనిషి తన శారీరక, మానసిక ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి. కుటుంబంతో, స్నేహితులతో సమయం గడపండి.మీ కష్ట, సుఖాలు, భావాలు పంచుకోండి. పెద్దల అనుమానాలు,సలహాలు, సూచనలు, ఆశీస్సులు తీసుకోండి.ఒంటరితనాన్ని జయించాలి. అందరితో కలివిడిగా ఉండాలి.కష్టాలు,బాధలు సహజం.అవి శాశ్వతం కావు.మంచి సాహిత్యం, సంగీతం ఊరట కలిగించే సాధనాలు. అన్నీ మనం సమాజం నుండి పొందటమే కాదు. సమాజానికి మనం కూడా ఇవ్వటం నేర్చుకోవాలి.


ఏఐ మానవ చరిత్రను మారుస్తుంది. కానీ మానవుడు దాని సృష్టికర్త అని మరువకు. ఏఐని ఉపయోగించి, సమాజాన్ని మెరుగుపరచండి. ఉద్యోగం కోల్పోయినా, ఆశ కోల్పోకండి. మీరు బతకడం కోసం పుట్టారు, ఉద్యోగం కోసం కాదు. ఏఐ యుగం మానవుని విజయ యుగం కాగలదు.

ధైర్యంగా ముందుకు అడుగులు వేయండి.

డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్.
9849328496.

# అమ్మకదా

మంత్రాల సర్పంచు దుస్తంత్రాల పట్వారి
తంత్రాల పటేల్ కుతంత్రాల దొర
ఎవరు చెప్పినా అమ్మను
మా తాత పొర్లాడిండు
మా అయ్య తిరుగులాడిండు
నేనెట్ల అమ్మేది
అమ్మలేనని చెప్పేది
టీకొట్టులో ఛీకొట్టినా
కిరాణాకొట్టులో చివాట్లు పెట్టినా
పరవాలేదు బి
అమ్మను వెలేయండి మోలేయండి
అమ్మను
అమ్మడానికి అది గంటచూట్టా కాదు
అమ్మడానికి అది అగ్గిపెట్టె కాదు
నా పిల్లలు సాలెకి పోయిరి
చదువులు నేర్చిరి కొలువులకి వెళ్ళిరి
మమ్మల్ని చల్లంగా చూసిన భూమిని వదిలేది



లేదు మమ్మల్ని మెల్లంగా సాకిన భూమిని
విడిచేది లేదు
ఏడాదికో శివరాత్రి జాతర
ఏడాదికో నవరాత్రి జాతర
మాకు
నారు వేస్తుంటే జాతర
పైరు కోస్తుంటే జాతర
ఏరువాకలు ఎదురుపడితే ఆరుగాలం
అలుపెరుగని జాతర
ఆశతో మెడలు వంచాలన్నది బ్రోకర్ల కుహకం
దురాశతో తొడలు విరచాలన్నది మేకర్ల
నిర్వాకం భూమి లేకుంటే రైతులేడు
రైతు లేకుంటే భూమిలేదు
భూమికి పర్యాయపదం రైతు
రైతుకి మర్యాదపదం భూమి
మంచెను కూల్చాలా ?
కంచెను కాల్చాలా ?
మేకలు కసాయికా?ఆవులు ఆల్కబీర్ కా ?
పొలంలో నేను నడుస్తుంటే ఆనంద నాట్యాలు
చేస్తూ ఎగిరే ధూళి కణాల్ని
కాలువల ద్వారా నాతో పాటే నడిచే
నీటి బిందువుల్ని
ఎలా మరువగలను ?
కరెన్సీ కట్టలు బ్యాంకు వడ్డీలు
రైతును పిలవలేవు కొలవలేవు
రైతు రైతే
నాగలి మోసేవాడు రైతు
ఆకలి తీర్చేవాడు రైతు
వానలు లేవనో వాగులు రావనో
అమ్మను
కరాళ కరువుల పాదాక్రాంతాలు
కర్కశ కౌరవుల అన్యాక్రాంతాలు
నన్ను అమ్మించలేవు నమ్మించలేవు
బతుకీడుస్తున్నది
సంసార బండి లాగిస్తున్నది ఈ భూమే
జీవనాధారం ఈ భూమే
వెలుగు రేఖలు ప్రసరిస్తున్నది ఈ భూమే
భూమి లేకుంటే నేనెగరేసేది
సూత్ర రహిత గాలిపటమే
భూమి లేకుంటే నేనెమరేసేది
పాత్ర విహిత చిత్రపటమే
మా తాత సమాధి దగ్గర మా అయ్య
మా అయ్య సమాధి దగ్గర రేపు నేనూ
నా పిల్లలు రైళ్ల మీద బస్సుల మీద ఊరువచ్చి
ఆరడుగులనేల అప్పుగా అడగాలా ?
అమ్మను

కోటం చంద్రశేఖర్
9492043348

# ప్రకృతితో సామరస్యం.. సుస్థిర భవిష్యత్తు

### అంతర్జాతీయ జీవావరణ నిల్వల దినం



భూమి మీద జీవం ఉనికిని నిర్ధారించే ప్రకృతి వ్యవస్థలు రోజురోజుకూ కుగ్గిపోతున్నాయి. అడవులు నరికివేత, జలాల కాలుష్యం, వాతావరణ మార్పులు.. మానవుని అత్యాశ ఫలితంగా జీవవైవిధ్యం అంతరించిపోతోంది. ఇలాంటి సంక్లిష్ట సమయంలోనే యూనెస్కో చొరవతో 2022లో ప్రవేశపెట్టిన 'అంతర్జాతీయ జీవావరణ నిల్వల దినం' ప్రాధాన్యం సార్థకమవుతోంది. ప్రతి ఏటా నవంబర్ 3న జరుపుకునే ఈ దినం.. 2025లో 'ప్రకృతితో సామరస్యం – సుస్థిరాభివృద్ధి' ఇతివృత్తంతో మరింత ప్రాముఖ్యత సంతరించుకుంది. కోల్పోయిన జీవవైవిధ్యాన్ని పునరుద్ధరించడం, జీవావరణ నిల్వల ద్వారా పర్యావరణ పరిరక్షణను బలోపేతం చేయడం ఈ రోజు ప్రధాన లక్ష్యం. ఈ ఇతివృత్తం మనకు ఒక స్పష్టమైన సందేశం ఇస్తోంది – మానవుడు ప్రకృతితో పోటీ పడకుండా, సహజీవనం సాగిస్తేనే సుస్థిరత సాధ్యం. ఈ దినం ఒక అవగాహన కార్యక్రమం మాత్రమే కాదు, చర్యలకు పిలుపునిచ్చే ఉద్యమం కూడా.

**జీవావరణం.. జీవజాలం ఆధారం**
భూమి ఉపరితలం, గాలి, నీరు, నేల.. ఇవన్నీ కలిసి ఏర్పరచిన జీవావరణం (బయోస్ఫియర్) జీవుల మనుగడకు మూలస్తంభం. సూక్ష్మజీవుల నుంచి ఏనుగుల వరకు, చిన్న మొక్క నుంచి భారీ వృక్షం వరకు.. అన్నీ ఈ జీవావరణంలోనే సహజీవనం సాగిస్తాయి. ఆహారం, ఔషధాలు, నిర్మాణ పదార్థాలు, ఇంధనం.. ఒక్క ఉప్పు తప్ప మిగతా అన్నీ ఈ జీవావరణం నుంచే లభిస్తాయి. ఉదాహరణకు, మన రోజువారీ ఆహారంలోని ధాన్యాలు, పండ్లు, కూరగాయలు, మాంసం, పాలు – ఇవన్నీ నేల, నీరు, గాలి సమ్మేళనంపై ఆధారపడి ఉత్పత్తి అవుతాయి. అలాగే, ఆయుర్వేద ఔషధాలు, ఆధునిక మందులకు మూలాలు అయిన మొక్కలు కూడా ఇక్కడే లభిస్తాయి. పర్యావరణంలో జీవావరణంతోపాటు జలావరణం (హైడ్రోస్ఫియర్), శిలావరణం (లిథోస్ఫియర్), వాతావరణం (ఆట్మాస్ఫియర్) కలిసి సమతుల్య వ్యవస్థను నిర్మిస్తాయి. ఈ నాలుగూ ఒకదానితో ఒకటి అనుసంధానమై జీవవ్యవస్థలను కాపాడతాయి. ఒకటి దెబ్బతింటే మిగతావి ప్రభావితమవుతాయి – ఉదాహరణకు, సముద్రాల కాలుష్యం జలావరణాన్ని దెబ్బతీస్తే, జీవావరణంలోని మత్స్య జాతులు అంతరిస్తాయి, ఆహార గొలుసు దెబ్బతింటుంది.

ఒక్క ఉప్పు తప్ప.. మిగతా అన్ని ఆహార పదార్థాలు జీవావరణం నుంచే! దీన్ని కాపాడుకోవడమే మానవ మనుగడకు గ్యారంటీ. ఈ వాస్తవం మనల్ని ఆలోచింపజేస్తుంది – ప్రకృతిని దోచుకుంటే, మన భవిష్యత్తు దోచుకున్నట్లే!

**జీవావరణ నిల్వలు.. పరిరక్షణ బురుజు**
జీవవైవిధ్యానికి ఆలవాలంగా నిలుస్తున్నవి జీవావరణ నిల్వలు (బయోస్ఫియర్ రిజర్వ్ – బీఆర్). ఈ ప్రాంతాలు అరుదైన జంతువులు, వృక్షజాతులకు సురక్షిత ఆవాసాలు. మానవుల ఆర్థిక, సామాజిక సుస్థిరతకు దోహదం చేస్తూనే.. అంతరించిపోతున్న జీవరాశులను కాపాడుతాయి. ప్రపంచవ్యాప్తంగా 136 దేశాల్లో 759 బీఆర్‌లు 74.42 లక్షల చ.కి.మీ. విస్తీర్ణంలో ఉండగా.. అందులో 275 మిలియన్ల మంది నివసిస్తున్నారు. ఈ నిల్వలు కోర్ జోన్ (పూర్తి పరిరక్షణ – మానవ జోక్యం లేకుండా), బఫర్ జోన్ (పరిశోధన, పర్యటన, విద్యా కార్యక్రమాలు), ట్రాన్సిషన్ జోన్ (స్థానికుల జీవనోపాధి, సుస్థిర అభివృద్ధి) అనే మూడు భాగాలుగా విభజించబడతాయి. ఇక్కడ జీవజాతుల పరిరక్షణ, భూభాగ సంరక్షణ, పర్యవేక్షణ, శిక్షణ, విద్యా కార్యక్రమాలు నిరంతరం జరుగుతాయి. ఉదాహరణకు, బీఆర్‌లలో జరిగే పరిశోధనలు వాతావరణ మార్పుల ప్రభావాన్ని అధ్యయనం చేసి, ప్రపంచానికి మార్గదర్శకాలు అందిస్తాయి. అలాగే, స్థానికులకు ఆదాయ వనరులు – పర్యావరణ హిత పర్యటన, సేంద్రియ వ్యవసాయం – కల్పిస్తాయి.

**భారత్‌లోని 12 అంతర్జాతీయ గుర్తింపు బీఆర్‌లు**
ఇండియాలో 60,000 చ.కి.మీ. విస్తీర్ణంలో 18 బీఆర్‌లు ఉండగా.. యూనెస్కో మాన్ అండ్ బయోస్ఫియర్ (ఎంఏబీ) ప్రోగ్రామ్ గుర్తింపు పొందినవి 12. ఇవి: నీలగిరి (తమిళనాడు, కర్ణాటక, కేరళ – ఏనుగులు, సింహపు తోక మకాక్‌లు), గల్ఫ్ ఆఫ్ మన్నార్ (తమిళనాడు – పగడపు దిబ్బలు, డుగాంగ్‌లు), సుందర్బన్స్ (పశ్చిమ బెంగాల్ – రాయల్ బెంగాల్ టైగర్, మాంగ్రోవ్ అడవులు), నందాదేవి (ఉత్తరాఖండ్ – హిమాలయ శిఖరాలు, స్నో లెపర్డ్), నోక్రెక్ (మేఘాలయ – ఎర్ర పాండా, లివింగ్ రూట్ బ్రిడ్జెస్), పచ్మర్హి (మధ్యప్రదేశ్ – టైగర్ రిజర్వ్, సాల్ అడవులు), సిమ్లిపాల్ (ఒడిషా – బ్లాక్ టైగర్, ఏషియన్ ఏనుగు), అచనక్మార్–అమరకంటక్ (మధ్యప్రదేశ్–ఛత్తీస్‌గఢ్ – నర్మదా మూలం, టైగర్ కారిడార్), గ్రేట్ నికోబార్ (అండమాన్ – మెగాపోడ్ పక్షి, ఉష్ణమండల అడవులు), అగస్త్యమలై (కేరళ–తమిళనాడు – లయన్ టైల్డ్ మకాక్, ఔషధ మొక్కలు), ఖంగ్చెంజోంగా (సిక్కిం – రెడ్ పాండా, హిమాలయ బయోడైవర్సిటీ), పన్నా (మధ్యప్రదేశ్ – టైగర్ రిజర్వ్, డైమండ్ మైన్స్ పరిసరాలు). ఈ ప్రాంతాలు జీవవైవిధ్యం, సాంస్కృతిక వారసత్వం, స్థానికుల జీవనోపాధిని కాపాడుతూ.. శాస్త్రీయ పరిశోధనలకు, వాతావరణ మార్పుల అధ్యయనానికి కేంద్రాలుగా ఉన్నాయి. ఉదాహరణకు, సుందర్బన్స్‌లో మాంగ్రోవ్‌లు తుఫానుల నుంచి రక్షణ ఇస్తాయి, కార్బన్ సీక్వెస్ట్రేషన్‌కు దోహదపడతాయి.

**సుస్థిరతకు స్థానికుల భాగస్వామ్యం**
బీఆర్‌ల విజయం స్థానిక ప్రజల భాగస్వామ్యంపై ఆధారపడి ఉంది. వారి భూహక్కులు, సాంప్రదాయ జ్ఞానం, జీవనశైలిని గౌరవిస్తూనే అభివృద్ధి సాధ్యం. ఉదాహరణకు, మేఘాలయలోని ఖాసీ తెగలు లివింగ్ రూట్ బ్రిడ్జెస్ నిర్మాణ జ్ఞానం బీఆర్ పరిరక్షణకు ఉపయోగపడుతోంది. కున్మింగ్–మాంట్రియల్ గ్లోబల్ బీఆర్ ఫ్రేమ్‌వర్క్ లక్ష్యాలు స్థానికుల హక్కులు, కొత్త బీఆర్‌ల ఏర్పాటు, అక్రమ కార్యకలాపాల నియంత్రణపై దృష్టి సారించాయి. ప్రభుత్వాలు, ఎన్జీవోలు, పౌర సమాజం సమన్వయంతోనే ఈ లక్ష్యాలు సాధ్యం. అక్రమ అటవీ నిర్మూలన, వేట, మైనింగ్‌లను కట్టడి చేయడం అత్యవసరం. జీవకోటిలో మానవుడు ఒక చిన్న భాగమే. అన్ని జీవజాతులు సురక్షితంగా ఉంటేనే మానవ మనుగడ ఉంటుంది. ఈ జీవావరణ నిల్వల దినంలో.. ప్రకృతితో సామరస్యంగా జీవించడం, సుస్థిరాభివృద్ధికి కట్టుబడి ఉండడం ప్రతి ఒక్కరి బాధ్యత. రేపటి తరాలకు ఆరోగ్యకరమైన భూమిని అందించాలంటే.. నేటి నుంచే జాగ్రత్తలు ప్రారంభించాలి. చిన్న చిన్న చర్యలు – వృక్ష సంపద పెంపు, ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం, సేంద్రియ వ్యవసాయం – పెద్ద మార్పుకు దారి తీస్తాయి. మనల్ని మనమే రక్షించుకుందాం!



డా. బుర్ర
మధుసూదన్ రెడ్డి
9949700037

# హైదరాబాద్ - బీజాపూర్ హైవేపై డెత్ జర్నీ..

- ఇప్పటికి 200 పైగా మంది మృతి
- ముందుకు సాగని హైవే పనులు
- పర్యావరణం పేర కాలయాపన
- ఇరుకు గతుకు రోడ్లపై నరకయాతన
- ఇప్పట్లో హైవేపై ప్రమాదాలు ఆగినట్లేనా...



**వికారాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 3 (జనం సాక్షి) :** అప్ప జంక్షన్ నుంచి ప్రారంభమయ్యే హైదరాబాద్ బీజాపూర్ హైవే డెత్ జర్నీగా మారింది. నిత్యం ఏదోచోట ప్రమాదం జరుగుతూనే ఉంది. ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన వారి బతుకులు అక్కడే తెల్లారిపోతున్నాయి. రంగారెడ్డి మిర్జాపూర్ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదం ఉదాహరణంగా పేర్కొవచ్చు. ఈ ప్రమాదంలో వికారాబాద్ జిల్లాకు చెందిన 16 మంది మృతి చెందారు. ఒక తాండూరు పట్టణములోని 13 మంది మృతి చెందారు. తాండూర్ కొడంగల్ వికారాబాద్ నియోజకవర్గాల్లో విషాద ఛాయలు అములుకున్నాయి. ఒకే కుటుంబంలో ముగ్గురేసి వ్యక్తులు మూడు కుటుంబాల్లోని వారు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం అందరిని కంటతడి పెట్టించింది. గత నాలుగేళ్లుగా హైదరాబాద్ బీజేపూర్ హైవే పనులు నత్త నడకన సాగుతున్నాయి. పర్యావరణం నుంచి పూర్తి క్లియరెన్స్ రాకముందే అప్ప జంక్షన్ నుంచి మన్నెగూడ మీదుగా బీజేపూర్ హైవే నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పర్యావరణ ప్రేమికులు గ్రీన్ ట్రిబ్యునల్ లో కేసు వేయడంతో బీజాపూర్ హైవే నిర్మాణానికి బ్రేక్ పడింది. ఇక అప్పటినుంచి రోడ్డు నిలయంగా మారింది. ఇప్పటివరకు 200 మందికి పైగా మృతి చెందినట్లు ప్రాథమికంగా తెలుస్తుంది. బీజాపూర్ హైవేకు ఇరువైపులా చెట్లు ఉండడం కొన్నిచోట్ల రోడ్లు తవ్వి వేయడంతో రోడ్డు ఇరుకుగా మారింది. ఇరుకు గతుకుల రోడ్లు పై ప్రజలు రోజు నరకయాతన పడుతున్నారు. ఇవేవీ పాలకులకు ప్రభుత్వ అధికారులకు పట్టడం లేదు. రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు స్పందించడం మినహా శాశ్వత పరిష్కారం చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు నత్త నడకన సాగుతుంది. నాలుగేళ్లుగా గ్రీన్ ట్రిబ్యునల్ లో కేసు ఉన్న రాజీమార్గంగా కేసును ఉపసంహరించే ప్రయత్నం రెండు ప్రభుత్వాలు ఇప్పటివరకు చేయలేదు. దీంతో ఇరుకు రోడ్డులో అమాయకులను మృత్యువు ప్రమాదం రూపంలో కాటేస్తుంది. ఫలితంగా పేద కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. గ్రీన్ ట్రిబ్యునల్ లో ఉన్న కేసును పరిష్కరించి బీజేపూర్ హైవే పనులు శరవేగంగా ప్రారంభిస్తున్నామని ఇటీవల ప్రజాప్రతినిధులు ఫోటోలకు ఫోజులిచ్చి చంకలు గుద్దుకున్నారు. కానీ ఇప్పటివరకు రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో అనార్థం జరిగిపోయింది. ఆలూరు దగ్గర జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం తర్వాత రంగారెడ్డి జిల్లా మీర్జాగూడ సంఘటన పెద్దది. ఆర్టీసీ బస్సు టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఇప్పటివరకు 19 మంది మరణించారని, అందులో 15 నెలల పాప కూడా ఉంది . తల్లి, బిడ్డ మృతదేహాలను బస్సులో నుంచి బయటకు తీసి రోడ్డుపై ఉంచిన ఫొటో కన్నీరు తెప్పిస్తోంది. వారితో పాటు పాప తండ్రి కూడా మృతి. వీరంతా తాండూర్ ఇంద్ర నగర్ కు చెందినవారు. అలాగే చేవెళ్ల మీర్జపూర్ ప్రమాదం లో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కాచెల్లెళ్లు మృత్యువాత పడ్డారు. వారంతా తాండూరు మండలం పెర్కంపల్లి గ్రామానికి చెందినవారు. బస్సు ప్రమాదం ఎన్నో కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ఉదయాన్నే ఉద్యోగాలు, చదువులు, ఇతర పనుల నిమిత్తం బస్సు ఎక్కిన వారికి అదే చివరి ప్రయాణం అయ్యింది. ఏం జరిగిందో తెలిసే లోపే అనేక మంది ప్రాణాలను కోల్పోయారు. చేవెళ్ల బస్సు ప్రమాద ఘటనలో ఇప్పటి వరకు 19 మంది మృత్యువాతపడ్డారు. ఇదిలా ఉండగా.. బస్సు ప్రమాద ఘటన ఓ కుటుంబంలో పెను విషాదాన్ని నింపింది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కా చెల్లెళ్లు ఈ దుర్ఘటనలో మృతి చెందారు. సోమవారం ఉదయం ముగ్గురు అక్కా చెల్లెళ్ల సాయి ప్రియ నందిని తనుషను కన్న తండ్రి ఎల్లయ్య గౌడ్ బస్టాప్‌లో దింపి వెళ్లాడు. తండ్రికి చిరునవ్వుతో బాయ్ చెప్పిన ఆ సోదరీమణులకు అదే ఆఖరి ప్రయాణం అని తెలీదు. ఎంతో సంతోషంగా బస్సు ఎక్కి ప్రయాణం సాగించారు. కానీ అంతలోనే బస్సు ఘోర ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కాచెల్లెళ్లు అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే తల్లిదండ్రులు అక్కడకు చేరుకుని తమ బిడ్డల కోసం ఆరా తీయగా.. వారు చనిపోయినట్లు తెలియడంతో గుండెలవిసేలా రోదిస్తున్నారు.. ఈ ముగ్గురు కూడా హైదరాబాద్‌లోని కాలేజీల్లో బీటెక్ మూడు, బీటెక్ రెండవ, మొదటి సంవత్సరం చదువుతున్నారు. వీరి తండ్రి డ్రైవర్. గత నెలలోనే పెద్ద కుమార్తె వివాహం జరిపించాడు. ఎంతో సంతోషంగా ఉన్న సమయంలో మిగిలిన ముగ్గురు బిడ్డలు ఇలా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తండ్రి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాడు. 'మా పిల్లల్ని మాకు తిరిగి ఇప్పించండి' అంటూ ఆ తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు అక్కడి వారిని కంటతడి పెట్టిస్తోంది. చేవెళ్ల బస్సు ప్రమాదంలో ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. బస్సు ప్రమాదంలో చిన్నారుల తల్లిదండ్రులు బందప్ప, లక్ష్మీ మృతి చెందారు. వారి పిల్లలు భవాని శివలీల అనాథలయ్యారు. యాలాల్ మండలం హాజీపూర్ గ్రామానికి చెందినవారుగా గుర్తింపు పోలీసులు గుర్తించారు. ఇలా ఎన్నెన్నో సంఘటనలు జరుగుతున్న నేపథ్యంలో అధికారులు ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకొని బీజాపూర్ హైవేను త్వరితగతిగా పూర్తి చేస్తారని ఆశిద్దాం...

## అక్రమ నిర్మాణాలపై ప్రజావాణిలో ఫిర్యాదు..

- మల్కాజిగిరి టౌన్ ప్లానింగ్ అధికారులపై మండిపడ్డ జయరాజ్



**మల్కాజిగిరి, అక్టోబర్ 3 (జనంసాక్షి) :** మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో లోని ఆరు డివిజన్ లలో అనుమతులు లేకుండా జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై వివిధ వార్తా దినపత్రికలలో వచ్చిన వార్తలను సేకరించి స్థానిక వ్యక్తి ఒకరు సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు, సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారి బాల శ్రీనివాస్, సెక్షన్ అధికారి సంగీత లపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జైరాజ్ మాట్లాడుతూ, తాను ఐదు నెలల క్రితం ఏడు లక్షల రూపాయల చలానా చెల్లించి ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్నానని, దానికి ప్రొసీడింగ్ ఇవ్వడానికి సెక్షన్ అధికారి సంగీత అసిస్టెంట్ రవి 40000 లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు, తన దగ్గర అంత డబ్బు లేదని చెప్పడంతో తన దరఖాస్తును వివిధ కారణాల రూపంలో యూఎల్సీ కార్యాలయానికి పంపారని తెలిపారు. సర్కిల్ పరిధిలోని ఆరు డివిజన్లలో ఎలాంటి అనుమతులు లేకుండా షెడ్డు నిర్మాణాలు, పాత బిల్డింగులపై అదనపు ఫ్లోర్ల నిర్మాణాలు, సెల్లార్లు, రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని కమర్షియల్ బిల్డింగ్ నిర్మాణాలు యథేచ్ఛగా జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. న్యాయబద్ధంగా ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వానికి చలానా కట్టి దరఖాస్తు చేసుకున్న వారిని ముప్పులు తిప్పలు పెడుతున్నారని మండిపడ్డారు. టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణదారులతో అంతర్గత ఒప్పందాలు కుదుర్చుకొని ప్రభుత్వానికి రావాల్సిన కోట్ల రూపాయల ఆదాయాన్ని జేబులో వేసుకుంటున్నారని జైరాజ్ ఆరోపించారు. వీరు జారీ చేసిన ఇంటి నిర్మాణ అనుమతులను ఉన్నతాధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా ప్రభుత్వానికి నష్టం కనిపిస్తున్నారని, సర్కిల్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను ప్రత్యక్షంగా చూసి వారిపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్ ను కోరినట్లు తెలిపారు.

## బస్సు ప్రమాదంలో మృతి చెందిన వారికి 10వేల ఆర్థికసాయం

- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు, నవంబర్ 3 (జనంసాక్షి) :** బస్సు ప్రమాదంలో మృతి చెందిన వారికి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి 10వేల ఆర్థిక సహాయం అందజేశారు. సోమవారం ఉదయం తాండూరు నుండి హైదరాబాద్ బయలుదేరిన ఆర్టీసీ బస్సు చేవెళ్ల సమీపంలో టిప్పర్ ఆర్టీసీ బస్సు డికోనడంతో తాండూరు ప్రాంతానికి చెందిన సుమారు 12 మంది మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు. బస్సు ప్రమాదంలో మృతి చెందిన వారికి ఆర్థిక సహాయంగా అంత్యక్రియల నిమిత్తం ఒక్కొక్కరికి రూ.10,000 స్థానిక నాయకుల ద్వారా అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ తాండూరు ప్రాంతానికి చెందిన 12 మంది మృతి చెందడం అత్యంత బాధాకరమని అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## రోడ్లపై ఏరులై పారుతున్న మురుగు..

- పట్టించుకోని అధికారులు..?
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- సిపిఎం సర్కిల్ కార్యదర్శి కీసర నర్సిరెడ్డి



**హయత్‌నగర్, నవంబర్ 3 (జనం సాక్షి) :** హయత్ నగర్ డివిజన్ పరిధి లోని భాగ్యలత నుండి సామా నగర్ పోయే రోడ్డు పై పారుతున్న మురుగు నీటి గురించి హెచ్ఎం డబ్ల్యూ ఎస్ ఎస్ బి అధికారులు పట్టించుకోవడంలేదని సిపిఎం సర్కిల్ కార్యదర్శి కీసర నర్సిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ గత 20 రోజుల నుండి రోడ్లపై, కాలనీలలో ఎక్కడపడితే అక్కడ మురుగునీరు పారుతుంటే అధికారులకు చీమ కుట్టినట్టు కూడా లేదని వారు అన్నారు. హెచ్ఎం డబ్ల్యూ ఎస్ ఎస్ బి జనరల్ మేనేజర్ మహేందర్ కు సిపిఎం ఆధ్వర్యం లో వినతి పత్రం అక్టోబర్ 16వ తారీకున మొదటి వినతి పత్రం, సోమవారం ప్రజావాణిలో రెండవ వినతి పత్రం ఇవ్వడం జరిగిందని వారు అన్నారు. జనరల్ మేనేజర్ గతంలో చేసిన వాగ్దానాన్ని ఇప్పటికీ అమలు చెయ్యలేదని, మూడు రోజు లలో పరిష్కారం అవుతుందని చెప్పి 20 రోజులు దాటిందని తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. ఈ సమస్యతో వేలాదిమంది పాదాచారులు, వాహనదారు ఆ దారిలో వెళ్లడానికి నరకయాతన అనుభవిస్తున్నారని వారు తెలియపరిచారు. దాదాపు 40 కాలనీ వాసుల ప్రజలు ఈ మురుగు నీటితో సమస్యతో తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారని, భరించలేని దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని, జనరల్ మేనేజర్ మహేందర్ మరోసారి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేము దీని పరిష్కారం కొరకు అనేక ప్రయత్నాలు చేస్తున్నాము అన్నారు. ఏ ప్రయత్నాలు చేసినా ఇప్పటికి పరిష్కారం కాలేదు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం, రెండు మూడు రోజుల్లో సమస్య పరిష్కారం కాకపోతే కాలనీ ప్రజలను తీసుకొచ్చి మన కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. దానికి మీరే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ కు తెలియజేస్తూ, తక్షణమే రోడ్డు పై పారుతున్న మురుగు నీటిని అరికట్టాలని, ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్న ఈ సమస్యపై చర్య తీసుకోవాలని వారికి లేఖ లో తెలియపరిచారు. వారు సమస్యను పరిశీలించి వెంటనే ఆ చర్యలు తీసుకుంటామని జనరల్ మేనేజర్ వాగ్దానం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సర్కిల్ కమిటీ సభ్యులు కొత్త గణేష్ గౌడ్, ముషం నరహరి, బిట్రా మూర్తి, గంగుల శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు లబ్ధి చేకూరేలా ధాన్యం కొనుగోలు జరపాలి

- జిల్లాలో నేటికి 26,391 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**కౌడిపల్లి, నవంబర్ 3 (జనంసాక్షి) :** రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి వరిధాన్యం కొనుగోలు చేస్తుందని, అధికారులు రైతులకు లబ్ధి చేకూరేలా నిబంధనల ప్రకారం కొనుగోలు ప్రక్రియ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అన్నారు. సోమవారం కౌడిపల్లి మండల కేంద్రంలో నాగ్సన్ పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి,రైతులకు మద్దతు ధర చెల్లించి,రైతుల వద్ద నుండి కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. నేటికి 26,391 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తయిందన్నారు. వర్షాల నేపథ్యంలో కొనుగోలు ప్రక్రియకు ఎలాంటి అవాంతరాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్ కవర్లు,ప్యాడి క్లీనర్లు, తేమ యంత్రాలు వంటి అవసరమైన సదుపాయాలు సమృద్ధిగా ఉండేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ కృష్ణ, ఆర్ ఐ శ్రీహరి, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ గురుకుల కళాశాలలో సమస్యలు పరిష్కరించాలి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, నవంబర్ 3 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పరిధిలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో చోటు చేసుకున్న ఘటనపై తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ కార్యదర్శి ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ (డిటిఎఫ్) డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీశైలం డిటిఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చంద్రారెడ్డి డిటిఎఫ్ మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షులు రవీందర్ గౌడ్ తెలంగాణ ప్రజాఫ్రంట్ రంగారెడ్డి జిల్లా కన్వీనర్ అర్జునప్ప పాలమూరు అధ్యయన వేదిక రంగారెడ్డి జిల్లా కన్వీనర్ రవీంద్రనాథ్ నిజనిర్ధన కమిటీగా కలశాలను సందర్శించి వాస్తవాలను తెలుసుకున్నారు కళాశాలలో విద్యార్థులతో మాట్లాడి అనేక విషయాలు తెలుసుకున్నారు తమకు ఉడికి ఉడకని అన్నం నీళ్ల చారు పెడుతున్నారని విద్యార్థులు కమిటీ దృష్టికి తీసుకువచ్చారు మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నమని ఫ్యాన్లు కూడా తిరగడం లేదని కళాశాలకు ఉన్న అద్దాలు పగిలిపోయి గదులలో దోమలు ఈగలతో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు తెలిపారు తక్షణమే ప్రిన్సిపల్ శైలజ పై పూర్తి స్థాయిలో విచారణ జరిపి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని ఆందోళన చేస్తున్న విద్యార్థులపై దురుసుగా ప్రవర్తించిన పోలీసులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ భూమిని కాపాడాలని ప్రజావాణిలో ఫిర్యాదు

- అధికారులపై చర్యలు తీసుకోండి
- తెలంగాణ భూముల పరిరక్షణ సమితి ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షులు మచ్చ జంగయ్య,ఉపాధ్యక్షులు గంటీల వెంకటేష్



**ఇబ్రహీంపట్నం, నవంబర్ 3 (జనం సాక్షి) :** మంచాల మండలం,ఆగపల్లి గ్రామపంచాయతీ శివారు నాగార్జునసాగర్ హైవే సమీపంలోని సర్వేనెంబర్ 191,187 లలో గల ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఏర్పాటు చేసిన ఓ ప్రైవేటు వెంచర్ యజమానిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ భూముల పరిరక్షణ సమితి ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షులు మచ్చ జంగయ్య, ఉపాధ్యక్షులు గంటీల వెంకటేష్ సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి కి ఫిర్యాదు చేసారు.గతంలో రెవెన్యూ అధికారులకు చాలా సార్లు ఫిర్యాదు చేసిన తూతూ మంత్రంగా రెండు రోజులు సర్వే చేసి ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి బోర్డు నాటించారు.ప్రభుత్వ అధికారులను కాదని వెంచర్ నిర్వాహకులు బోర్డుని అక్కడ నుంచి తీసివేయడంతో ఎలాంటి చర్యలు తీసుకోకుండా స్థానిక రెవిన్యూ అధికారులు వెంచర్ యాజమాన్యంతో కుమ్మక్కై ప్రభుత్వ భూమి కబ్జా చేస్తున్న ఏం మాత్రం పట్టించుకోకుండా ప్రభుత్వ భూమిని కాపాడకుండా వెంచర్ యాజమాన్యానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని,ప్రభుత్వ భూమిలో నుండి రోడ్డు నిర్మాణానికి సహకరించిన అధికారులపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం కబ్జాకు గురైన భూమి విలువ మార్కెట్ రేటు ఒక ఎకరం రూ.4 కోట్ల వరకు ఉంటుందని విలువైన భూమిని కాపాడడంలో విఫలమైన స్థానిక అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.లేని యెడల మంచాల మండల తహసీల్దార్ కార్యాలయం దగ్గర న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని అన్నారు.

## ఫ్యూచర్‌సిటీ అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం కావాలి



**మహేశ్వరం, నవంబర్ 3 (జనంసాక్షి) :** ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం కావాలని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేఎల్ఆర్ అన్నారు. సోమవారం కందుకూరు ఆర్డీవో కార్యాలయం ఆవరణలో ఫ్యూచర్ సిటీ కోసం నిర్మిస్తున్న 330 ఫీట్ల గ్రీన్ ఫీల్డ్ రోడ్డులో ప్లాట్లు కోల్పోతున్న యజమానులతో కేఎల్ఆర్ భేటీ అయ్యారు.ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ...ఫ్యూచర్ సిటీని ప్రపంచ స్థాయి వసతులతో తీర్చిదిద్దుతామన్నారు.గ్రీన్ ఫీల్డ్ రోడ్డులో భూములు,స్థలాలు కోల్పోతున్న వారికి పూర్తి న్యాయం చేస్తామన్నారు.ప్లాట్ల యజమానుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం పరిహారం వచ్చేలా చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణా నాయక్,డైరక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి,పీసీసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి,మాజీ జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి,పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే చేవెళ్లలో భయానక బస్సు ప్రమాదం

- తాండూరు టూ హైదరాబాద్ రహదారి 100 కిలోమీటర్లలో 120 మలుపులు
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు. రమేష్ కుమార్



**తాండూరు, నవంబర్ 3 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే చేవెళ్లలో భయానక బస్సు ప్రమాదం జరిగిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు. రమేష్ కుమార్ మండిపడ్డారు. సోమవారం ఉదయం తాండూరు నుండి బయలుదేరిన బస్సు చేవెళ్ల సమీపంలో కంకర లోడుతో వస్తున్న లారీ ఢీకొనడంతో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఈ సంఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందిన వెంటనే తాండూరు నాయకులు యు. రమేష్ కుమార్, కృష్ణ ముదిరాజ్, బంటారం భద్రేశ్వర్, సందీప్ కుమార్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదం జరిగిన ప్రదేశం అంతా మృతదేహాలతో, బంధువుల రోదనలతో హృదయ విదారకంగా మారింది. ఈ సందర్భంగా రమేష్ కుమార్ మాట్లాడుతూ ఇది పూర్తిగా ప్రభుత్వ నిర్లక్ష్యమే. ఈ రోడ్డు చాలా ప్రమాదకరంగా ఉందని, మలుపులతో నిండిపోయిందని మేము ఎన్నోసార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాం. రోడ్డు విస్తరణ, పునరుద్ధరణ చేయమని విజ్ఞప్తి చేశాం. కానీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తో వరుస ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మొన్న ఆలూరు గేటు వద్ద జరిగిన ప్రమాదం మరువకముందే ఇవాళ మళ్లీ ఇంతమంది ప్రాణాలు కోల్పోవడం హృదయవిదారక విషయం. తాండూరు టూ హైదరాబాద్ రహదారి 100 కిలోమీటర్లలో 120 మలుపులు ఉండటం ప్రమాదాలకు ప్రధాన కారణం. ప్రతి నెలా పది మందికి పైగా ఈ రోడ్డుపై ప్రాణాలు కోల్పోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని ఈ రోడ్డు విస్తరణ పనులు తక్షణం ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రమాదంలో తాండూరు నియోజకవర్గానికి చెందిన తొమ్మిది మంది మృతి చెందారు. మృతదేహాలను చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, గాయపడిన వారిని వికారాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రమేష్ కుమార్ అక్కడికి చేరుకుని మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి, గాయపడిన వారిని ఆసుపత్రిలో చూశారు. వైద్యులతో మాట్లాడుతూ తక్షణం సముచిత వైద్యం అందించాలని కోరారు. ఈ రాష్ట్రప్రభుత్వం ముగ్గురుతో కూడిన దర్యాప్తు కమిటీని వేయడం జరిగింది. అదే సమయంలో అక్కడకు వికారాబాద్ ఆసుపత్రికి వచ్చిన కమిటీ సభ్యులుతో మాట్లాడు తూ ఇక్కడ సరైన సదుపాయాలు లేవని కాళ్ళు, చేతులు విరిగిన వారికీ ఆపరేషన్ చేయడంలో మరియు వైద్యం అందించడంలో కూడా జాప్యం జరుగుతుంది ఎందుకని ప్రశ్నించారు.

# విద్యుత్ వినియోగదారుల సమస్యలన్నీ పరిష్కరించేలా చర్యలు

**మెదక్ జిల్లా బ్యూరో, నవంబర్ 3 (జనం సాక్షి) :** మెదక్ జిల్లాలో విద్యుత్తు వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు సోమవారం నిర్వహించిన విద్యుత్తు వినియోగదారుల సదస్సుకు మంచి స్పందన లభించిందని ఈ విషయంలో వినియోగదారుల సమస్యలన్నింటినీ పరిష్కరించేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యుత్తు శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ) నారాయణ నాయక్ తెలిపారు. విద్యుత్తు వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు సోమవారం జిల్లాలోని ఎస్ఈ కార్యాలయంతో పాటు డివిజనల్ ఇంజనీర్, సబ్ డివిజనల్ కార్యాలయాల్లో నిర్వహించిన సదస్సులో జిల్లా వ్యాప్తంగా 102 ఫిర్యాదులు, ఆర్జీలను స్వీకరించినట్లు ఎస్ఈ నారాయణ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా మెదక్ డివిజన్ పరిధిలో 16, సబ్ డివిజన్ పరిధిలో 28, పాపన్నపేటలో 20, తూప్రాన్‌లో 23, రామాయంపేటలో 15 సంబంధిత అధికారులు తీసుకొని అందుకు తగిన పరిష్కారాన్ని వినియోగదారులకు సూచించినట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదుల్లో ఎక్కువగా ఇళ్లపై విద్యుత్తు తీగలు ఉండటం, కేటగిరీల్లో మార్పులు, విద్యుత్తు స్తంభాలు ప్రమాదకరంగా ఉండటంతో



పాటు విద్యుత్తు తీగలను మార్చాలని, మీటర్ రీడింగ్ తప్పుగా బిల్లులు వస్తున్నాయని, మీటర్లు కాలిపోయాయని ఫిర్యాదులు వచ్చాయని ఎస్ఈ నారాయణ నాయక్ తెలిపారు. అలాగే ప్రభుత్వం నాయిబ్రాహ్మణులు, రజకులకు ఉచితంగా అందచేస్తున్న విద్యుత్తు విషయంలో సైతం ఫిర్యాదులు తీసుకున్నామని వివరించారు. విద్యుత్తు వినియోగదారుల నుంచి స్వీకరించిన ఫిర్యాదులలో 15 ఫిర్యాదులను వెంటనే తమ సిబ్బంది పరిష్కరించారని తెలిపారు. అలాగే మిగిలిన ఆర్జీలు, ఫిర్యాదులు, సమస్యలను సైతం త్వరితగతిన పరిష్కరించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ విషయంలో విద్యుత్తు వినియోగదారులు సదస్సును వినియోగించుకోవడం జరిగిందని... మున్ముందు రోజుల్లో సైతం వినియోగదారుల సౌకర్యం కోసం వారి సమస్యలను పరిష్కరించేందుకు సదస్సులను నిర్వహించడం జరుగుతుందని ఎస్ఈ నారాయణ నాయక్ తెలిపారు. అలాగే జిల్లాలో గృహావసర విద్యుత్తుతో పాటు రైతులకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్తును అందించేందుకు తమ శాఖ అధికారులు, సిబ్బంది నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఇంఛార్జి డీఈ శ్రీనివాస్ విజయ్, ఏడీఈ మోహన్ బాబు, ఎమ్ఆర్‌టీ డీఈ సోమేశ్వరరావు, విజిలెన్స్ డీఈ శ్రీనివాస్ రెడ్డి, మెదక్ టౌన్ ఏఈ నవీన్, మెదక్ రూరల్ ఏఈ రాజ్‌కుమార్, చిన్నశంకరంపేట ఏఈ , సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి



**మానవపాడు, నవంబర్ 3 (జనం సాక్షి) :** జోగులంబ గద్వాల జిల్లా, మానవపాడు మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంను సందర్శించి హాస్టల్లో గల విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని మానవపాడు ఎంపీడీవో రాఘవ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా వంటశాలను మరియు స్టోర్ రూమ్ ను సందర్శించి, పరిసరాలు శుభ్రంగా ఉండే విధంగా తగు చర్యలు తీసుకోవాలని హాస్టల్ వార్డెన్ రాంగోపాల్ కు సూచించడం జరిగింది. హాస్టల్ సందర్శనలో భాగంగా వార్డెన్ సమస్యలను పరిష్కరించాలని హాస్టల్ వెనకాల కంపచెట్లు ఎక్కువ ఉన్నాయని తెలపడం జరిగింది. ఇదే విషయాన్ని పంచాయతీ సెక్రటరీ శివశంకర్‌కు తెలుపగా అయన వెంటనే తక్షణమే జెసిబి యజమానితో మాట్లాడి పిలిపించి తొలగించే పనులను ప్రారంభించడం జరిగింది అని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాఘవ, పంచాయతీ కార్యదర్శి శివశంకర్, మరియు యువజన నాయకుడు పరమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయిలో ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ జిల్లా బ్యూరో, నవంబర్ 3 (జనం సాక్షి) :** ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి దరఖాస్తులను తక్షణమే, క్షేత్రస్థాయిలో పరిశీలించి, వెంటనే పరిష్కరించలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 77 దరఖాస్తులను తీసుకోవడం జరిగింది. అందులో భూభారతి 36, ఇందిరమ్మ ఇండ్లు 7, పెన్షన్లు 7, ఇతర 27 దరఖాస్తులను ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ రాహుల రాజ్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో అధికారులు బాధ్యత తీసుకుని ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలని, పెండింగ్ లో పెట్టకుండా ప్రతీ దరఖాస్తుకు సరైన సమాధానం ఇవ్వాలని సూచించారు. వేర్వేరు ప్రాంతాల్లో ప్రజల సమస్యలు, భూ, పింఛన్ల, విద్య, వైద్యం వంటివి సమగ్రమైన పరిష్కారం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సమస్యలు పరిష్కరించలేనప్పుడు కారణాలు, నియమాలు వివరాలతో అర్జీదారులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఏ పిడి శ్రీనివాసరావు, డిఆర్ఓ భుజంగరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఫీజు రీయంబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి

**తూప్రాన్, నవంబర్ 3 (జనం సాక్షి) :** పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్లను ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బేబీ ఆధ్వర్యంలో రాస్తారోకో ధర్నా నిర్వహించారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ తూప్రాన్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ చౌరస్తాలో పెండింగ్లో ఉన్న 8,500 కోట్ల స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ రిమాండ్ చేస్తూ రాస్తారోకో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏబీవీపీ కన్వీనర్ కార్తికేయ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న 8500 కోట్ల స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని లేనియెడల ఏబీవీపీ ఆధ్వర్యంలో పోరాటం ఉధృతం చేస్తామని అన్నారు. పేద మధ్యతరగతి విద్యార్థుల ఉన్నత విద్యను దూరం చేసే కుట్ర ప్రభుత్వం చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు కావస్తున్న కనీసం ఇప్పటివరకు విద్యార్థుల గురించి మాట్లాడిన ఎమ్మెల్యేలు మరియు మంత్రులు మాట్లాడిన దాఖలాలు లేవ వ నీ అన్నారు కాంగ్రెస్ పార్టీ నాయకులను రాష్ట్రంలో ఎక్కడ తిరగనివ్వం అనీ హెచ్చరించారు. జూబ్లీహిల్స్ ప్రజలు ఓటు వేసే ముందు ఆలోచించాలని మీ బిడ్డలకు స్కాలర్షిప్ ఇవ్వకుండా విద్యను దూరం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వంకి, మంత్రుల,వైన్స్ టెండర్ల మీద ఉన్న ధ్యాస విద్యార్థుల మీద లేకపోవడం సిగ్గుచేటు అని అన్నారు. 1200 కోట్ల స్కాలర్షిప్ బకాయిలను రిలీజ్ చేస్తాం 1000 కోట్ల రిలీజ్ చేస్తాం అనే బేరాలు ఆడటం మానుకొని విద్యార్థులకు రావాల్సిన ప్రతి రూపాయి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్కాలర్షిప్ బిక్ష కాదు, అది, మా హక్కు అని తెలిపారు. లేనిపక్షంలో రేవంత్ రెడ్డిని గద్ద దింపే వరకు ఏబీవీపీ



పోరాడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉదయ్ బండారి ప్రశాంత్ కార్యకర్తలు చంద్రశేఖర్, భాస్కర్, లోకేష్ ,అభిషేక్, అంజి ,బాలాజీ, భవాని, నందిని కాలేజీల విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సైన్స్ - మూఢవిశ్వాసాలపై సదస్సు కరపత్రాల విడుదల



**వనపర్తి బ్యూరో, నవంబర్ 3 (జనంసాక్షి) :** మహబూబ్నగర్ జిల్లా కేంద్రం తెలంగాణ చౌరస్తా టీఎన్జీఓ ఆఫీసులో నవంబర్ 9న 'సైన్స్ - మూడవిశ్వాసాలు'అంశంపై నాస్తిక సమాజం ఆధ్వర్యంలో జరగనున్న ఉమ్మడి జిల్లా సదస్సు కరపత్రాలను వనపర్తి సిపిఐ జిల్లా ఆఫీసులో సోమవారం సాయంత్రం నేతలు విడుదల చేశారు. ఈ సందర్భంగా నాస్తిక సమాజం వనపర్తి జిల్లా కార్యదర్శి భాస్కర్ తదితరులు మాట్లాడుతూ మతం మత్తుమందు అని కార్ల్ మార్క్స్ అన్నారని, ఆయా మతాలను అనుసరిస్తున్న వారు మత గ్రంథాల్లో ఎన్నో లొసువులు ఉన్న పట్టించుకోవటం లేదన్నారు. మతం ప్రభావం నుంచి ఎప్పటికప్పుడు చైతన్యం పొందుతూనే ఉండాలన్నారు. అసంఖ్యాక ప్రజలు సలక్షణమైన జీవితం గడివే పరిస్థితికి రావాలంటే ఒక సంస్కృతిక విప్లవం, భావ విప్లవం, సామాజిక విప్లవం రావాలన్నారు. ప్రజా చైతన్యం కోసం మహబూబ్నగర్లో నిర్వహిస్తున్న సదస్సుకు వక్తలుగా ప్రముఖ విద్యావ్యత కే జయకుమార్, తెలంగాణ విద్యావంతుల వేదిక బాధ్యులు అంబటి నాగయ్య తదితరులు వస్తున్నారన్నారు. సదస్సుకు జిల్లా నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో విద్యామంతులు విధవర్గాలప్రజలు హాజరు కావాలన్నారు. కరపత్రాలు ఆవిష్కరణలో సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, కవి జనజ్వాల రాధాకృష్ణ, తెలంగాణఎస్సీ ఎస్టీ బీసీమైనార్టీ కన్వీనర్ గంధం నాగరాజు, సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోష, ఉపాధ్యక్షులు శ్రీరామ్, ఉప ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ, మాజీ పట్టణ సాయి కార్యదర్శి ఎర్ర కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్వీపర్ల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



**వనపర్తి బ్యూరో, నవంబర్ 3 (జనంసాక్షి) :** ప్రభుత్వ స్వీపర్ల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐటియూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోష డిమాండ్ చేశారు. వనపర్తి కలెక్టర్ ఆఫీస్ వద్ద వేతనాలను వెంటనే చెల్లించాలని ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ఎనిమిది నెలల జీతాలను చెల్లించకపోవడం దారుణం అన్నారు. వేతనాల చెల్లింపులో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలన్నారు. స్వీపర్లకు కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి అన్ని బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. స్వీపర్లను పార్ట్ టైం ఉద్యోగులుగా చెబుతూ రోజంతా పనిచేయించుకుంటున్నారని పార్ట్ టైం నిబంధన తొలగించి పూర్తి ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. చనిపోయిన స్వీపర్ల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని 60 సంవత్సరాలు పైబడిన వారికి రూ. 15 లక్షలు రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలన్నారు. ప్రతి కార్మికుడికి గుర్తింపు కార్డు ఇవ్వాలని ఈపీఎఫ్ ఈఎస్ఐ గ్రాటివిటీ సౌకర్యం కల్పించాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ, సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్ స్వీపర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రషీద్, అధ్యక్షులు గోపాల్ గౌడ్, కోశాధికారి ఖయూం, రమేష్ మన్నెమ్మ శోభ రాణి మాలిక్ శాంతన్న వెంకటయ్య వాహబ్ తదితరులు పాల్గొన్నారు.

## పైరవీలు లేకుండా నేరుగా పోలీసులను సంప్రదించాలి



**మెదక్ జిల్లా బ్యూరో, నవంబర్ 3 (జనం సాక్షి) :** మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఈ రోజు ప్రజావాణి కార్యక్రమంలో బాగంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను నేరుగా స్వీకరించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎస్పీకి తెలియజేశారు. మొత్తం 13 ఫిర్యాదులను ఎస్పీ స్వయంగా స్వీకరించి, వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. కొన్నింటిపై వెంటనే స్పందిస్తూ, సంబంధిత పోలీస్ స్టేషన్ల సిఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి సమస్యల పరిష్కారానికి సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి పైరవీలు లేకుండా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నేరుగా పోలీస్ అధికారులను సంప్రదించాలి. చట్టబద్ధ మార్గంలోనే ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుంది. ప్రజల భద్రత, శాంతి కాపాడటం మరియు వారితో మరింత దగ్గరగా ఉండటం ప్రధాన లక్ష్యం అని అన్నారు. అలాగే ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, సంబంధిత అధికారుల సహకారంతో వేగవంతంగా పరిష్కరిస్తున్నామని ఎస్పీ తెలిపారు.

## పోలీసులు, మీడియా రెండూ సమాజసేవలో భాగస్వాములు

- జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్

**గద్వాల నడిగడ్డ, నవంబర్ 3 (జనం సాక్షి) :** పోలీసులు, మీడియా సమాజ సేవలో భాగస్వాములు అని జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్ అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలోని పోలీస్ పరేడ్ మైదానంలో సోమవారము జిల్లా పోలీస్, ప్రెస్ వర్గాల మధ్య నిర్వహించిన ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ఉత్సాహభరితంగా సాగింది. ఈ మ్యాచ్‌కు ప్రధాన అతిథులుగా జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్, ఐ.ఏ.ఎస్,జిల్లా పోలీసు అధికారి టి. శ్రీనివాసరావు హాజరై మ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ మాట్లాడుతూ పోలీసు శాఖ, మీడియా సమాజ అభివృద్ధిలో ముఖ్యమైన భాగస్వాములని అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో, అవగాహన పెంపొందించడంలో ఇరువురూ కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ పోలీసులు, మీడియా సమాజ నిర్మాణంలో కీలకమైన వర్గాలని, ప్రజల సేవలో ఇరువురు ఒకే ధ్యేయంతో కృషి చేస్తున్నారని తెలిపారు. మ్యాచ్‌లో టాస్ గెలిచిన ప్రెస్ జట్టు మొదటగా బ్యాటింగ్ చేయగా, 12 ఓవర్లలో 63 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన జిల్లా



పోలీస్ జట్టు 8.5 ఓవర్లలో లక్ష్యాన్ని చేరుకుని విజేతగా నిలిచింది. తరువాత జరిగిన బహుమతి ప్రదాన కార్యక్రమంలో విజేత, రన్నర్ జట్లకు ట్రోఫీలు, జట్టు సభ్యులకు మెమెంటోలు, అలాగే "బెస్ట్ బ్యాట్స్‌మన్", "బెస్ట్ బౌలర్', "మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్" అవార్డులను జిల్లా ఎస్పీ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ కె. శంకర్, ఎస్బీ ఇన్స్పెక్టర్ రవి, గద్వాల సి.ఐ శ్రీను, అలంపూర్ సి.ఐ రవి బాబు, పి.సి.ఆర్ ఇన్స్పెక్టర్ సంపత్, ఆర్.ఐ వెంకట్, హరీఫ్, వివిధ పోలీస్ స్టేషన్ల ఎస్సైలు,పాత్రికేయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులను యుద్ధ ప్రాతిపదికన ఆదుకోవాలి

**వనపర్తి బ్యూరో, నవంబర్ 3 (జనంసాక్షి) :** తుఫాను వర్షానికి వరి రైతులకు తీవ్ర నష్టం జరిగిందని ఎకరాకు రూ. 50వేల సహాయం యుద్ధ ప్రాతిపదికన అందించి ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరామ్ డిమాండ్ చేశారు. పానగల్ మండలం పానగల్, కేతేపల్లి లెల్లరాల్లపల్లి, చిక్కేపల్లి, వెంగలాయిపల్లి లలో దెబ్బతిన్న పంటలను పరిశీలించి మాట్లాడారు. తుఫాన్ కు కోతకు వచ్చిన వరిచేలు పొలాల్లో చాపలా పడిపోయాయని నీళ్లు నిలిచి మొలకలు వస్తున్నయ్ అన్నారు. ఇంకా కోతకు దాని చేలు కూడా పడిపోయాయని నీళ్లలో తడిసి గింజ పడకుండా పోయే పరిస్థితి ఉందన్నారు. ఎకరాకు రూ.70 వేల విలువగల ధాన్యం పండేదని పెట్టుబడి రూ. 40 వేలు ఫోను 30000 లాభం వచ్చేదని పంట నీటి పాలు కావడంతో పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. కనీసం 50,000 పరిహారం ఇస్తేనే కొంత ఊరట లభిస్తుందన్నారు. రోహిణి కార్తెలో నాట్లు వేసిన వరిచేలు



కోస్తున్నారని గ్రామాల్లో దాన్యం పోసుకునేందుకు స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో సాగు కానీ భూమి రైతులను అడిగి ఆ పొలాల్లో ధాన్యం పోసుకొని ఆరబెట్టుకునే వారని ఈసారి పూర్తిగా కావడంతో ధాన్యం ఆరబోసుకునేందుకు ఫలాలు దొరకక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు తెరవాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో శాశ్వతంగా కొనుగోలు కేంద్రాలకు స్థలాలను కేటాయించాలన్నారు. టెంట్లు, తార్పలిండ్లు, ఖాళీ సంచులు, వేయింగ్ మిషన్లు, ట్రాన్స్పోర్టేషన్ వసతులతో కేంద్రాలు తెరవాలన్నారు. గత ఏడాది వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. కేంద్రాల్లో హమాలీ చార్జీలను రైతుల నుంచి వసూలు చేస్తున్నారని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. రబీలో కొన్న ధాన్యానికి ఇంతవరకు క్వింటాలకు రూ. 500 బోనస్ ఇవ్వలేదని ఇవ్వాలన్నారు. ఖరీఫ్‌లో కొనే ధాన్యానికి మద్దతు ధరతో పాటు 500 బోనస్ ఒకేసారి చెల్లించాలన్నారు. నష్టపోయిన రైతులను ఆదుకోకుంటే రైతులను సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జే. రమేష్, మండల కార్యదర్శి డంగు కుర్మయ్య, మాజీ ఉప సర్పంచ్ బాలస్వామి, మాజీ వార్డు సభ్యుడు పెంటయ్య రైతులు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



**తూప్రాన్, నవంబర్ 3 (జనం సాక్షి) :** పెండింగ్‌లో ఉన్న డిఆర్సీనీ విడుదల చేసి విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగస్తులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధనకై ప్రభుత్వము నుండి రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని పెండింగ్లో ఉన్న డిఆర్సి లను వెంటనే విడుదల చేయాలని ఈనెల 7వ తారీఖు నాడు చలో హైదరాబాద్ ధర్నాచౌక్‌కు హాజరు కావలసినదిగా విశ్రాంత ఉద్యోగస్తులందరినీ కోరుచు ఈ దినము తూప్రాన్ మండల శాఖ విశ్రాంతి ఉద్యోగస్తులు అధ్యక్షులు కార్యదర్శులు ఉపాధ్యక్షులు గోడ పోస్టర్ను విడుదల చేయనైనది. రిటైర్డ్ ఉద్యోగస్తుల సంఘం తూప్రాన్ మండల శాఖ అధ్యక్షులు జి. మల్లారెడ్డి ప్రధాన కార్యదర్శి ఎస్. విద్యాసాగర్ జిల్లా జాయింట్ సెక్రెటరీ ఆర్. బిక్షపతి గౌడ్ సహాయ అధ్యక్షులు ఎస్ రాములు ఇతరులు పాల్గొన్నారు.

# ఇబ్బందుల్లేకుండా ధాన్యం కొనుగోళ్లు

- నష్టపోయిన రైతులను ఆదుకుంటాం
- వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద
- ధాన్యం కొనుగోలు కేంద్రాం ప్రారంభించిన కలెక్టర్



**రాయపర్తి, నవంబర్ 03 (జనంసాక్షి) :** రైతులకు కొనుగోలు కేంద్రంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద అన్నారు. రాయపర్తి మండలంలోని కొండూరు గ్రామంలో ఐకెపి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సోమవారం అధికారికంగా ప్రారంభించారు. అనంతరం ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొండూరు,ఉకల్ గ్రామాల్లో నష్టం వాటిల్లిన వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల ధాన్యం తక్షణమే కొనుగోలు చేసి, చెల్లింపులు సమయానికి జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ సదుపాయం,బరువులు కొలిచే యంత్రాలు వంటి మౌలిక వసతులు సమృద్ధిగా ఉండేలా చూడాలని అన్నారు. రైతులు ధాన్యం విక్రయానికి వచ్చే సమయంలో తేమ శాతం, నాణ్యతా ప్రమాణాల పై అవగాహన కల్పించాలని సూచించారు.వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆదుకొంటుందని తెలిపారు.పంట నష్టం పై నిజమైన అంచనాలు వేయడానికి వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతులకు సాయం అందించే దిశగా పంటనష్టం వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని, అర్హులైన ప్రతి రైతుకు ప్రభుత్వం అందించే నష్టపరిహారం తప్పక అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కొండూరు దుర్గా దేవాలయం వద్ద గల కాజ్వే,ఉకల్ ఊర చెరువు కాజ్వే లను పరిశీలించారు.ప్రతి మండలంలో చెరువులలో నీటి సామర్ధ్యం,నీటి ఇన్ అవుట్ ఫ్లో ఆధారంగా ప్రజల రాకపోకలకు కాజ్వేల వద్ద అంతరాయం కలుగకుండా కాజ్వే,బ్రిడ్జిల ఏర్పాటుకు ఇరిగేషన్,ఇంజనీరింగ్ అధికారులు సమన్వయం తో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎఎంసి వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి,డిఆర్డీఓ రామిరెడ్డి,జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ,తహసీల్దార్ శ్రీనివాస్,వ్యవసాయ అధికారి వీరభద్రం,ఎపీఎం రవీందర్,ఇరిగేషన్ ఏఈ బాలదాసు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హమ్య నాయక్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు ఈదులకంటి రవీందర్ రెడ్డి,స్థానిక ప్రజా ప్రతినిధులు,రైతులు పాల్గొన్నారు.

# వాయిదా పడిన మద్యం దుకాణాలకు లక్కీ డ్రా



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ములుగు జిల్లాలో వాయిదా పడిన రెండు మద్యం దుకాణాలకు సోమవారం లక్కి డ్రా నిర్వహించారు. గత నెల 27న నిర్వహించిన మద్యం దుకాణాల డ్రాలో నిలిచిపోయిన రెండు మద్యం దుకాణాలకు ఓపెన్ టెండర్ ప్రక్రియలో భాగంగా సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలోని ఐడిఓసీ కార్యాలయంలో కలెక్టర్ ఛాంబర్ లో షాపు నెంబర్ 49, 50 లకు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ డ్రా నిర్వహించారు. ఈ డ్రా లో ములుగు జిల్లా చల్వాయి షాప్ నెంబర్ 49 కోసం 23 మంది దరఖాస్తులు చేసుకోగా, సదర్ లాల్ అనే వ్యక్తికి దక్కింది. అదేవిధంగా గోవిందరావుపేట లోని షాపు నెంబర్ 50 కు 20 మంది దరఖాస్తులు చేసుకోగా సమ్మక్క అనే మహిళకు దక్కింది. దరఖాస్తుదారుల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ టోకెన్ల డ్రా ద్వారా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి, ములుగు జిల్లాల ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్, ఇతర అధికారులు, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

# పట్టినా, అమ్మినా నేరమే!

- వన్యప్రాణి చట్ట ప్రకారం కఠిన చర్యలు
- మూడు నుండి ఏడేండ్ల జైలుశిక్ష
- అంతరించి పోతున్న రెడ్ శాండ్ బోవా పాము

**ఈ పామును పట్టినా ఎవరికైనా అమ్మినా అందుకు వన్య ప్రాణి చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని అటవీ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. అదే రెండ్‌శాండ్ బోవా పాము. దీని ప్రాముఖ్యత, ప్రాచుర్యంపై జనంసాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం..**





**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :**

ఈ పాములు అన్ని పాముల్లా ఎప్పుడు పడితే అప్పుడు కనిపించవు. ఎప్పుడో ఒకసారి మాత్రమే అవి బయటకు వస్తుంటాయి. అలా వచ్చాయా ఇలా మాయం ఐపోతుంటాయి. మళ్లీ ఎక్కడా కనిపించదు.కానీ కొంత మంది గుట్టు చప్పుడు కాకుండా ఈ పాములను వేటాడి పట్టి ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.ఆ పాము పేరే రెడ్ శాండ్ బోఅ తెలుగులో దీనిని రెండు (మూతుల పాము) అని ప్రచారంలో ఉంది. జిల్లాలో పదేళ్ల క్రితం ఈ పాములు ఎక్కువగా కనిపించేవి. ముఖ్యంగా పంట చేల వద్ద భూమి బోరియల్లో ఎప్పుడు కనిపించేవి. కానీ రాను రాను వీటి సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తూ ఇప్పుడు అసలే కనిపించకుండా పోతున్నాయి. ఇవి ఎక్కువ శాతం ఇసుక నేలల వద్ద ఉండే బొరియలు, భూమి పొరల కింద ఎవరికీ కనిపించకుండా ఉంటాయి. వీటి బరువు ఐదు కిలోల వరకు ఉంటుంది. ఈ పాములు ఎరుపు రంగులో ఉండి బలంగా కనిపిస్తాయి. కొన్ని సంవత్సరాల నుంచి ఈ పాములకు మూఢ నమ్మకాలు శాపంగా మారాయి. ఈ పాములకు అతీత శక్తులు ఉంటాయని, గుప్త నిధుల జాడ చూపెడతా యని, వీటిలో అద్భుత శక్తులు ఉంటా యని, వీటికి విదేశాల్లో మంచి డిమాండ్ ఉంటుందని, బరువు పది కిలోలవరకు ఉండాలని అప్పుడే వీటికి మంచి ధర వస్తుందని అనే మూఢ నమ్మకాలు ప్రచారంలో ఉండటం కారణంగా ఈ పాములను పట్టి అమ్మితే తొందరగా లక్షాదికారులు అవ్వొచ్చనే దురాశతో కొంత మంది గుర్తు తెలియని స్మగ్లర్లు వీటిని అన్వేషిస్తూ వేటాడి పట్టి దొంగ చాటుగా ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసు కుంటున్నారు. దీంతో ఇప్పుడు ఈ పాములు ప్రమాదంలో ఉన్నాయి. ఎక్కడా కూడ వీటి జాడ కనిపించడం లేదు. వాస్తవంగా ఈ పాములకు రెండు మూతులు ఉండవని తోక చివరి భాగంలో మూతి వలె ఆకారం కలిగి ఉంటుందే తప్ప రెండు మూతులు అసలే ఉండవు అని కొంత మంది అదికారులు తమ అభిప్రా యం వ్యక్తం చేశారు. ఈ పాములను పట్టుకోవడం, లేదా కల్గివుండడం, అమ్మడం వంటివి చేస్తే నేరం అవుతుంది. ఇందుకు వన్య ప్రాణి చట్టం 1972 ప్రకారం మూడు నుండి ఏడు సంవత్సరాల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉంటుందని, 25,000 వేల రూపాయల వరకు జరిమానా ఉంటుందని అటవీ శాఖా అదికారులు చెప్తున్నారు.

# సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ప్రజావాణిలో వచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం భూపాలపల్లి ఐడిఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత దగ్గర చేయడం, సమస్యలను నేరుగా విని వెంటనే పరిష్కారం చూపించడమే లక్ష్యంగా ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణికి వచ్చిన 44 మంది దరఖాస్తుదారులతో కలెక్టర్, మీ సమస్య చెప్పండని అడిగి తెలుసుకుని దరఖాస్తు పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు ఎండార్స్మెంట్ చేస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తులను సమయానికి పరిష్కరించడం అన్ని శాఖల బాధ్యత అని ఆయన తెలిపారు. ప్రతి ఫిర్యాదును జాగ్రత్తగా నమోదు చేసి, పరిష్కారం వరకు అధికారులు పర్యవేక్షించాలని, అవసరమైతే ఫీల్డ్ పరిశీలనలు కూడా చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డిఓ రవి, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# దాతృత్వాన్ని చాటిన మరిపెడ సీఐ



- షూస్ లేకుండా నడిచే పాఠశాల పిల్లలను చూసి చలించిన ఇన్స్పెక్టర్
- 130 మంది విద్యార్థులకు సొంత ఖర్చులతో షూస్ వితరణ
- కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

**మరిపెడ నవంబర్ 3 (జనంసాక్షి) :** పోలీస్ లు లాఠీలకు పని చెప్తూ దోషుల పట్ల కఠినంగా ఉండటమే కాదు.. పేదరికాన్ని చూసి చలించే హృదయాన్ని కలిగి ఉంటారని నిరూపించారు మరిపెడ సీఐ రాజ్ కుమార్ గౌడ్. మరిపెడ మండలం సీతారాం పురం పాఠశాలలో చదివే విద్యార్థులు రోజు షూస్ లేకుండా కాలి పాదాలతో పాఠశాలకు వెళు_న్నారని సమాచారం అందుకున్న మరిపెడ సీఐ రాజ్ కుమార్ గౌడ్ వెంటనే పాఠశాలకు చేరుకున్నారు. పేదరికంలో ఉన్న పిల్లలను చూసి చలించిన సీఐ సాబ్ 130 విద్యార్థులకు షూస్ తెప్పించి ఇచ్చి పిల్లల కళ్లలో ఆనందం చూశారు. పాఠశాలకు చేరుకొని పిల్లల పరిస్థితిని విని షూస్ వితరణ చేసిన సీఐ కి ఉపాధ్యాయులు,విద్యార్థులు,తల్లి తండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**ములుగు ప్రతినిధి, నవంబర్ 03(జనంసాక్షి) :** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులు సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో 46 దరఖాస్తులు రాగా అత్యధికంగా గృహ నిర్మాణ శాఖకు 13, భూ సమస్యలు 08, పెన్షన్ 05, ఇతర ఇతర శాఖలకు సంబంధించినవి 20 దరఖాస్తులు స్వీకరించగా వాటిని వెంటనే సంబంధిత అధికారులకు బదిలీ చేసి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, వివిధ జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి, పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ ఫామ్ సాగుతో అభివృద్ధి

ఏడీఏ పరశురాం



**పాలకుర్తి, నవంబర్ 03 (జనంసాక్షి) :** రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలని, అందుకు ఆయిల్ ఫామ్ సాగు చేయాలని పాలకుర్తి ఏడీఏ పరశు రాం నాయక్ సూచించారు. సోమవారం మ డల కేంద్రంలోని రైతు వేదికలో ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నూనె గింజల పంటల సాగు తక్కువ విస్తీర్ణం సాగుచేశారని ఆన్నారు. అందుకు ప్రత్యామ్నాయంగా రైతులు అయిల్ పామ్ సాగువైపు దృష్టి సారించాలని అన్నారు. నీటి సౌకర్యం ఎక్కువగా ఉన్న రైతులు ఆయిల్ పామ్ సాగు చేయాలని అన్నారు. ఈ పంట సాగుకు ప్రత్యేక ప్రోత్సహాకాలను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి సందీప్, ఏవో కర్ణాకర్, సహకార ఇన్స్పెక్టర్ స్వర్ణలత, ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ అధికారి వరున్, పాలకుర్తి సొసైటీ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, రణధీర్. తదితరులు ఉన్నారు.



# ఇంటిలోకి దూసుకెళ్లిన గ్రానైట్ లారీ

- మహిళ మృతి

**తొర్రూరు, నవంబర్ 3 (జనం సాక్షి)** మహబూబాబాద్ జిల్లాలో గ్రానైట్ లారీ బీభత్సం సృష్టించడం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ నుండి కాకినాడ పోర్టు వైపు వెళ్తున్న గ్రానైట్ లారీ తొర్రూరు మండలంలోని నాంచారి మదూరు గ్రామంలో సోమవారం ఉదయం అదుపుతప్పి ఇంటిలోకి దూసుకు వెళ్లడం జరిగింది. ఈ ప్రమాదంలో ఇంటిలోని జోగిరెడ్డి లక్ష్మి అనే మహిళ తీవ్రంగా గాయపడడంతో వరంగల్లోని హాస్పిటల్ కి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మరణించడం జరిగింది. తొర్రూరు మండలంలో అధిక లోడుతో వస్తున్న గ్రానైట్ లారీలు వరుస ప్రమాదాలకు కారణం కావడంతో ప్రజలు ఆందోళనకు లోనయ్యారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి నవంబర్ 3 (జనంసాక్షి) :** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ లో గల కలెక్టర్ కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు.జైపూర్ మండలం ముదిగుంట గ్రామానికి చెందిన గోదారి లక్ష్మణ్ మండలంలోని నర్వ గ్రామ శివారులోని తమ భూములు రెవెన్యూ రికార్డులలో ఇతరుల పేరిట చూపుతుందని, సమగ్ర విచారణ జరిపి తమ పేరిట మార్పు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మంచిర్యాల పట్టణం శ్రీ శ్రీ నగర్ కు చెందిన జాడి రాజమల్లు తాను మంచిర్యాల మండల తహసిల్దార్ కార్యాలయంలో ఆర్ టి ఐ చట్టం ప్రకారం సమాచారం కోసం దరఖాస్తు చేసుకున్నానని, ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. నస్పూర్ మండలం లోని శ్రీరాంనగర్ కు చెందిన ఎర్రం నర్సయ్య, సందవేని మల్లయ్య తమకు జీరో బిల్లు పథకం వర్తింపచేయాలని కోరుతూ వేరువేరుగా దరఖాస్తులు అందజేశారు. తాండూర్ మండలం గోపాల్ వాడకు చెందిన రౌతు మంగమ్మ, మంచిర్యాల పట్టణం హమాలీవాడకు చెందిన సూరం మల్లయ్య తమకు వృద్ధాప్య పింఛను ఇప్పించాలని కోరుతూ వేరువేరుగా దరఖాస్తులు అందజేశారు. దండేపల్లి మండలం ధర్మారావుపేట గ్రామానికి చెందిన కొల్లూరి సుగుణ తన ఇంటి స్థలంలో వేరొక వ్యక్తి చేపట్టిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను నిలుపుదల చేసి అక్రమ నిర్మాణానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. హాజీపూర్ మండలం పడ్తనపల్లి గ్రామానికి చెందిన కాంపెల్లి విజయ్ సాగర్ తమ నివాస ప్రాంతాలలో పందుల వలన ఇబ్బందులు పడుతున్నామని, సమస్య పరిష్కరించి తమను ఆదుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బెల్తారోడా అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద పటిష్ట గస్తీ నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



**నిర్మల్ బ్యూరో, నవంబర్ 03 (జనంసాక్షి) :** తానూరు మండలం బేల్తారోడా అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్ వద్ద 24 గంటలు పటిష్ట గస్తీ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం తానూరు మండలం బేల్తారోడా అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్ ను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో అన్ని పంటల కొనుగోలు ప్రక్రియ ప్రారంభమైనందున పక్క రాష్ట్రం నుంచి పంట అమ్మేందుకు తీసుకువచ్చే అవకాశం ఉన్నందున, నిరంతరం పటిష్ట నిఘా ఉంచాలన్నారు. చెక్ పోస్ట్ గుండా జిల్లాలోకి ప్రవేశించే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. వాహనాల వివరాల నమోదుకు సంబంధించి రిజిస్టర్ పరిశీలించారు. తనిఖీ చేసిన వాహనాల వివరాలకు సంబంధించి రిజిస్టర్ నిర్వహించాలని చెప్పారు. ఈ తనిఖీలో బైంసా సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజిప్రసాద్, పౌరసరఫరాల అధికారి రాజేందర్, మేనేజర్ సుధాకర్, తహసిల్దార్ ప్రవీణ్, ఎంపీడీవో నీరజ్ కుమార్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

- జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**నిర్మల్ బ్యూరో, నవంబర్03,(జనంసాక్షి)** ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను అదనపు కలెక్టర్ కు సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యం



**సూర్యాపేట ప్రతినిధి, నవంబర్ 3 (జనంసాక్షి) :** విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యమని ఎస్ఈ ఫ్రాంక్లిన్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డలో గల విద్యుత్ శాఖ సర్కిల్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల దినోత్సవ సందర్భంగా వినియోగదారుల నుండి విద్యుత్ సమస్యలపై దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు.ప్రతి నెల విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం సూర్యాపేట జిల్లా ఎస్ఈ ఆపరేషన్ సర్కిల్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి సమస్యలున్న దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు.వినియోగదారులు సిఎస్సి సెంటర్‌లలో ఎప్పుడైనా కంప్లైంట్ ఇవ్వవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డీఈలు శ్రీనివాస్, జ్యోతి కుమార్, ఎస్ఏఓ లక్ష్మయ్య, ఏఏఓ లింగయ్య, ఏడిఈలు, ఏఈలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సూర్యాపేటలో సందడి చేసిన జబర్దస్త్ ఫేమ్ అనసూయ



**సూర్యాపేట ప్రతినిధి, నవంబర్ 3 (జనంసాక్షి) :** వినియోగదారులకు నాణ్యమైన, నమ్మకమైన వస్తు సేవలను అందించి వారి మన్ననలు పొందాలని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎంజీ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన మణిముఖుర జ్యువెలర్స్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత 13 సంవత్సరాలుగా సాయి సంతోషి జ్యువెలర్స్ ద్వారా వినియోగదారుల మన్ననలు పొంది నూతనంగా ప్రారంభించిన మణిముఖుర జ్యువెలర్స్‌తో తమ వ్యాపార అభివృద్ధిని కొనసాగించాలని అన్నారు. అనంతరం సినీనటి, జబర్దస్త్ ఫేమ్ అనసూయ జ్యోతి ప్రజ్వలన చేశారు.పట్టణ ప్రజలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో కార్పొరేట్ స్థాయిలో జ్యువెలర్స్ షాప్‌ను ఏర్పాటు చేసిన తెడ్ల కిషోర్,ఉమా మహేశ్వరి,సాయి కిరణ్, చాందిని,సుహాస్, సంతోషి లను అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, పీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చింతమళ్ళ రమేష్,చివ్వెంల మండల పార్టీ అధ్యక్షులు దారావత్ వీరన్న, జ్యువెలరీ అసోసియేషన్ అధ్యక్షులు అంతటి విజయ్, ప్రధాన కార్యదర్శి సింహాద్రి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## లైసెన్స్‌డ్ సర్వేయర్లకు గౌరవ వేతనం ఇవ్వాలి



**సూర్యాపేట ప్రతినిధి, నవంబర్ 3 (జనంసాక్షి) :** లైసెన్స్‌డ్ సర్వేయర్లకు గౌరవ వేతనంతో పాటు విధివిధానాలతో కూడిన గైడ్ లెన్స్ ఇవ్వాలని కోరుతూ జిల్లా లైసెన్స్‌డ్ సర్వేయర్లు సోమవారం కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ కె.సీతారామారావుకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఐదు నెలల పాటు శిక్షణ అందించినట్లు తెలిపారు.ఈ శిక్షణలో ఉత్తీర్ణత సాధించిన వారికి లైసెన్సులు జారీ చేసినట్లు చెప్పారు.భూభారతి చట్టం అమల్లో భాగంగా లైసెన్స్‌డ్ సర్వేయర్ల వ్యవస్థను బలోపేతం చేస్తూ భూ వివాదాల సమస్యల పరిష్కారానికి తీసుకున్న నిర్ణయం గొప్పదని హర్షం వ్యక్తం చేశారు.తమకు తగిన గుర్తింపునిస్తూ నెలవారీ గౌరవ వేతన సదుపాయం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో లైసెన్స్‌డ్ సర్వేయర్లు పంతంగి సాలయ్య, ఈట ప్రశాంత్, గోపిరెడ్డి, సునీల్, పట్టేటి రాజు, సిహెచ్.నాగార్జున, మల్లయ్య, శాంతి వర్ధన్, హరి, మహేష్, ఆంజనేయులు, సైదులు, రాజేష్, సంపత్ కుమార్, రోశయ్య, ఫజల్, నరేష్, వినీత, శ్రేయ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని చాటాలి

- ఎస్సై బి. ప్రవీణ్ కుమార్



**మునగాల, నవంబర్ 3 (జనంసాక్షి) :** మండల పరిధిలోని నరసింహాపురం గ్రామంలో కార్తీక పౌర్ణమి వేడుకలలో భాగంగా ఈనెల 5వ తేదీన జరిగే కోదండరామస్వామి కళ్యాణం సందర్భంగా న్యూ జనరేషన్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలను మునగాల ఎస్సై బి. ప్రవీణ్ కుమార్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక ఆరోగ్యానికి దోహదపడుతాయని, క్రీడలు శరీర దారుఢ్యంతోపాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చునని, క్రీడా పోటీల్లో ప్రతి క్రీడాకారుడు ఒక్కరూ గెలుపు ఓటములను పట్టించుకోకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. క్రీడల్లో ముందుకు సాగాలంటే సాధనే ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సామాజిక కార్యకర్త డాక్టర్ వేమూరి సత్యనారాయణ, వీరబోయిన వినోద్, వీరబోయిన శ్రీను, వీరబోయిన ముత్తయ్య, మిడిసెనమెట్ల నరసింహారావు, కాశీ విశ్వనాథం, అల్లి చిన్న రామయ్య, నరేష్, విజయ్, సతీష్, వీరబాబు, సాయి, మురళీ, రామయ్య, వెంకటేష్, నరేష్, న్యూ జనరేషన్ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వడ్లు దిగుమతి చేసుకోవాలని వెంకటసాయి రైస్ ఇండస్ట్రీస్ వద్ద రైతుల ధర్నా

**కనగల్, నవంబర్ 3 (జనం సాక్షి) :** అకాల వర్షాలతో ఆగమైన అన్నదాతల బతుకులతో సందులో సడే మీయలాగా మిల్లర్ల యాజమాన్యం పలు రకాల కొరివిలు పెట్టి ధాన్యం దిగుమతి చేసుకోవడంలో ఇబ్బందులు పెడుతున్న సంఘటనలు రోజుకు ఒకచోట జరుగుతూనే ఉన్నాయి. వర్షాలతో నీట మునిగిన పంట వర్షార్పణం కాగా, ఎంతోకొంత చేతికొచ్చిన పంటను ఆరబెట్టుకొని ఐకెపి కేంద్రాల ద్వారా అమ్ముకోవడానికి వస్తే, తేమశాతాన్ని అధికారులు పరిశీలించి ధ్రువీకరణ చేసిన తర్వాతనే నిర్వాహకులు తూకం వేసిన ధాన్యాన్ని సెంటర్లకు కేటాయించిన మిల్లుకు పంపితే అట్టి ధాన్యాన్ని మిల్లు యాజమాన్యం దిగుమతి చేసుకోకుండా వివిధ రకాల కొరివిలు పెడుతున్న మండలంలోని దోరేపల్లి స్టేజి వద్ద ఉన్న వెంకట సాయి రైస్ ఇండస్ట్రీస్ మిల్లు యాజమాన్యం అన్నదాతల జీవితాలతో చెలగాటమరుతున్నారు. గత రెండు రోజుల క్రితం మండలంలోని ఏమి రెడ్డిగూడెం, లింగాలగూడెం, జి చెన్నారం, ఐకెపి కేంద్రాల నుంచి అధికారులు ధ్రువీకరణ చేసిన తర్వాతనే తూకం వేసిన ధాన్యాన్ని లారీలలో దిగుమతి కోసం వెంకట సాయి రైస్ మిల్ దగ్గరికి రాగా అక్కడ మిల్లు యాజమాన్యం తేమశాతాన్ని పరిశీలించగా ప్రభుత్వ నిబంధనల కు లోబడి 17 శాతం లోపు ఉండగా ఇట్టి లారీల ను మిల్లు యాజమాన్యం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్ గోదాములలో దిగుమతి కోసం పంపించగా అక్కడ కూడా మిల్లు యాజమాన్యం మరొకసారి తేమా శాతాన్ని పరిశీలన చేయడంతో 21 శాతంగా చూపించడంతో యాజమాన్యం అట్టి లారీలను తిరస్కరించింది. లారీ డ్రైవర్ చేసేది ఏమి లేక ఐకెపి నిర్వాహకులకు విషయాన్ని తెల్పడంతో, ధాన్యం దిగుమతి కాలేదన్న విషయాన్ని రైతులకు కూడా తెలిసిపోవడంతో ఆగ్రహానికి గురైన మూడు గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులు సోమవారం వెంకట సాయి రైస్ మిల్లు వద్ద ధర్నా కార్యక్రమాన్ని చేపట్టి అనంతరం నల్లగొండ-దేవరకొండ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై రెండు గంటలు పాటురాస్తారోకో నిర్వహించగా వాహనాల రాకపోకలు ఎటుచూసినా రెండు కిలోమీటర్ల మేర ఎక్కడికక్కడనిలిసిపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాస్తారోకో జరుగుతున్న సమాచారాన్ని న్ని తెలుసుకున్న జిల్లా



పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, డి ఎం గోపికృష్ణ, ఏవో అమరేందర్ గౌడ్, ఆర్ ఐ సునిత, సీఐ ఆదిరెడ్డి, ఎస్సై కే రాజీవ్ రెడ్డి ఏపిఎం మైసేశ్వరరావు, సీసీలు ఇద్దయ్య, విజయ, ప్రభాకర్లు సంఘటన స్థలముకు చేరుకొని అక్కడ జరిగిన పరిస్థితులను రైతుల ద్వారా తెలుసుకొని రైతులతో సానుకూలంగా మాట్లాడి మిల్లు యాజమాన్యంతో అధికారులు చర్చలు జరిపిన తర్వాత రైతులు చేస్తున్న రాస్తారోకోను విరమింపజేసి వాహనాల రాకపోకలకు అంతరాయం కలవకుండా అధికారులు చాకచక్యంగా వ్యవహరించారు.

## రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి

**భువనగిరి రూరల్, నవంబర్ 3 (జనం సాక్షి) :** భువనగిరి బిజెపి మండల శాఖ అధ్యక్షులు చీర్కా సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో మండలంలో గల తుక్కాపురం గ్రామంలో ఐకెపి సెంటర్ ను బిజెపి శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు బస్వాపురం నరసయ్య సందర్శించడం జరిగింది. వారు మాట్లాడుతూ అకాల వర్షం కారణంగా రైతులకు తీవ్ర నష్టం జరిగిందని దీనిని ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలని ఐకెపి సెంటర్లలో ఉన్న ధాన్యాన్ని బేషరతుగా వెంటనే కొనుగోలు చేయాలని అన్నారు అలాగే నష్టపోయిన రైతులకు ఎకరాకు 30 వేల చొప్పున నష్టపరిహారం ప్రభుత్వం ఇవ్వాలని రైతులకు బోనస్ గా ఇస్తానన్న 500 రూపాయలు వెంటనే చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు ఉట్కూరి



అశోక్ గౌడ్, మాజీ జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్, పడమటి జగన్మోహన్ రెడ్డి, చంద మహేందర్, మండల ఇంచార్జ్ జైనపల్లి శ్యాంసుందర్ రెడ్డి, పట్నం శ్రీనివాస్, ఫకీర్ రాజేందర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు నాగు వినోద్ కుమార్, మాటూరి అనిల్ గౌడ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ బబ్బూరి సురేష్ గౌడ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు పడమటి మాణిక్యం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## జీఆర్పీ, ఆర్పీఫ్ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత

**ఖమ్మం, నవంబర్ 3 (జనం సాక్షి) :** సూపరిండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ సికింద్రాబాద్, డిప్యూటీ సూపర్డెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ కాజీపేట వారి ఆదేశానుసారముగా ఇన్స్పెక్టర్ ఆఫ్ రైల్వే పోలీస్ ఖమ్మం ఎన్. అంజలి ఆధ్వర్యంలో జె. సురేష్ ఎస్సై జిఆర్పీ డోర్నకల్, ఆర్పీఫ్ ఖమ్మం జిఆర్పి సంయుక్త సిబ్బంది ఆధ్వర్యంలో ఖమ్మం రైల్వే స్టేషన్ ప్లాట్ఫారం నెంబర్ టు పై జనరల్ తనిఖీలు చేయుచుండగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి దగ్గర రెండు బ్యాగ్ లతో అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరు వ్యక్తులను పట్టుకొని విచారించగా రాష్ట్రంలో గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి షోలాపూర్‌లో అధిక ధరకు అమ్ముకుంటే ఎక్కువ డబ్బులు వస్తాయని ఉదేశ్యంతో ఏవిధంగానైనా తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించలి మేము ఇద్దరం కలిసి మా రాష్టం అయిన ఒరిస్సాలో ఒక ఐదు గంజాయి ప్యాకెట్‌లు తక్కువ ధరకు కొనుగోలు చేసి మా రెండు బ్యాగ్‌లో అట్టి గంజాయి ప్యాకెట్‌లను పెట్టుకొని ఆదివారం సాయంత్రం సమయంలో షోలాపూర్ వెళ్ళుట కొరకు, భునేశ్వేర్ రైల్వే స్టేషన్ నందు కోణార్క్ ఎక్స్ప్రెస్ నందు ఎటువంటి ప్రయాణపు టికెట్ లేకుండా స్లీపర్ కోచ్ నందు ఎక్కి ప్రయనించు చుండగా ఉదయం సమయంలో టీసీ టికెట్‌ను చెక్ చేస్తూ ఉండగా మా దగ్గర టికెట్ లేనందున మాకు భయం వేసి ఖమ్మం రైల్వే స్టేషన్‌లో దిగినాము, తర్వాత వచ్చే వేరే రైలుబండి ఎక్కి షోలాపూర్ వెళ్ళాలి అనే ఉద్దేశంతో ఖమ్మం రైల్వే స్టేషన్ ప్లాట్ఫారం నెంబర్: 2 పై ఫుట్ ఓవర్ బ్రిడ్జి వద్ద వేచి ఉండగా రైల్వే పోలీస్ ఖమ్మం వారు పట్టుకున్నారు రెండు బాగ్స్‌లో అందులో 10..18కేజీలు గంజాయి ,ఖరీదు 5,15,000/- వేల రూపాయలు, గంజాయిని పట్టుకొని అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్ కొరకు కాజీపేట రైల్వే కోర్టుకు పంపించారు.

## తుఫాన్‌తో నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి



**హుజూర్‌నగర్, నవంబర్ 3 (జనంసాక్షి) :** మొంథా తుఫాన్ తో నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకొని వారికి నష్టపరిహారం చెల్లించాలని భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షులు కొండ హరీష్ గౌడ్ అన్నారు. సోమవారం హరీష్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ మధ్య కాలంలో మొంథా తుఫాను ప్రభావంతో హుజూర్ నగర్ ప్రాంతంలో పడిపోయినటువంటి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కొండ హరీష్ గౌడ్ మాట్లాడుతూ ఈ సంవత్సరం పంట చాలా బాగా పండిందని రైతులు సంతోషపడుతున్న సమయంలో అనుకోకుండా వచ్చినటువంటి మొంథా తుఫాన్ రైతులను కోలుకోలేనటువంటి దెబ్బతీసిందని తెలిపారు. ఈ తుఫాన్ ప్రభావంతో చేతుకొచ్చిన వరి పంట నేడో, రేపు కోతకోయాల్సినటువంటి పంట మొత్తం కూడా కింద పడిపోయి నీటిపాలై దేనికి పనికి రాని స్థితిలో ఉన్నదని దీనివలన రైతులు చాలా తీవ్రంగా నష్టపోయారని, ఇందులో కౌలు రైతులు కూడా చాలామంది ఉన్నారని వీరు పెట్టుబడుల రూపంలోనే ఎకరాకు సుమారు 30 నుంచి 35 వేల రూ. లు వరకు ఖర్చు పెట్టారని, దీనికదనంగా కౌలు కూడా ఉంటుందని తెలుపుతూ వీరందరినీ కూడా ప్రభుత్వం వెంటనే ఆదుకొని వీరికి ప్రతి ఎకరాకు 50,000/- రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, స్థానిక మంత్రిని డిమాండ్ చేశారు. అదేవిధంగా స్థానిక రైతులందరితో కలిసి ఎఈఓ రమ్యతో మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు 50,000/-రు.లకు తగ్గకుండా నష్టపరిహారం ఇప్పించాలని ఆ విధంగా రిపోర్టు తయారు చేసి ప్రభుత్వానికి పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు చింతలపూడి ఉమామహేశ్వరరావు, జిల్లా నాయకులు కుందూరు కోటిరెడ్డి, జనిగల శ్రీనివాస్ గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శి గుండా గోపి, కంటు నాగరాజు, బల్వంత్ సింగ్, రాధాకృష్ణ, స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మహిళ దారుణ హత్య



**ఖమ్మం రూరల్, నవంబర్ 3 (జనం సాక్షి) :** ఖమ్మం జిల్లా ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ముత్తగూడెం గ్రామంలో సోమవారం తెల్లవారుజామున ఓ మహిళ హత్యకు గురైంది. ఆమె కుమారుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గునిగంటి నాగమణి (45) తన కుమారుడు మహేశ్‌కు తన అన్న మోటపోతుల వెంకన్న కూతురు అఖిలను ఇచ్చి మూడేండ్ల క్రితం వివాహం చేసింది. ఏడాది కాలంగా మహేశ్, అఖిల మధ్య మనస్పర్థలు తలెత్తాయి. గ్రామ పెద్ద మనుషులు ఇరువురికి నచ్చజెప్పి అఖిలను కాపురానికి పంపడం జరిగింది. కాగా కొద్దీ రోజులకే జ్వరం తదితర సమస్యలతో అఖిల అదే గ్రామంలోని తన పుట్టింటికి వెళ్లింది. సోమవారం మరోమారు వెంకన్న తన కూతురు అఖిలతో పాటు కొడుకు మనోజ్, తన బావమరిది, డోర్నకల్ మండలం దేవుడి సంకీస గ్రామానికి చెందిన హెల్ది వెంకన్నను వెంటపెట్టుకుని తెల్లవారుజామున నాగమణి ఇంటికి వెళ్లాడు. అయితే అఖిల తనకు ఇష్టం లేదని, ఆమె ఇంటికి రావద్దని మహేశ్ తెగేసి చెప్పడంతో వారు వెనుతిరిగి వెళ్లారు.కొద్దిసేపటికి వెంకన్న కుమారుడు మనోజ్ బావమరిది హెల్ది వెంకన్న బైక్‌పై నాగమణి ఇంటికి వచ్చి నిమిషాల వ్యవధిలోని తన వెంట తెచ్చుకున్న కత్తితో వెంకన్న పొడవడంతో నాగమణి అక్కడికక్కడే మృతి చెందింది. తన తల్లిపై దాడి జరుగుతున్న విషయం తెలుసుకున్న మహేశ్ ఇంటి నుంచి బయటకు రావడంతో మనోజ్, వెంకన్నఅతడిపై సైతం తీవ్రంగా దాడి చేసి అక్కడినుండి పారిపోయారు. విషయం తెలిసిన రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి, ఖమ్మం రూరల్ సీఐ ముష్కరాజు సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతురాలు నాగమణితో పాటు తీవ్ర గాయాలైన మహేశ్‌ను ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నిందితుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

## మెడ్ ఎక్స్ - 2025 ఎగ్జిబిషన్ ద్వారా వైద్యరంగ సేవలపై అవగాహన

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, నవంబర్ 3 (జనంసాక్షి) :** మెడ్ ఎక్స్ - 2025 ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు. సూర్యాపేట పట్టణంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో సోమవారం రెండు రోజులపాటు నిర్వహించే మెడ్ ఎక్స్- 2025 పేరిట నిర్వహించే ఎగ్జిబిషన్ ను ప్రారంభించారు.విద్యార్థులచే చేసిన స్టాల్స్ వీక్షించారు.ఈ స్టాల్స్ లలో సిపిఆర్, శరీర భాగాల పని విధానం,దోమల ద్వారా వ్యాపించే రోగాల వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఎగ్జిబిషన్ ద్వారా ప్రత్యక్ష వర్క్ షాప్ లు, క్లినికల్ ప్రదర్శనలు, వైద్య నిపుణలతో సంభాషణ,అత్యాధునిక ల్యాబ్ లు, మ్యూజియం సందర్శన, వైద్య విద్యార్థి జీవితంపై సీనియర్ వైద్యులు, ప్రొఫెసర్లు లాంటి నిపుణుల ప్రసంగం, కెరియర్ గైడెన్స్ కు చెందిన నీట్ కు ఎలా సన్నదం అవ్వాలి, వైద్య విద్య, కెరియర్ అవకాశాలపై మార్గదర్శకత్వం వంటి కార్యక్రమాలు జరుగుతాయని అన్నారు.ఈ ఎగ్జిబిషన్ లో 8వ తరగతి నుండి ఇంటర్ రెండవ సంవత్సరం చదివే విద్యార్థులు హాజరై పాల్గొని వాటిపై అవగాహన కల్పించుకోవాలని సూచించారు.మొదటి రోజు మెడ్ ఎక్స్- 2025 ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని 1700 మంది సందర్శించినట్లు తెలిపారు. రెండవరోజు నేటి ఉదయం 9.30 నుండి సాయంత్రం 4 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.యువత తరలిరావాలని కళాశాల ప్రిన్సిపాల్ జయలత అన్నారు.ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ జయలత, హాస్పటల్ సూపరింటెండెంట్ శ్రవణ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి, జీమియా, హెచ్ఓడిలు బాబురావు, కృష్ణయ్య, గురు రాజ్, శ్రీకాంత్, తరుణీ, గీత, ఈశ్వరమ్మ, రాధిక, యస్వంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల ప్రాణాలతో స్కూల్ యాజమాన్యం చెలగాటం

- వాటర్ కలుషితంతోనే కామెర్ల వ్యాధి సోకి చిన్నారి మృతి
- గత నెలలోనే ప్రైవేట్ ఆరెంజ్ స్కూల్లో వాటర్ కలుషితంతో పిల్లలకు కామెర్ల వ్యాధి సోకిందని తల్లిదండ్రుల ఆరోపణ
- తమ పిల్లలకు ఏమి జరుగుతుందోనని తల్లిదండ్రుల ఆందోళన
- నిర్లక్ష్యంగా ప్రవేట్ స్కూల్ యాజమాన్యం
- సంబంధిత అధికారులు, ఆరెంజ్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రుల డిమాండ్

**మేళ్లచెరువు, నవంబర్ 3 (జనంసాక్షి) :** మండలంలోని ప్రైవేట్ ఆరెంజ్ స్కూలులో యూకేజీ చదువుతున్న షాగంరెడ్డి సుజిత్ రెడ్డి (6) స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యంతోనే తమ చిన్నారి మృతి చెందినట్లు తల్లిదండ్రులు శాగంరెడ్డి శంబిరెడ్డిస్వాతి ఆరోపించారు. సోమవారం స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం ఆరెంజ్ స్కూల్లో గత నెలలోనే 22 మంది పిల్లలకు ఆ స్కూల్లో వాటర్ తాగి అనారోగ్య పాలయ్యారన్నారు. ఆ స్కూల్లో వాటర్ కలుషితం కావడం వల్ల జాన్డీర్స్, లివర్, కామెర్ల ప్రాబ్లంతో అనారోగ్యాలు పాలై పిల్లలు మృత్యువాత పడుతున్నారని పిల్లల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. స్కూల్ లోని పిల్లలకు ఈ ఘటన జరిగిన తర్వాత తమ పిల్లలకు ఏమి జరుగుతుందోనని తల్లిదండ్రులు భయపడుతున్నారు. ఇప్పటికే ఒక్కొక్క విద్యార్థికి, రెండు నుంచి మూడు లక్షల ఖర్చు చేశామని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి, ఆరంజ్ స్కూలుపై తక్షణమే చర్యలు తీసుకోవాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఆ స్కూల్లో చదువుతున్న పిల్లలకు పూర్తిగా నయమైనంతవరకు స్కూల్ ను బంద్ చేయాలని పిల్లల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.



తల్లిదండ్రులు పనిచేసి తమ పిల్లలు ఉన్నత చదువులు చదవాలని, భవిష్యత్తు బాగుండాలని, అహర్నిశలు కృషి చేసి చదివిస్తుంటే, ఈ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవరించి, తమ పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని, పిల్లల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# విపణి





## యాక్సిస్ కొత్త మ్యుచువల్ ఫండ్

**న్యూఢిల్లీ:**యాక్సిస్ మ్యుచువల్ ఫండ్ తాజాగా ఇన్‌కం ప్లస్ ఆర్బిట్రేజ్ ప్యాసివ్ ఫండ్ ఆఫ్ ఫండ్‌ని ప్రవేశపెట్టింది. నవంబర్ 11 వరకు ఇది అందుబాటులో ఉంటుంది.కనీసం రూ. 100 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. ఇది ప్రధానంగా డెట్ ఆధారిత ఫండ్ స్కీముల్లో 50-65 శాతం వరకు, ఆర్బిట్రేజ్ ఫండ్స్‌లో 35-50 శాతం వరకు, మిగతాది మనీ మార్కెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తుంది.ఈ ఫండ్ స్థిరంగా మెరుగైన రాబడిని, పన్ను ఆదా ప్రయోజనాలను అందిస్తుందని సంస్థ ఎండీ బి. గోప్‌కుమార్ తెలిపారు. తక్కువ రిస్కుతో, పన్నులు పోగా మరింత మెరుగైన రాబడిని కావాలనుకునే ఇన్వెస్టర్లకు ఇది అనువుగా ఉంటుందని వివరించారు. దేవాంగ్ షా, ఆదిత్య పగారియా, హార్దిక్ సత్రా, కార్తీక్ కుమార్ ఈ ఫండ్‌ని నిర్వహిస్తారు.

## హైదరాబాద్‌లో స్టీల్ స్ట్రక్చర్స్ యూనిట్

ప్రముఖస్ట్రక్చరల్స్టీల్సంస్థ ఫాబెక్స్ స్టీల్ స్ట్రక్చర్స్తమ రెండవ తయారీ యూనిట్‌ను తెలంగాణలోప్రారంభించింది. హైదరాబాద్ సమీపంలోని చిట్యాల్ వద్ద రూ.120 కోట్ల పెట్టుబడితో 40 ఎకరాల్లో ఈ తయారీ కేంద్రం ఏర్పాటైంది .నూతనమాన్యుఫ్యాక్చరింగ్యూనిట్ఏటా50వేలమెట్రిక్టన్నుల అదనపు ఉత్పత్తి సామర్థ్యాన్నిఅందిస్తుంది. దీంతోకంపెనీ మొత్తం ఉత్పత్తి సామర్థ్యం రెండు యూనిట్లలో కలిపి లక్ష మెట్రిక్టన్నులకుపెరగనుంది. ఈఫాబెక్స్సంస్థప్రీ-ఇంజినీర్డ్ నిర్మాణాలు, ఉక్కుఅమరికలరూపకల్పన, డిటైలింగ్, తయారీ, ఇన్‌స్టాలేషన్ వంటి విభాగాల్లోపనిచేస్తుంది. కంపెనీ ప్రస్తుతంవిజయవాడలోని యూనిట్ ద్వారా దేశీయకార్యకలాపాలునిర్వహిస్తోంది. ఇక్కడినుంచేఉత్పత్తుల ఎగుమతులుసైతంచేస్తోంది.ప్రస్తుతం రూ.463 కోట్ల టర్నోవర్ కలిగిన ఫాబెక్స్,400 మందికి ఉపాధికల్పిస్తోంది. కార్యకలాపాల విస్తరణతో, ఈ సంఖ్యను 800 మందికి పెంచాలనియోచిస్తోంది. తయారీ సామర్థ్యాన్ని మరింత విస్తరించడానికి, ఆవిష్కరణలను ప్రోత్సహించడానికిరాబోయే 2-3 ఏళ్లల్లో మరో రూ.100 కోట్ల పెట్టుబడి పెట్టాలని యోచిస్తున్నట్లుఫాబెక్స్ స్టీల్ స్ట్రక్చర్స్ సహ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ వేణు చావా తెలిపారు.



# స్వచ్ఛమైన బంగారం ఉత్పత్తి చేసే దేశాలు



**భారతదేశంతో పాటు.. చాలా దేశాలలో బంగారానికి భారీ డిమాండ్ ఉంది. అయితే ప్రపంచంలో స్వచ్ఛమైన బంగారం తయారు చేసే దేశాల సంఖ్య చాలా తక్కువే. ఈ కథనంలో ఆ దేశాల గురించి తెలుసుకుందాం.**



**చైనా:**ప్రపంచంలో ఎక్కువ బంగారాన్ని ఉత్పత్తి చేసే దేశాల్లో ఒకటైన చైనా.. స్వచ్ఛమైన బంగారం తయారు చేసే దేశాల జాబితాలో కూడా ఒకటి. ఇక్కడ లేటెస్ట్ టెక్నాలజీలను ఉపయోగించడం ద్వారా.. 99.9 శాతం ప్యూర్ గోల్డ్ తయారు చేస్తుంది. బంగారాన్ని బయటకు తీసిన దగ్గర నుంచి.. శుద్ధీకరణ వరకు అనేక దశలలో ఎలెక్ట్రోలిటిక్ రిఫైనింగ్ అనే పద్దతులను ఉపయోగిస్తుంది. తద్వారా శుద్ధమైన బంగారం తయారు చేస్తుంది.
**స్విట్జర్లాండ్:**స్విట్జర్లాండ్ కేవలం అందమైన దేశం మాత్రమే కాదు.. అత్యంత స్వచ్ఛమైన బంగారం తయా రు చేసే దేశం కూడా. ఈ దేశంలో తవ్వకం ద్వారా లభించే గోల్డ్ చాలా తక్కువ. అయితే.. ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకున్న ముడి బంగారాన్ని.. ఇక్కడున్న శుద్ధి కర్మాగారాల సాయంతో 99.9 శాతం స్వచ్ఛమైనదిగా తయారు చేస్తారు. గోల్డ్ బార్‌లను ప్రాసెస్ చేసి తిరిగి ఎగుమతి చేస్తుంది.
**ఆస్ట్రేలియా:**స్వచ్ఛమైన బంగారం ఉత్పత్తి చేసే దేశాల జాబితాలో.. ఆస్ట్రేలియా కూడా ఒకటి. ఇక్కడ తవ్వకాల ద్వారా అధిక బంగారం లభ్యమవుతుంది. గనుల నుంచి ముడి పదార్థంగా లభించిన బంగారాన్ని ప్రాసెస్ చేసి.. 99.9 శాతం స్వచ్ఛమైన గోల్డ్ రూపంలోకి మారుస్తారు. ప్యూర్ గోల్డ్ తయారు చేయడానికి కావలసిన టెక్నాలజీ ఈ దేశంలో అందుబాటులో ఉంది.
**యునైటెడ్ స్టేట్స్:**అమెరికాలోని నెవాడా, అలాస్కా, క్యాలిఫోర్నియా, కొలరాడో వంటి ప్రాంతాల్లో బంగారం విరివిగా లభిస్తుంది. ఇక్కడ ముడి పదార్థంగా లభించే బంగారాన్ని.. వివిధ దశల్లో రసాయన పద్దతులను ఉపయోగించి శుద్ధి చేస్తారు. తరువాత నాణేలు, కడ్డీల రూపంలోకి మార్చి ఎగుమతులు చేయడం జరుగుతుంది. యూఎస్ బంగారు ఉత్పత్తులు స్థిరమైన స్వచ్ఛత కఠినమైన పరీక్షకు ప్రసిద్ధి చెందాయి.
**కెనడా:**కెనడా పశ్చిమ ప్రాంతాలలోని బంగారు గనుల నుంచి ముడి పదార్థాలను తవ్వి తీస్తారు. సయనైడ్ లీచింగ్ పద్దతి తరువాత బంగారం వెలుపలికి తీసి.. ఎలెక్ట్రోలిటిక్ రిఫైనింగ్ పద్దతుల ద్వారా శుద్ధి చేస్తారు. ఇక్కడ తయారైన బంగారానికి ప్రపంచంలోని చాలా దేశాల్లో డిమాండ్ ఉంది.
**రష్యా:**స్వచ్ఛమైన బంగారం ఉత్పత్తి చేసే దేశాల్లో ఒకటైన రష్యా.. ప్రస్తుతం ఎక్కువ బంగారం ఉత్పత్తి చేస్తున్న దేశాల జాబితాలో ఆరవ స్థానంలో ఉంది. రష్యాలో బంగారాన్ని వెలికితీసేందుకు ప్రధానంగా సయనైడ్ లీచింగ్, గ్రావిటీ సెపరేషన్ పద్ధతులను ఉపయోగిస్తారు. బంగారం ఉన్న రాయిని బాగా పొడిచేసి, సోడియం సయనైడ్ ద్రావణంతో కలిపి సయనైడ్ లీచింగ్ ద్వారా ద్రవ రూపంలో వెలికితీస్తారు. తరువాత కార్బన్ పుల్ లేదా జింక్ ప్రిసిపిటేషన్ పద్ధతులు ద్వారా బంగారం తిరిగి ఘనరూపంలో మారుస్తారు. ఇలా అనేక పద్దతుల ద్వారా 99.9 శాతం స్వచ్ఛమైన బంగారం తయారు చేస్తారు.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
| --- | --- |
| ₹ 5.70 | ₹ 5.72 |

### బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 1,12,900 (22 క్యారెట్లు) | ₹ 1,23,170 (24 క్యారెట్లు) |
| --- | --- |

### వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్
₹ 1,68,000



## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై:** సోమవారం నష్టాల్లో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి లాభాల్లో ముగిసాయి. సెన్సెక్స్ 39.78 పాయింట్లు లేదా 0.047 శాతం లాభంతో..83,978.49 వద్ద, నిఫ్టీ 41.25 పాయింట్లు లేదా 0.16 శాతం లాభంతో 25,763.35 వద్ద నిలిచింది.డాల్ఫిన్ ఆఫ్‌షోర్ ఎంటర్‌ప్రైజెస్, తంగమైల్ జ్యువెలరీ, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఇండియా, లాంకోర్ హెూల్డింగ్స్, బీఎల్ఎస్ ఈ-సర్వీసెస్ వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరగా.. పంజాబ్ కెమికల్స్ క్రాప్ ప్రొటెక్షన్, ది గ్రోబ్ టీ కంపెనీ లిమిటెడ్, ఫిషర్ మెడికల్ వెంచర్స్ లిమిటెడ్, నీరాజ్ సిమెంట్ స్ట్రక్చరల్స్, స్టవ్ క్రాఫ్ట్ కంపెనీలు నష్టాల జాబితాలో చేరాయి.

## సేవింగ్స్ బ్యాంక్ ఖాతా ఏఐతో వాత!

**న్యూఢిల్లీ:**నాకు సేవింగ్స్ బ్యాంక్ ఖాతా ఒకటే ఉంది. అందులో జీతమే పడుతుందని కొందరు.. పెన్షన్ తప్ప ఇంకేమీ వేయనని ఇంకొందరు.. మార్చి నెలాఖరుకల్లా చాలా తక్కువ..అంటే మినిమం బ్యాలెన్స్ మాత్రమే ఉంటుందని మరికొందరు చెప్తుంటారు. అక్షరాలా ఇదే నిజమైతే ఏ ఇబ్బందీ ఉండదు. కానీ సేవింగ్స్ బ్యాంక్ అకౌంటు వ్యవహారాల మీద ఎలాంటి నిఘా ఉండదు. కేవలం ఫిక్సిడ్ డిపాజిట్ల మీదే దృష్టి ఉంటుందని కొందరి పిడివాదన.డిపార్టుమెంటు వారికి అవేమీ పట్టవు. కృత్రిమ మేధస్సు ద్వారా అన్ని బ్యాంకులు, అన్ని బ్రాంచీలు ప్రతి సంవత్సరం విధిగా, మీకు సంబంధించిన అన్ని సేవింగ్స్ ఖాతాల వ్యవహారాలను కొన్ని నిబంధనలకు లోబడి డిపార్టుమెంటుకు చేరవేస్తాయి. ఆ చేరవేత, ఆ తర్వాత ఏరివేత.. మెదడుకి మేత.. కృత్రిమ మేధస్సుతో వాత.. వెరసి మీకు నోటీసుల మోత! అసాధారణమైన నగదు డిపాజిట్లు, విత్‌డ్రాయల్స్ వారి దృష్టిలో పడతాయి. వివిధ సంస్థలు, ఏజెన్సీలు ప్రతి సంవత్సరం "నిర్దేశిత ఆర్థిక వ్యవహారాల"ను ఒక రిటర్ను ద్వారా తెలియజేస్తాయి.ఒక ఆర్థిక సంవత్సరంలో ఒకసారి కాని, దఫదఫాలుగా కానీ వెరసి నగదు డిపాజిట్లు రూ. 10,00,000 దాటితే మీ ఖాతా వ్యవహారాలు.. సేవింగ్స్ ఖాతాలో పడినట్లు కాదు.. డిపార్టుమెంటు వారి చేతిలో పడ్డట్లే.
**విత్‌డ్రాయల్స్:**కొందరు తమ ఖాతాల నుంచి పెద్ద మొత్తాలు విత్‌డ్రా చేస్తారు. వ్యాపారం నిమిత్తం, పెళ్లి ఖర్చుల నిమిత్తం.. ఇలా చేయడం చట్టపరంగా తప్పు కాకపోవచ్చు. అసమంజసంగా అనిపిస్తే ఆరా తీస్తారు. 'సోర్స్' గురించి కూపీ లాగుతారు.
క్రెడిట్ కార్డులపై భారీ చెల్లింపులు
అకౌంటు ద్వారా పెద్ద పెద్ద మొత్తాలు క్రెడిట్ కార్డుల చెల్లింపులకు వెళ్తుంటాయి. వీటి మీద నిఘా, విచారణ ఉంటాయి.
రూ. 30,00,000 దాటిన క్రయ విక్రయాలు..
ఇలాంటి క్రయవిక్రయాలను సబ్‌రిజిస్ట్రార్ వాళ్లు ప్రతి సంవత్సరం రిపోర్ట్ చేస్తారు. వెంటనే బ్యాంకు అకౌంట్లను చెక్ చేస్తారు. సాధారణ పద్దులు/రొటీన్ పద్దులు ఉండే అకౌంట్లలో పెద్ద పెద్ద పద్దులుంటే, వారి అయస్కాంతంలాగా వారి దృష్టికి అతుక్కుపోతాయి.
**విదేశీయానం.. విదేశీ మారకం..:**విదేశీయనం నిమిత్తం, విదేశీ చదువు కోసం, విదేశాల్లో కార్డుల చెల్లింపులు... ఇలా వ్యవహారం ఏదైనా కానీ రూ. 10,00,000 దాటితో పట్టుకుంటారు. దీనికి ఉపయోగించిన విదేశీ మారకం, చట్టబద్ధమైనదేనా లేక హవాలానా అనేది ఆరా తీస్తారు.
నిద్రాణ ఖాతాల్లో నిద్ర లేకుండా చేసే వ్యవహారాలు
కొన్ని సంవత్సరాలపాటు ఎటువంటి లావాదేవీలు ఉండని ఖాతాలను నిద్రాణ లేదా నిష్క్రియ ఖాతాలని అంటారు. వాటిలో అకస్మాత్తుగా పెద్ద పెద్ద వ్యవహారాలేమైనా జరిగాయంటే.. అధికారుల కళ్లల్లో పడతాయి. ఇలాంటి వ్యవహారాలు అధికారుల దృష్టిని ఆకట్టుకుంటే.. వారు వెంటనే పట్టుకుంటారు.

# క్రైస్తవులపై దమనకాండ

- అన్యాయంగా చంపేస్తున్న చూస్తూ ఉండిపోతున్నారు
- నైజీరియాపై ట్రంప్ సంచలన ప్రకటన!



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. క్రైస్తవులను అన్యాయంగా చంపేస్తూ చూస్తూ ఉండిపోతున్నారని ఆరోపిస్తూ ఆఫ్రికన్ దేశం నైజీరియాపై విరుచుకుపడ్డారు.ఈ క్రమంలో ఆ అఘాయిత్యాలకు అడ్డుకట్ట వేసేందుకు సైనిక చర్య తప్పదంటూ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఈ మధ్యే నైజీరియాను అమెరికా 'కంట్రీస్ ఆఫ్ పర్టికులర్ కన్సర్న్' జాబితాలో చేర్చిన సంగతి తెలిసిందే.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నైజీరియాలో క్రైస్తవులపై జరుగుతున్న హింసపై తీవ్రంగా స్పందించారు. ఫ్లోరిడాలో ఆదివారం సాయంత్రం మీడియాతో మాట్లాడుతూ.. నైజీరియాలో క్రైస్తవులను రికార్డు స్థాయిలో హత్య చేస్తున్నారు. చాలా పెద్ద సంఖ్యలోనే చంపుతున్నారు. నైజీరియాలో క్రైస్తవులు తీవ్ర ముప్పులో ఉన్నారు. ఇక మీదట అలా జరగనివ్వబోను. అవసరమైతే అమెరికా బలగాలను మోహరిస్తాం. వైమానిక దాడులు జరుపుతాం. ఇప్పటికే యుద్ధ విభాగానికి(%ణవజూఖతీఎవత్ శీట ఝతీ%) ఆదేశాలు కూడా జారీ చేశాను" అని తీవ్ర హెచ్చరికలే జారీ చేశారాయన. అంతకు ముందు..శుక్రవారం కూడా ఆయన ఇలాగే మాట్లాడారు. నైజీరియాలో క్రైస్తవత్వం అస్తిత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఈ హింసకు రాడికల్ ఇస్లామిస్టులు కారణమని ఆయన ఆరోపించారు. ఇది ఆగకపోతే నైజీరియాకు అందిస్తున్న సహాయాన్ని నిలిపివేస్తానని హెచ్చరిస్తూనే.. గన్స్-అ-బ్లేజింగ్ అంటూ అమెరికా సైనిక చర్యకు కూడా సిద్ధంగా ఉన్నట్టు తెలియజేశారు.
**సీపీసీ అంటే..:**తాజాగా నైజీరియాను కంట్రీస్ ఆఫ్ పర్టికులర్ కన్సర్న్ జాబితాలో చేర్చారు. ఆ వెంటనే ఆ జాబితా వెలువడడం గమనార్హం. సీపీసీని యునైటెడ్ స్టేట్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ తయారు చేస్తుంది. అంతర్జాతీయ మత స్వేచ్ఛ చట్టం 1998 ప్రకారం.. ప్రతి ఏటా ఈ జాబితాను రివైజ్ చేస్తుంటారు. అమెరికా విదేశాంగ కార్యదర్శి ఈ జాబితాను అధికారికంగా ప్రకటిస్తారు.ఈ జాబితాలో మత స్వేచ్ఛను ఉల్లంఘిస్తున్న దేశాలు ఉంటాయి. మతపరమైన హింస, వివక్ష, బలవంతపు మత మార్పిడిలు, మతపరమైన హక్కుల హననంలాంటి అంశాల ఆధారంగా ఈ లిస్ట్ రూపొందిస్తారు. అయితే, కొన్ని సందర్భాల్లో వివిధ కారణాల వల్ల మినహాయింపులు ఇవ్వవచ్చు. నైజీరియాతో పాటు చైనా, మయన్మార్, ఉత్తర కొరియా, రష్యా, పాకిస్తాన్ కూడా ఈ జాబితాలో ఉన్నాయి.
**నైజీరియా స్పందన:**ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ట్రంప్ చేసిన వ్యాఖ్యలను స్వాగతిస్తున్నట్లు నైజీరియా అధ్యక్షుడు బోలా టిన్బు వ్యాఖ్యానించారు. అయితే.. అదే సమయంలో తమ దేశ సార్వభౌమత్వం, భౌగోళిక సమగ్రతకు గౌరవం ఇవ్వాలని కోరారు. "ఆయన నైజీరియా పట్ల సానుకూలంగా ఉన్నారనే భావిస్తున్నాం. ఇరు దేశాధినేతలు కూర్చుని మాట్లాడుకుంటే.. ఉగ్రవాదాన్ని అణచివేయడం అంత కష్టమేమీ కాదు. ఆయన్ని త్వరలోనే మా అధ్యక్షుడు కలవాలనుకుంటున్నారు" అంటూ అధ్యక్ష సలహాదారు డేనియల్ బ్వాలా చెబుతున్నారు.
నైజీరియాలో ఏం జరుగుతోందసలు..
నైజీరియాలో బోకోహరాం, ఇస్లామిక్ స్టేట్ వెస్ట్ ఆఫ్రికా ప్రావిన్స్ వంటి ఇస్లామిక్ ఉగ్రవాద సంస్థలు గత కొంతకాలంగా హింసాత్మక చర్యలు కొనసాగిస్తున్నాయి. వీటికి తోడు రైతులు గొర్రెల కాపరులు మధ్య ఘర్షణలు.. మతపరమైన, జాతిపరమైన రూపం సంతరించుకుంటున్నాయి. ఈ క్రమంలోనే క్రైస్తవులపై అఘాయిత్యాలు జరుగుతున్నాయి.
**మరీ ముఖ్యంగా..**
ప్లాటూ, బెన్యూ, కదునా రీజియన్లలో క్రిస్టియన్లపై దాడులు పరిపాటిగా మారాయి. నైజీరియన్ సంస్థల కథనాల ప్రకారం.. 2019 నుంచి ఇప్పటిదాకా 600 మంది క్రైస్తవులు దారుణ హత్యకు గురయ్యారు ఇక్కడ. అయితే.. కొన్ని గ్లోబల్ సంస్థలు మాత్రం ఆ సంఖ్య 7,000 దాకా ఉండొచ్చని చెబుతున్నాయి. అలాగే లక్షల మంది నిరాశ్రయులయ్యారని అంటున్నాయి. ప్రభుత్వాలు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా అంతర్యుద్ధాల కారణంగా అవి ఫలించడం లేదు.

# ఆమె నిజమైన దేశభక్తురాలు

## : కాష్ పటేల్



**వాషింగ్టన్:**ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ డైరెక్టర్, భారతీయ మూలాలున్న కశ్యప్(కాష్) పటేల్ తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న విమర్శలపై స్పందించారు. తన ప్రేయసితో కలిసి ఎఫ్‌బీఐకి చెందిన జెట్‌లో ప్రయాణించడంపై ఆయన వివరణ ఇచ్చారు.ఈ క్రమంలో రాజకీయ ఆరోపణలనూ ఆయన తోసిపుచ్చారు.కశ్యప్ పటేల్(45) తన గర్ల్‌ఫ్రెండ్ అలెక్సిస్ విల్కిన్స్(26)తో కలిసి ఎఫ్‌బీఐకి చెందిన జెట్ విమానంలో అక్టోబర్ 25వ తేదీన పెన్సిల్వేనియాకు ప్రయాణించారు. అక్కడ ఓ రెజ్లింగ్ ఈవెంట్‌లో ఆమె గాన ప్రదర్శన ఇచ్చారు. ఈ విమాన ప్రయాణానికి అయిన ఖర్చు 60 మిలియన్ డాలర్లపైనే. దీంతో దుమారం రేగింది. ఈ ఘటనపైఎఫ్‌బీఐ మాజీ ఏజెంట్ కైల్ సెరాఫిన్ ఓ పాడ్‌కాస్ట్‌లో మండిపడ్డారు. దేశం షట్‌డౌన్ ఉన్న టైంలో.. ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితిలో.. ఎఫ్‌బీఐ డైరెక్టర్ ఇలా సంస్థ నిధుల్ని దుర్వినియోగం చేయడం ఏంటి? అని నిలదీశారు. దీంతో కాష్ పటేల్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. అయితే..భద్రతా కారణాల దృష్ట్యా ఆయన ఎఫ్‌బీఐకి చెందిన విమానంలో ప్రయాణించారని, పైగా అందుకు అయ్యే ఖర్చులు ఆయనే భరిస్తారని, వ్యక్తిగత ప్రయాణాల్లో విమానం వినియోగం పరిమితంగానే అదీ విధానాలకు అనుగుణంగా ఉంటుందని ఎఫ్‌బీఐ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. మరోవైపు..
ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్ తనపై వచ్చిన విమర్శలకు సోషల్ మీడియా వేదికగా ఘాటుగా స్పందించారు. ఈ ఆరోపణలు అసత్యమైనవని, రాజకీయంగా ప్రేరితమైనవని అన్నారు. నన్ను విమర్శించండి, కానీ నా వ్యక్తిగత జీవితం మీద దాడి చేయడం దారుణం. అలెక్సిస్ నిజమైన దేశభక్తురాలు, నా జీవిత భాగస్వామి. ఆమెపై వచ్చిన ఆరోపణలు అతి నీచమైనవి. ఆమె దేశానికి చేసిన సేవలు చాలా మందికి పదే పదే జీవితాల్లో సాధ్యం కాదు. రాజకీయ వర్గాల్లో మాకు మద్దతు ఆశించాం. కానీ, వాళ్ల మౌనం వల్ల విమర్శలు పెరిగిపోతున్నాయి. నా కుటుంబం మీద ప్రేమే నా బలానికి మూలం. ఎఫ్‌బీఐను పునర్నిర్మించడమే మా లక్ష్యం అని అన్నారాయన.ఎఫ్‌బీఐ అధికార ప్రతినిధి బెన్ విలియమ్సన్.. కాష్ పటేల్ విమాన ప్రయాణంపై జరుగుతున్న ప్రచారాన్ని తోసిపుచ్చారు. అవన్నీ అర్థం లేని కథనాలని కొట్టిపారేశారు. మరోవైపు.. తన విమాన ప్రయాణ వివరాలు లీక్ కావడంపై కాష్ పటేల్ తీవ్ర అసహనంతో ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఎఫ్‌బీఐ సీనియర్ ఉద్యోగి స్టీవెన్ పాల్మర్ (విమాన విభాగం అధిపతి) రాజీనామా చేసినట్లు తెలుస్తోంది.న్యాయనిపుణుడైన కాష్ పటేల్, అమెరికన్ సింగర్ అయిన అలెక్సిస్ విల్కిన్స్‌లు 2023 జనవరి నుంచి డేటింగ్‌లో ఉన్నారు. ఇద్దరి మధ్య వయసు తేడా 19 ఏళ్లు. అలెక్సిస్ విల్కిన్స్‌పై గతంలో ఇజ్రాయెల్ గూఢచారి అనే ప్రచారం జరిగింది. ఎప్‌స్టీన్ ఫైల్స్ విడుదలపై ప్రభావం చూపేందుకు ఆమె ప్రయత్నించిందన్నది ఆ ప్రచార సారాంశం. ఈ ఆరోపణలు చేసిన కైల్ సెరాఫిన్‌పై అలెక్సిస్ 5 మిలియన్ డాలర్ల పరిహారం కోరుతూ పరువు నష్టం దావా వేశారు.

# 'ఫ్యామిలీ బిజినెస్'గా భారత రాజకీయాలు

**శశిథరూర్**




న్యూఢిల్లీ: సీనియర్ కాంగ్రెస్ నాయకుడు , తిరువనంతపురం ఎంపీ శశి థరూర్ భారత రాజకీయలపై కీలక వ వ్యాఖ్యలు చేశారు.'భారత రాజకీయాలు ఒక కుటుంబ వ్యాపారం' అనే వ్యాసంలో వంశపార్యంపర్యంగా వస్తున్న రాజకీయ అధికారం, నాయకత్వ సంస్కృతిపై కొన్ని ప్రశ్నలను లేవనెత్తారు.అంతేకాదు ఈ ధోరణి భారత ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పును కలిగిస్తుందన్నారు. కాంగ్రెస్ నేతగా కాంగ్రెస్ పై స్పష్టమైన విమర్శలు చేయడం చర్చకు దారి తీసింది.దశాబ్దాలుగా, ఒకే కుటుంబం భారత రాజకీయాలపై ఆధిపత్యం చెలాయించింది అంటూ కాంగ్రెస్ వారసత్వం రాజకీయాలపై విమర్శలనెక్కుపెట్టారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటం చరిత్రలో గొప్ప ?ప్రభావం ఉన్నప్పటికీ స్వతంత్ర భారతదేశ తొలి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, ప్రధాన మంత్రులు ఇందిరా గాంధీ .రాజీవ్ గాంధీ, ప్రస్తుత ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ,ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రాలతో సహా నెహ్రూ-గాంధీ వంశానికి జన్మతః హక్కుగా ఉండిపోయింది. క్రమంగా ఈ ఆలోచన ప్రతి పార్టీలోనూ, ప్రతి ప్రాంతంలోనూ, ప్రతి స్థాయిలోనూ భారత రాజకీయాల్లోకి చొచ్చుకుపోయిందంటూ వ్యాఖ్యానించారు.'భారత రాజకీయాలు కుటుంబ వ్యాపారంగా మారాయి, ఇక్కడ నాయకత్వం జన్మతః హక్కుగా పరిగణించ బడుతోంది' అని అభిప్రాయపడిన శశి థరూర్ వంశపారంపర్యంగా సంక్రమించే రాజకీయ అధికారం పాలన , జవాబుదారీతనాన్ని దెబ్బతీస్తుందని వాదించారు. ఎందుకంటే ఈ విధంగా ఎంపికైన నాయకులు తరచుగా ప్రజలు ఎదుర్కొంటున్న నిజమైన సవాళ్ల నుండి డిస్‌కనెక్ట్ చేయబడతారని విమర్శించారు. మమతా బెనర్జీ ,,మాయావతి వంటి ప్రత్యక్ష వారసులు లేని మహిళా రాజకీయ నాయకులు కూడా మేనల్లుళ్లను తమ వారసులుగా ఎంచుకున్నారని ఆయన పేర్కొన్నారు.ప్రాజెక్ట్ సిండికేట్‌లో ప్రచురించిన ఈ వ్యాసంలో శశి థరూర్, భారతీయ రాజకీయ రంగంలో రాజకీయ నాయకత్వం జన్మతః హక్కు అనే ఆలోచన స్థిరపడిపోయిందని, ఇది గ్రామ సభల నుండి పార్లమెంటు అత్యున్నత స్థాయి వరకు భారత పాలనలో ఇదే ధోరణి లోతుగా అల్లుకుపోయిందన్నారు. కానీ రాజకీయ వారసులే పాలనకు సరిపోతారనే విశ్వాంస పాతుకుపోయిందనీ. దీని పాలన నాణ్యత తప్పనిసరిగా దెబ్బతింటుందని థరూర్ రాసుకొచ్చారు.

**ఫెస్టివ్ సీజన్‌లో రికార్డ్ షాపింగ్ రూ.6 లక్షల కోట్లు, ఎందుకో?**

భారతదేశం రాజవంశాన్ని మెరిటోక్రసీగా మార్చుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. దీనికి ప్రాథమిక సంస్కరణలు అవసరం, చట్టబద్ధంగా తప్పనిసరి చేసిన పదవీకాల పరిమితులను విధించడం మొదలు, అర్థవంతమైన అంతర్గత పార్టీ ఎన్నికలు దాకా మెరిట్ ఆధారంగా నాయకులను ఎన్నుకునేలా ఓటర్లకు అవగాహన కల్పించడానికి, అధికారం ఇవ్వడానికి సమిష్టి కృషి కావాలన్నారు. భారత రాజకీయాలు కుటుంబ సంస్థగా ఉన్నంత కాలం, 'ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజలే ఎన్నుకొనే' అనే నిజమైన ప్రజాస్వామ్య కల పూర్తిగా సాకారం కాబోదని ఆయన చెప్పారు.కాగా సీనియర్ కాంగ్రెస్ నేతగా ఆయన ప్రత్యక్షంగా కాంగ్రెస్ పార్టీపైనే తన విమర్శలను ఎక్కుపెట్టడం చర్చకు దారి తీసింది. అయితే కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి గతంలో ఆయన గతంలో పోటీని దృష్టిలో ఉంచుకునే ఈ వ్యాఖ్యలు చేసినట్టు రాజకీయ నిపుణులు భావిస్తున్నారు.

# మోదీవి పసలేని ప్రసంగాలు



ప్రధాని మోదీ పదేపదే ఆరోపిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ వ్యవహారాలపైనే ఎక్కువ దృష్టి సారించినట్లు కనిపిస్తోంది. కాబట్టి.. దీని కోసం నూతనంగా 'అవమానాల శాఖ'ను ఏర్పాటు చేయాలి" అని ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో రాష్ట్రానికి వరాలు ప్రకటించే ముందు.. గత 20 ఏళ్లలో ఎన్డీయే సర్కారు ఏం చేసిందో మోదీ, అమిత్ షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.బిహార్ ప్రభుత్వాన్ని నీతీశ్ కుమార్ నడపడం లేదని.. ప్రధాని, ఇతర వ్యక్తులు ఢిల్లీ నుంచి రిమోట్ కంట్రోల్ ద్వారా నియంత్రిస్తున్నారని ప్రియాంక పేర్కొన్నారు. ప్రజల ఓటు హక్కును లాక్కొనేందుకు చూస్తున్నారని ఆరోపించారు. స్థానికంగా ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతోనే యువత ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వస్తోందన్నారు. ఉపాధి కల్పించే ప్రభుత్వ రంగ సంస్థలను భాజపా సన్నిహిత కార్పొరేట్‌లకు అప్పగించారని ఆరోపించారు. ఇదిలా ఉండగా.. ఛఠ్ పూజ, మహా కుంభమేళాలను ప్రతిపక్ష నేతలు అవమానించారంటూ ప్రధాని మోదీ ఆదివారం ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ప్రియాంక గాంధీ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## సోయా కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు



**పిట్లం నవంబర్ 03 (జనంసాక్షి) :** పిట్లం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి అని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో సోయాబీన్ విక్రయించి మద్దతు ధర పొందాలని అని అన్నారు. సోయాబీన్ పంటకు ప్రభుత్వం క్వింటాలుకు 5328 రూపాయలు చెల్లిస్తుందని రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ ఒంటరి శపథం రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మనోజ్ కుమార్, వైస్ చైర్మన్ డాకూరి వెంకట్ రెడ్డి, మండల అధ్యక్షులు జంబిగే హన్మండ్లు, సొసైటీ డైరెక్టర్ వెంకట్రాంరెడ్డి, సీనియర్ నాయకులు అడ్వకేట్ రామ్ రెడ్డి, మోహన్ రెడ్డి, మోయిన్, ఏఎంసీ కార్యదర్శి శ్రీకాంత్, సహకార సంఘం కార్యదర్శి సంతోష్ రెడ్డి, మరియు సంఘం, సిబ్బంది రైతులు, తదితరులు పాల్గొన్నారు

## దళారులను నమ్మి మోసపోవద్దు ఏఎంసీ చైర్మన్ తిరుపతి



**రుద్రంగి నవంబర్ 3 (జనం సాక్షి) :** రుద్రంగిమండలం మానాల గ్రామంలో సోమవారం మక్కల కొనుగోలు కేంద్రాన్ని రుద్రంగి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతి స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్ర యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి సూచనల మేరకు వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశాలతో మానాలలో నూతనంగా మొక్కల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. వారికి మానాల రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారన్నారు. మక్కలు పండించిన రైతులు అందరూ ఇట్టి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకొని,నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రజా ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర పొందాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు తుం జలపతి, జక్కు మోహన్, వంశీ, లింగారెడ్డి, డైరెక్టర్ రవీందర్ రెడ్డి, డైరెక్టర్ లక్ష్మీనరసయ్య, కీమ, గంగారం, మదన్ లాల్, మోహన్ నాయక్, ఏలేటి చిన్నారెడ్డి, మదన్‌లాల్, రాజు, స్కూల్ తండ రామదాస్, రూపుల, నారాయణ, కిషన్ నాయక్, రాములు, తిరుపతి, మోహన్, బాలు పాల్గొన్నారు.

## కరీంనగర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో" డ్రాయింగ్ పోటీలు

- విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేసిన గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేష్



**కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 03 (జనంసాక్షి):** జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా కరీంనగర్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో లయన్స్ క్లబ్ కరీంనగర్ ఆధ్వర్యంలో డ్రాయింగ్ పోటీలు నిర్వహించబడ్డాయి. ఈ పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్ బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సత్తు మల్లేష్ మాట్లాడుతూ... ఇలాంటి సృజనాత్మక కార్యక్రమాలు విద్యార్థుల్లో జాతీయ ఐక్యత, సామాజిక అవగాహన, దేశభక్తి భావాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తా యని, యువతలో సృజనాత్మకతను ప్రోత్సహించే లయన్స్ క్లబ్ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కరీంనగర్ అధ్యక్షులు లయన్ ముక్క శరత్ కృష్ణ , సెక్రటరీ లయన్ మేడం కృష్ణ కాంత్, ట్రెజరర్ లయన్ బట్టు వినోద్ , ప్రోగ్రామ్ చైర్మన్ లయన్ సింగరాజు, సెక్రటరీ సరిత, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## రాజన్న ఆలయంలో సూచిక బోర్డులు ఎక్కడ..?

- దర్శన సమయంలో భక్తులకు ఇబ్బందులు
- కనిపించని అధికారుల ఫోన్ నంబర్లు



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి నవంబర్ 4 (జనంసాక్షి) :** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో దర్శనానికి వచ్చే భక్తులకు స్వామి వారి దర్శనానికి ఎటు వెళ్లాలో తెలియక పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇందుకు కారణం భక్తులకు సమాచారం తెలియ చేసే సూచిక బోర్డులు లేకపోవడం ప్రధాన కారణం. దర్శనాలు, ఇతర సలహాలు సూచనలు అందించేందుకు అధికారుల ఫోన్ నెంబర్లతో కూడిన సూచిక బోర్లు లేకపోవడంతో భక్తులు ఎవరికీ తమ సమస్యలు ఎవరికీ చెప్పలో తెలియక ఇబ్బందులు పలు ఇబ్బందులు పడుతున్నారు. దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి కార్తీక మాసంలో భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. రాజన్న ఆలయ విస్తరణ అభివృద్ధి పనుల్లో భాగంగా ఇప్పటికే ఆలయ అధికారులు భీమేశ్వరాలయంలో భక్తులకుదర్శనాలు, అభిషేకాలు, కోడె మొక్కులు, సత్యనారాయణ స్వామి వ్రతాలు, కళ్యాణం ఇతర పూజలు ఏర్పాటు చేశారు. శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో కళ్యాణకట్ట, ఈవో కార్యాలయం తదితర భవనాలు కూల్చివేయడంతో పాటు దక్షిణామూర్తి స్వామి ముందు భాగంలో ప్రహరీ కొంతమేర తీసివేశారు. ఆలయంలోని లోపల పైన రేకులు తొలగించి వేశారు. ఆలయ ముందు భాగంలో రావి చెట్టు ఎదుట ప్రచార రథం ఏర్పాటు చేసి భక్తలకు దర్శనం కల్పిస్తున్నారు. రాజన్న రాజన్న ఆలయంలో భక్తులకు లఘు దర్శనం కల్పిస్తున్నారు. ధర్మ గుండం వైపు ఎవరు వెళ్లకుండా రావిచెట్టు ప్రక్కన బార్కెట్లు ఏర్పాటు చేయడంతో పాటు గ్రిల్స్కు తాళాలు వేశారు.

**కనిపించని సూచిక బోర్డులు..**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు దర్శనం కోసం తరలివస్తుంటారు. . ఆలయ విస్తరణ అభివృద్ధిలో భాగంగా దర్శనానికి ఆలయ అధికారులు భక్తుల కోసం అక్కడి పనుల ఆధారంగా మార్పులు చేర్పులు చేస్తున్నారు. అయితే దర్శనానికి వెళ్లే మార్గాలపై ఎలాంటి సూచిక బోర్డులు లేకపోవడంతో దర్శనానికి వెళ్లే సమయంలో భక్తులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే లఘు దర్శనం ఇతర సమస్యలు, ఇబ్బందులపై అధికారులకు ఎలాంటి సలహాలు సూచనలు ఫిర్యాదు చేయాలన్న సంభందిత ఆలయ అధికారుల ఫోన్ నెంబర్లతో కూడిన బోర్డులు ఎక్కడ కనబడడం లేదు. ఆలయ అధికారులు స్పందించి భక్తులకు దారులు తెలిపే సూచిక బోర్డులతో పాటు అధికారుల ఫోన్ నెంబర్‌తో కూడిన బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని పలువురు భక్తులు కోరుతున్నారు.



## మంత్రి వాకిటి శ్రీహరి చేతుల మీదుగా సగర సంఘం ప్రతిభా పురస్కారాలు అందజేత

**వీణవంక నవంబర్ 3 (జనం సాక్షి) :** వీణవంక తెలంగాణ రాష్ట్ర సగర సంఘం ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్ లోని రవీంద్ర భారతి లో నిర్వహించిన ప్రతిభా పురస్కారాల అవార్డు బహుమతుల ప్రధాన ఉత్సవం నిర్వహించారు.వీణవంక మండలంలోని శ్రీరాములపేట గ్రామానికి చెందిన పొట్ల శ్రీ వెన్నెల దాన్సు విభాగంలో ప్రతిభ కనబర్చింది.కాగా ఆ చిన్నారి ప్రత్యేక బహుమతికి ఎంపిక కాగా రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి ఆమెకు మెడల్‌తో పాటు సర్టిఫికెట్,షీల్డు, నగదు బహుమతి అందజేశారు. కరీంనగర్ జిల్లాకు చెందిన పలువురికి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్,బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ బహుమతులు ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సగర సంఘం గౌరవ అధ్యక్షుడు ముత్యాల హరికిషన్ సగర,రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఉప్పరి శేఖర సగర, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెదబుద్దుల సతీష్ సగర,ప్రధాన కార్యదర్శి గౌరక్క సత్యం సగర,కోశాధికారి వడ్లకొండ కుమారస్వామి సగర,రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు గాండ్ల స్రవంతి సగర,జిల్లా సగర సంఘం అధ్యక్షుడు దేవునూరి శ్రీనివాసు సగర,జిల్లా ప్రధాన కార్యదర్శి కట్టరాజు సగర, నాయకులు మార్క సురేష్,ఉప్పరి మహేందర్ సగర,శ్రీ సాయి గణేష్ సగర,కానిగంటి శ్రీనివాస్ సగర తోపాటు కుల బంధువులు తదితరులు పాల్గొన్నారు.

## అర్బన్ బ్యాంకు చైర్మన్‌గా రెండవ సారి పదవి బాధ్యతలు చేపట్టిన కర్ర రాజశేఖర్



**కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 03 (జనంసాక్షి):** ఖాతదారులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు బ్యాంకు అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తానని అర్బన్ బ్యాంకు చైర్మన్ కర్ర రాజశేఖర్ అన్నారు. అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో విజయం సాధించి చైర్మన్ గా ఎన్నికైన సందర్భంగా సోమవారం బ్యాంకులో పదవి భాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ... బ్యాంకు డిపాజిట్లు 200 కోట్లకు పెంచడంతో పాటు ఖాతదారులకు వడ్డీ అందిస్తామని అన్నారు. తమ హయాంలో 60 కోట్ల డిపాజిట్లు సేకరిస్తే గడిచిన ఎనిమిదిన్నర ఏళ్లల్లో 20 కోట్లు కూడా సేకరించలేదన్నారు. రుణాల శాతం పెంచడంతో పాటు రికవరీలోను ముందుంటామన్నారు. బ్యాంకు లాభాల్లో నడుస్తున్న దృష్ట్యా ఉద్యోగుల జీతాభత్యాలు పెంచే విషయం ఉన్నతాధికారులతో చర్చిస్తామన్నారు. ఈ సందర్భంగా కర్ర రాజశేఖర్ ను పలు సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సమావేశం లో మాజీ బ్యాంకు చైర్మన్ బొమ్మరాతి రాజేశం, డైరెక్టర్లు దేశ వేదాద్రి, బాసెట్టి కిషన్, బొమ్మరాతి సాయిక్రిష్ణ, వరాల జ్యోతి, బండి దీపక్ ప్రశాంత్, ఆనందం, శిల్ప, అనరాసు కుమార్, మాజీ కార్పోరేటర్ నర్మద నర్సయ్య, ఆనందం తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలపై ప్రజావాణిలో ఫిర్యాదు

- మల్కాజిగిరి టౌన్ ప్లానింగ్ అధికారులపై మండిపడ్డ జయరాజ్
- లంచం ఇవ్వలేదని తన దరఖాస్తును యుఎల్‌సికి పంపారు
- టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుపై డిసికి ఫిర్యాదు



**మల్కాజిగిరి, నవంబర్ 3 (జనం సాక్షి) :**

మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోలోని ఆరు డివిజన్ లలో అనుమతులు లేకుండా జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై వివిధ వార్తా దినపత్రికలలో వచ్చిన వార్తలను సేకరించి స్థానిక వ్యక్తి ఒకరు సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు, సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారి బాల శ్రీనివాస్, సెక్షన్ అధికారి సంగీత లపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ సందర్భంగా జైరాజ్ మాట్లాడుతూ, తాను ఐదు నెలల క్రితం ఏడు లక్షల రూపాయల చలానా చెల్లించి ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్నానని, దానికి ప్రొసీడింగ్ ఇవ్వడానికి సెక్షన్ అధికారి సంగీత అసిస్టెంట్ రవి 40000 లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు, తన దగ్గర అంత డబ్బు లేదని చెప్పడంతో తన దరఖాస్తును వివిధ కారణాల రూపంలో యూఎల్సీ కార్యాలయానికి పంపారని తెలిపారు. సర్కిల్ పరిధిలోని ఆరు డివిజన్లలో ఎలాంటి అనుమతులు లేకుండా షెడ్డు నిర్మాణాలు, పాత బిల్డింగులపై అదనపు ఫ్లోర్ల నిర్మాణాలు, సెల్లార్లు, రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని కమర్షియల్ బిల్డింగ్ నిర్మాణాలు యథేచ్ఛగా జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు.న్యాయబద్ధంగా ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వానికి చలానా కట్టి దరఖాస్తు చేసుకున్న వారిని ముప్పులు తిప్పలు పెడుతున్నారని మండిపడ్డారు. టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమనిర్మాణదారులతో అంతర్గత ఒప్పందాలు కుదుర్చుకొని ప్రభుత్వానికి రావాల్సిన కోట్ల రూపాయల ఆదాయాన్ని జేబులో వేసుకుంటున్నారని జైరాజ్ ఆరోపించారు. వీరు జారీ చేసిన ఇంటి నిర్మాణ అనుమతులను ఉన్నతాధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని,అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా ప్రభుత్వానికి నష్టం కనిపిస్తున్నారని,సర్కిల్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను ప్రత్యక్షంగా చూసి వారిపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్ ను కోరినట్లు తెలిపారు.

## బాల్య వివాహాలను నిరోధించడం ప్రతి ఒక్కరి బాధ్యత

### జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే స్వప్న రాణి

**పెద్దపల్లి,నవంబర్ 03(జనంసాక్షి) :** బాల్య వివాహాలను నిరోధించడం ప్రతి ఒక్కరి బాధ్యత తీసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే స్వప్న రాణి తెలిపారు.జిల్లా కేంద్రంలో మహిళా సాధికారత కేంద్రం అద్వర్యంలో సోమవారం అయ్యప్పగుడి చౌరస్తాలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే స్వప్న రాణి విద్యార్థులతో కలిసి మానవహారం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే స్వప్న రాణి మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం, ప్రోత్సహించడం చట్టరీత్య నేరమని ,బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు.బాల్య వివాహ నిషేధ చట్టం 2006 గురించి వివరిస్తూ ఆడపిల్ల వయస్సు 18 సంవత్సరాలు నిండక ముందే పెళ్ళి చేసుకున్నట్లయితే వాటి వల్ల కలిగే మానసిక శారీరక ఆర్థిక అనర్థాలు వివరించారు.ఒక ఆడపిల్ల పుట్టడం బ్రతకడం ఎదగడం చదవడం దాని యొక్క నినాదాన్ని పిల్లల చేత ప్రతిజ్ఞ చేయించారు.హెల్ప్ లైన్ నంబర్స్ గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ సుచరిత, అకౌంటెంట్ సమత, సఖి సిఏ స్వప్న, ఐసిపిఎస్ (పివోఎన్ఐ) కనకరాజు మరియు సిబ్బంది,నశా ముక్త్ భారత్ కమ్యూనిటీ ఎడ్యుకేటర్ శ్యామల,పోలీస్ సిబ్బంది మరియు మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## “ప్రపంచ కప్ గెలిచిన భారత క్రికెట్ జట్టుకు” అభినందనలు తెలిపిన అల్ఫోర్స్

- అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి




**కరీంనగర్, నవంబర్ 03 (జనంసాక్షి) :**


మహిళా క్రికెట్ చరిత్రలో నూతన అధ్యయనానికి నాంది పలకడమే కాకుండా చరిత్ర పుటల్లో నిలిచిపోయే విధంగా చారిత్రాత్మక విజయాన్ని అందించిన భారత మహిళా క్రికెట్ జట్టుకు శుభాకాంక్షలు తెలిపారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో భారత మహిళా క్రికెట్ జట్టు ప్రపంచ కప్ గెలుచుకున్న సందర్భంగా ఏర్పాటు చేసినటువంటి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మహిళా క్రికెట్ జట్టు సమిష్టిగా రాణిస్తూ ఎన్నో విజయాలను సొంతం చేసుకుంటున్నాయని చాలా చక్కటి సమన్వయంతో కోచ్ అమోల్ ముజుందార్ మార్గదర్శకమున మ్యాచ్లను గెలవడం చాలా హర్షించదగ్గ విషయమని, మహిళా క్రికెట్ జట్టు అన్ని రంగాలలో చాలా గొప్పగా రాణించడమే కాకుండా టైటిల్ గెలవడమే లక్ష్యంగా కృషి చేసినదని, పలు రికార్డులను తిరగ రాయడం చాలా గొప్ప విషయమని వారు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ముంబైలో దక్షిణాఫ్రికా తో జరిగినటువంటి ఫైనల్ మ్యాచ్ లో ఓవరాల్ టీం గా అద్భుత ప్రదర్శన కనబరిచి విశ్వ విజేతగా నిలవడం చాలా గొప్ప విషయమని వారు చెప్పారు. హర్మన్ ప్రిత్ కౌర్ సారధ్యంలో భారత మహిళా జట్టు అపూర్వ విజయాలు సాధించడం దేశానికే గర్వకారణమని ముఖ్యంగా సొంత గడ్డపై సొంత ప్రేక్షకుల మధ్య ఒత్తిడిని ఎదుర్కొని ఆల్ రౌండ్ షో తో రాణించి సగర్వంగా టైటిల్ ని గెలుచుకున్నదని తెలిపారు. జయధ్వనుల మధ్య విజేతగా నిలిచిన భారత జట్టుకు ప్రపంచంలోనే పలు దేశాల నుండి అభినందనలు వెలబడుతున్నాయని అన్నారు. ఈ విజయం భారతావని పండుగగా చేసుకున్నదని ప్రధానితో సహా ప్రముఖులందరూ భారత మహిళా క్రికెట్ జట్టుకు శుభాకాంక్షలు తెలుపడం వారికి గొప్ప ఉత్సాహం ఇస్తుందని గుర్తు చేశారు. ప్రపంచ కప్ టైటిల్ ని గెలుచుకున్న సందర్భంగా స్వీట్లను పంచి ఆనందాన్ని రెట్టింపు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులందరూ జయహో భారత్ జయహో అనే నినాదాలతో ప్రాంగణాన్ని హోరెత్తించారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏఐ ల్యాబ్ ద్వారా పిల్లల విద్యా ప్రమాణాలు పెంపొందించాలి

### పెద్దపల్లి జిల్లాలో విద్యా, ఉపాధి, ఉజ్వల యోజనలకు కలెక్టర్ ప్రాధాన్యం





- జిల్లాలోని ప్రతి విద్యా సంస్థకు గ్యాస్ కనెక్షన్ అందించాలి
- 4న భారత వాయుసేనలో చేరేందుకు అవగాహన సదస్సు
- టాస్క్ సెంటర్ ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి, నవంబర్ 3 (జనం సాక్షి) :**

జిల్లాలోని ప్రతి ప్రభుత్వ విద్యా సంస్థకు ప్రధాన మంత్రి ఉజ్వల యోజన కింద నూతన గ్యాస్ కనెక్షన్లు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఉజ్వల యోజనపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్, పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసి పేదలందరికీ గ్యాస్ కనెక్షన్లు అందేలా చూడాలని సూచించారు. ప్రతి సిలిండర్ కొనుగోలుపై రూ.300 సబ్సిడీ బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఇటీవల 23 వేల కొత్త రేషన్ కార్డులు జారీ అయిన నేపథ్యంలో, గ్యాస్ కనెక్షన్ లేని వారికి పథకం ద్వారా కనెక్షన్లు కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ల వారీగా దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా తక్షణమే పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రతి మండలం, మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, విద్యా సంస్థల్లో గ్యాస్ కనెక్షన్ లేని వాటిని గుర్తించి, స్థానిక ఏజెన్సీల ద్వారా నూతన కనెక్షన్లు అందించేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని పేర్కొన్నారు. విద్యా సంస్థలకు అవసరమైన నిధులను కలెక్టరేట్ నుంచి పూర్తిస్థాయిలో చెల్లిస్తామని హామీ ఇచ్చారు. మధ్యాహ్న భోజన పథకం కింద స్కూల్ పేరిట అవసరమైన గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేయాలని సూచించారు. నవంబర్ 25 నాటికి జిల్లాలో ఏ విద్యా సంస్థలోనూ కట్టెల పొయ్యిపై వంట జరగకుండా, గ్యాస్ కనెక్షన్లతో పాటు పెద్ద స్టవ్‌లు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, సి సెక్షన్ సూపరింటెండెంట్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. అదే రోజు భారత వాయుసేనలో చేరేందుకు నవంబర్ 4న మంగళవారం బంధంపల్లి స్వరూప గార్డెన్స్‌లో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో లివింగ్ కమాండర్ షేక్ యాకూబ్ అలీ (కమాండింగ్ ఆఫీసర్, ఆంధ్ర, తెలంగాణ రిక్రూట్‌మెంట్) పాల్గొని, వాయుసేనలో అవకాశాలు, పరీక్షా విధానం, సిలబస్, సెలక్షన్ ప్రక్రియపై యువతకు వివరిస్తారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే ఈ సదస్సును సువర్ణావకాశంగా అభివర్ణించిన కలెక్టర్, పెద్దపల్లి నుంచి అత్యధిక యువత వాయుసేనలో చేరాలని కోరారు. 16 నుంచి 21 ఏళ్ల వయసు గల ఇంటర్మీడియట్ చదువుతున్న లేదా పూర్తి చేసిన పురుష, మహిళా అభ్యర్థులు పాల్గొనవచ్చని తెలిపారు. వాయుసేన అవకాశాలపై బుక్‌లెట్ పంపిణీ చేస్తామని, మరిన్ని వివరాలకు 9949725997, 8333044460 నంబర్లకు సంప్రదించాలని సూచించారు. అదే రోజు పెద్దపల్లి మండలం రంగాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏఐ కంప్యూటర్ ల్యాబ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, ఏఐ సాంకేతికత ద్వారా 3 నుంచి 5వ తరగతి సీ గ్రేడ్ విద్యార్థులకు ఆంగ్లం, తెలుగు, గణితం సులభంగా నేర్పించాలని ఆదేశించారు. ఏఐ టూల్స్ వినియోగంతో పిల్లల్లో వచ్చిన మెరుగుదలను పరిశీలించారు. ఈ తనిఖీలో టీచర్ స్నేహ తదితరులు పాల్గొన్నారు. మరోవైపు పెద్దపల్లి రీజినల్ టాస్క్ సెంటర్‌లో శిక్షణ పూర్తి చేసిన యువతకు ప్రైవేటు కంపెనీల్లో మంచి ప్యాకేజీలతో ఉద్యోగాలు లభిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. డిగ్రీ ఉత్తీర్ణులకు ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు అందిస్తున్న ఈ సెంటర్‌ను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టెలి పెర్ఫార్మెన్స్ కంపెనీలో ఉద్యోగాలు సాధించిన గుర్రాల సింధుజ, పెర్క సాయి సింధు, మినీష ఓడనాలాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి అధికారి రాజశేఖర్, టాస్క్ సెంటర్ ఇంచార్జి కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

## నా కొడుకుకు ప్రాణభిక్ష పెట్టండి

### ఆర్థిక సహాయం కోసం తల్లి ఎదురుచూపులు



**ముస్తాబాద్ నవంబర్ 3 (జనం సాక్షి) :**

ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన గడప మాధవి బాలకృష్ణ దంపతులకు ఒక కొడుకు ఒక కూతురు కలరు. కొడుకు విగ్నేష్, మహర్షి స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నాడు. విగ్నేష్ కు రెండవసారి లివర్ ఆపరేషన్ ముస్తాబాద్ లోని పీపుల్స్ ఆసుపత్రిలో బుధవారం రాత్రి జరగనుంది. ఈ కుటుంబం వద్ద డబ్బులు లేకపోవడంతో ఆర్థిక సహాయం కోసం తల్లి మాధవి దాతలను కోరుతుంది. ఈ దంపతులకు తల్లి, తండ్రి లేరు. బాలకృష్ణ దంపతులు నిరుపేద కుటుంబానికి చెందినవారు. ఐడియా కంపెనీలో సిమ్స్ సేల్స్ చేస్తూ భార్య పిల్లలను పోషించుకుంటున్నాడు. రెక్కాడితే డొక్కాడని కుటుంబం వీరిది. ఉండడానికి ఇల్లు కూడా లేదు. ఈ క్రమంలో కొడుకు విగ్నేష్‌కు 3 సంవత్సరాల వయసులో లివర్ వ్యాధి సోకింది. అప్పుడు వైద్యం కోసం, లివర్ సర్జరీ కోసం దాదాపు 8 లక్షల వరకు అప్పులు చేసి సర్జరీ చేయించారు. మళ్ళీ కొన్ని నెలల నుండి విగ్నేష్ అనారోగ్యానికి గురికాగా మళ్లీ వైద్యులు లివర్ ఆపరేషన్ చేయాలని సూచించారు. ఆపరేషన్ కు 3 లక్షల పైన ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. అప్పుడు జరిగిన సర్జరీకి తెచ్చిన అప్పులే ఇంకా 5 లక్షలు ఉందని మాధవి రోదిస్తూ తెలిపింది. విగ్నేష్ అనారోగ్యానికి గురికాక ముందు ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతో అప్పులు చేసి ఇల్లు కట్టుకోవడం జరిగింది.

బ్రతకడానికి కష్టంగా ఉండగా సొంత ఇంటి కల నిజమైందని సెల్ఫోన్ సిమ్ములు అమ్ముతూ హోమ్ లోన్ ఈఎంఐ లు కట్టుకుంటున్నారు. ఈ క్రమంలో విగ్నేష్ కు మళ్ళీ లివర్ వ్యాధి సోకడంతో వైద్య ఖర్చు లేక ఈ దంపతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ కొడుకు ఆపరేషన్ కోసం ఆర్థిక సహాయం అందించాలని దాతలను ఈ దంపతులు వేడుకుంటున్నారు. మాధవి సెల్ ఫోన్ పే 9133934308 నెంబర్‌కు నేరుగా దాతలు సహాయం అందించాలని కోరుతున్నారు.

# విజిలెన్స్ మా భాగస్వామ్య బాధ్యత

- ఎన్ఎండిసి విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్
- ఉమ్మడి బాధ్యతగా సమగ్రతను పెంపొందించడం లక్ష్యం

**హైదరాబాద్, నవంబర్ 3 (జనంసాక్షి) :** భారతదేశంలో అతిపెద్ద ఇనుప ఖనిజ ఉత్పత్తిదారు అయిన ఎన్ఎండిసి, హైదరాబాద్‌లోని తన కార్పొరేట్ కార్యాలయంలో ఒక ఉత్సాహభరితమైన ముగింపు వేడుకతో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ 2025ను విజయవంతంగా ముగించింది. ఈ సంవత్సరం థీమ్, "విజిలెన్స్.. మా భాగస్వామ్య బాధ్యత, వారం రోజుల పాటు జరిగిన వేడుక అంతటా ప్రతిధ్వనించింది. పారదర్శకత, జవాబుదారీతనం, నైతిక శ్రేష్ఠతకు సమిష్టి నిబద్ధతను ప్రేరేపించింది. ఆగస్టులో ప్రారంభమైన మూడు నెలల అవగాహనా ప్రచారాన్ని ఘనంగా ప్రారంభించింది. ఈ సంవత్సరం ప్రచారం కింద ప్రవేశపెట్టబడిన కీలకమైన అంశం ఐజీఓటీ మాడ్యూల్, దీని ద్వారా ఎన్ఎండిసి అధికారులు విజిలెన్స్ పరిపాలన వివిధ అంశాలపై ఆన్‌లైన్ శిక్షణ పొందుతున్నారు. శనివారం జరిగిన ముగింపు కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సబ్ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండిరగ్ మేజర్ జనరల్ అజయ్ మిశ్రా ముఖ్య ప్రసంగం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎండిసి సీనియర్ నాయకత్వం, డైరెక్టర్ (టెక్నికల్) వినయ్ కుమార్, జయదీప్ దాస్‌గుప్తా డైరెక్టర్ (ప్రొడక్షన్), ప్రియదర్శిని డైరెక్టర్ (పర్సనల్), చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ సి నీలకంఠ రెడ్డి, ఎన్ఎండిసి ఉద్యోగులు పాల్గొన్నారు.




వినయ్ కుమార్ మాట్లాడుతూ.. ఎన్ఎండిసిలోని విజిలెన్స్ విభాగం కేవలం ఒక వాచ్‌డాగ్ మాత్రమే కాదు, ఇది మార్పుకు ఉత్ప్రేరకం అన్నారు. వ్యవస్థలు బలంగా ఉన్నప్పుడు, నిర్ణయాలు లక్ష్యం అవుతాయి. అది సమగ్రతకు నిజమైన ప్రతిబింబమని స్పష్టం చేశారు. చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ సి నీలకంఠ రెడ్డి మాట్లాడుతూ.. మా చొరవల ద్వారా, హైదరాబాద్, బైలాడిలా, జగదల్‌పూర్, నాగర్నార్, పన్నా, దోనిమలై అంతటా పాఠశాలలు, సమాజాలను చేరుకున్నామని, వేలాది మంది యువ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామన్నారు. ఎన్ఎండిసి ఉద్యోగులు, వాటాదారులు క్విజ్‌లు, డ్రాయింగ్, వ్యాసం, వక్తృత్వ పోటీలు వంటి పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ముగింపు వేడుకలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి






**నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య**

**ఆర్మూర్ నవంబర్ 3 (జనంసాక్షి):** యువత ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, తరిమి కొట్టడంలో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా మండల స్థాయి క్రీడల ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతి భద్రతలను కాపాడడంలో అమరవీరులైన పోలీసులకు యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండటమే పెద్ద కానుకగా భావిస్తామన్నారు. ఈ సంవత్సరం శాంతి భద్రతలను కాపాడుతూ 191 మంది పోలీసులు తమ ప్రాణాలను త్యాగం చేశారని గుర్తు చేశారు. దేశంతో యుద్ధం చేయలేక పాకిస్తాన్ తప్పుదోవలో డ్రగ్స్, సైబర్ క్రైమ్ ద్వారా ఇండియాను దెబ్బతీయాలని ప్రయత్నిస్తుందన్నారు. మన దేశాన్ని బలోపేతం దిశగా ప్రతి ఒక్కరు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని చెప్పారు. అనంతరం జర్నలిస్టులు, పోలీస్ క్రికెట్ జట్ల క్రీడాకారులకు మెడల్స్‌తో పాటు షీల్డ్‌ను అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏసిపి వెంకటేశ్వర్ రెడ్డి, సీఐ సత్యనారాయణ గౌడ్, ఎస్సై రమేష్, ఎంఈఓ లు రాజ గంగారాం, నరేందర్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు లక్ష్మీ నర్సయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఫలితాలు సాధనకు కృషి చేయాలి

**ఇంటర్ నోడల్ అధికారిని కల్పన**



**మంథని, (జనంసాక్షి) :** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధనకు అధ్యాపకులు, విద్యార్థులు సమిష్టిగా కృషి చేయాలని పెద్దపెల్లి జిల్లా నోడల్ అధికారిని కల్పన సూచించారు. సోమవారం పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని బాలుర,బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఫలితాలపై చర్చించారు. త్వరగా సిలబస్ పూర్తి చేసి రివిజన్ కు ఎక్కువ సమయం కేటాయించాలన్నారు. వార్షిక పరీక్షల టైం టేబుల్ విడుదలైన నేపథ్యంలో పరీక్షల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులకు ముఖ గుర్తింపు ద్వారా హాజరు శాతాన్ని పరిశీలించడం జరుగుతుందన్నారు .కళాశాలకు హాజరు కాకపోతే పరీక్ష ఫీజు చెల్లింపు సమయంలో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి పరీక్షల్లో విజయం సాధించేలా అధ్యాపకులు కృషి చేయాలన్నారు. విద్యార్థులకు ఈ సమయం ఎంతో కీలకంగా ఉంటుందని, సద్వినియోగం చేసుకుంటే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. కళాశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించిన అనంతరం రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ సలీం, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఫీజు బకాయిలు ఎక్కడ పోయాయ్?

- విజిలెన్స్ బెదిరింపులతో ప్రభుత్వం బ్లాక్‌మెల్ : ఏఐఎస్ఎఫ్

**బోడుప్పల్-జనంసాక్షి :** పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్ షిప్ బకాయిలను విడుదల చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం చెవికెక్కించుకోవడంలేదని ఏఐఎస్ఎఫ్ నేతలు ఆరోపించారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఉప్పల్ డిపో వద్ద సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో విద్యార్థి నాయకులు ప్రభుత్వంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు.

జిల్లా కార్యదర్శి ఎండీ. అన్వర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో సుమారు 8 వేల కోట్ల రూపాయల బకాయిలు పెండింగ్‌లో ఉన్నప్పటికీ ప్రభుత్వం వాటి విడుదలను ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తోందని ఆరోపించారు. యాజమాన్యాలు బకాయిలు ఇవ్వమంటే విజిలెన్స్ దాడులు చేస్తున్నట్టు చూపించడం దారుణమని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో నెలకు రూ.500 కోట్లు విడుదల చేస్తామని హామీ ఇచ్చినా ఇప్పటి వరకు రూ.300 కోట్లు మాత్రమే చెల్లించారని, దసరా%-%దీపావళి నాటికి మొత్తంగా రూ.1200 కోట్లు జారీ చేస్తామన్న వాగ్దానాన్ని కూడా నిలబెట్టుకోలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజు బకాయిలు ఇవ్వక విద్యార్థులు




సర్టిఫికెట్ల కోసం ఇబ్బంది పడుతుండగా, కళాశాలలు సిబ్బందికి జీతాలు చెల్లించలేక ఇరుక్కుపోయాయని అన్నారు. ప్రభుత్వం తక్షణమే బకాయిలను విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టి మంత్రులు, ఎమ్మెల్యేలను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు హరీష్, నాయకులు అరవింద్, సందీప్, వికారం, సాయి, శ్రీకాంత్, వంశీ, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డెక్కిన రైతులు

**మద్దతు తెలిపిన బిజెపి, బిఆర్ఎస్ నాయకులు**

**ముస్తాబాద్ నవంబర్ 3 (జనం సాక్షి) :** ముస్తాబాద్ మండలం లోని ఆవునూర్ గ్రామము లో సోమవారం రోజున వారి ధాన్యం కొనుగోలు కొరకు రైతులు రాస్తారోకో నిర్వహించారు ఈ కార్యక్రమానికి బిజెపి నాయకులు మరియు బిఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐకెపి సెంటర్ లో ఇప్పటికే రెండు లారీలు నిండి ఉండగా ఏ రైస్ మిల్ కూడా ధాన్యం దించుకోకపోవడం, అలర్ట్మెంట్ లేదు అని సమాధానం ఇవ్వడం ప్రభుత్వం సిగ్గు చేటు, సంబంధిత ఇప్పటికైనా అధికారులు ఎమ్ చేస్తున్నట్టు ఒకవైపు అకాల వర్షాల వల్ల రైతులు ఐకెపి సెంటర్ లలో హరిగోసలు పడుతుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదు ప్రభుత్వం దిగివచ్చి ధాన్యం సేకరించే వరకు రైతులు రాస్తారోకోలు చేస్తాం అన్నారు రైతులకు మద్దతుగా భారతీయ జనతాపార్టీ రైతులతో పాటు కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు పొన్నాల సత్యం రెడ్డి, మండల కార్యదర్శి నర్ర ప్రశాంత్ రెడ్డి,బూత్ అధ్యక్షులు మహేష్, గణేష్, శ్రీకాంత్, రాజు,బిఆర్ఎస్ పార్టీ కి చెందిన నక్కాదాసరి రవి,బాల్ రెడ్డి,సతీష్, రైతులు ధర్నాలో పాల్గొన్నారు.

# చేవెళ్ల రోడ్డు ప్రమాదానికి గత బిఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలి

- చనిపోయిన వారి కుటుంబానికి 25 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియా ప్రకటించాలి
- సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

**చేవెళ్ల, నవంబర్ 03 (జనంసాక్షి) :** చేవెళ్ల మండల పరిధిలోని మిర్జాగూడ గేటు వద్ద జరిగిన ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి విచారం వ్యక్తం చేస్తూ బాధితులను పరామర్శించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఈ ప్రాంత మాజీ మంత్రులు, ఎంపీలు నిర్లక్ష్యం కారణంగా అప్పా జంక్షన్ నుండి మన్నెగూడ వరకు రోడ్డు విస్తరణ పనులు జరగలేదని అన్నారు. 2018లో గ్రీన్ ట్రిబ్యునల్ లో కేసు వేస్తే అంతకన్నా ముందు ఈ ప్రాంతం నుంచి మంత్రిగా బాధ్యతలు వహించిన సబితా ఇంద్రారెడ్డి తీవ్ర నిర్లక్ష్యం వల్ల రోడ్డు విస్తరణ పనులు జరగలేదని అన్నారు. హైదరాబాద్ చుట్టూ ఉన్నటువంటి జాతీయ



రహదారులన్నీ విస్తరణ జరిగాయని హైదరాబాద్ కు ఆనుకొని ఉన్న బీజాపూర్ జాతీయ రహదారి మాత్రమే విస్తరణ జరగలేదని అన్నారు. ప్రస్తుతం బిజెపి ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి బీజాపూర్ జాతీయ రహదారి పనులకు 2017 లోనే అనుమతి తీసుకువచ్చానని చెప్పారని ఎందుకు రోడ్డు విస్తరణ పనులు ఆగిపోయాయని ప్రశ్నించారు. ఇప్పుడు కేంద్రంలో ఉన్నది బీజేపీ ప్రభుత్వమే అని ఎన్జీటిలో కేస్ వికెట్ చేయించి రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం చేసే బాధ్యత ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి పైన ఉందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించాలని అన్నారు. ప్రమాదంలో చనిపోయిన మృతుల కుటుంబాలకు 25 లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని ఆర్టీసీ టిప్పర్ యాజమాన్యంతో నష్టపరిహారం వచ్చే విధంగా ప్రభుత్వం చూడాలని అన్నారు. ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన పిల్లల సంరక్షణ బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులను పరామర్శించిన వారిలో సిపిఎం రాష్ట్ర నాయకులు డీజి.నరసింహారావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాడిగళ్ల భాస్కర్ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్, ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ప్రభాకర్, పిడిఎస్యు ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కానాపురం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేత

- పెండింగ్ -ఫీజు రీయింబర్స్ మెంట్స్ -స్కాలర్ షిప్స్ వెంటనే విడుదల చేయాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్



వేములవాడ, నవంబర్ 3 (జనంసాక్షి):భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రోజున వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు పెండింగ్ స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని వినతి పత్రం అందజేసారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం విద్యార్థులకు ఇవ్వవలసిన ఫీజురీయంబర్స్ మెంట్స్ , స్కాలర్ షిప్స్ గత ఆరేళ్ల నుండి ప్రభుత్వం చెల్లించడం లేదన్నారు. 2023-2024 - విద్యాసంవత్సరం 2100కోట్లు,2024 -2025 విద్యాసంవత్సరం -2100 కోట్లు ,2025-2026 -విద్యాసంవత్సరం 2200 కోట్లు మొత్తం 6,300 కోట్లు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన దగ్గర నుండి విద్యార్థులకు ఇవ్వాలసిన ఫీజులు, అలాగే గత ప్రభుత్వం హయంలో 4100 కోట్లు బకాయిలు ఉన్నాయనీ మొత్తం 10,500 కోట్లు బకాయిలు ఉన్నాయి అన్నారు. వీటిలో దసరా కంటే ముందు ప్రభుత్వం యాజమాన్యాలు సమ్మె సందర్భంగా చర్చలు జరిపి దసరాకు -300 కోట్లు, దీపావళి -900 కోట్లు నవంబర్ నెలలో -300 మొత్తం 1200 కోట్లు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. వాటిలో 300కోట్లు చెల్లించారు. మిగతా బకాయిలు చెల్లించలేదనీ ఫలితంగా విద్యార్థులే ఫీజులు చెల్లించుకుంటున్నారు.ప్రభుత్వ కళాశాలలో, హస్టల్స్ ఫీజులను కూడా వారే చెల్లిస్తున్నారనీ, ఇంకోప్రక్క ప్రైవేటు యాజమాన్యాలు కూడా వారి ఇబ్బందులు రీత్యా సమ్మెలోకి వెళ్ళాలనీ మీరు ప్రభుత్వంతో చర్చించి ఫీజులను విడుదల చేయించేలాగా చర్యలు తీసుకోవాలని కోరడం జరిగిందని అన్నారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే పెండింగ్ బకాయిల విడుదల కోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు కడారి శివ, నాయకులు భరత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# లక్నో సూపర్ జెయింట్స్‌కు టామ్ మూడీ

- విలియమ్సన్ తర్వాత ఆస్ట్రేలియా వెటరన్‌కు పెద్ద బాధ్యత
- సూపర్ జెయింట్స్ గ్రూప్‌ను బలోపేతం చేస్తూ లక్నో యాజమాన్యం



లక్నో, నవంబర్ 3: ఐపీఎల్ ఫ్రాంచైజీల్లో దిగ్గజాలను పట్టేస్తున్న లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ) మరోసారి కీలక నిర్ణయం తీసుకుంది. ఇటీవల కేన్ విలియమ్సన్‌ను వ్యూహాత్మక సలహాదారుగా నియమించిన యాజమాన్యం, ఇప్పుడు ఆస్ట్రేలియా క్రికెట్ దిగ్గజం టామ్ మూడీని 'గ్లోబల్ డైరెక్టర్ ఆఫ్ క్రికెట్'గా అప్పాయింట్ చేయనుంది. ఆర్‌పీ-సంజీవ్ గోయెంకా గ్రూప్ (ఆర్‌పీఎస్‌జీ) సొంతం ఈ ఫ్రాంచైజీ అధికారిక ప్రకటన చేస్తుందని సమాచారం. 60 ఏళ్ల వయస్సులోనూ ఫ్రాంచైజీ క్రికెట్‌లో అనుభవాలతో మూడీ, లక్నోతో పాటు సిస్టర్ ఫ్రాంచైజీలైన ఎస్ఏ20లోని దుర్బన్ సూపర్ జెయింట్స్ (డీఎస్‌జీ), ది హండ్రెడ్ లీగ్‌లో మాంచెస్టర్ ఒరిజినల్స్ (మార్చి మ్యాన్‌చెస్టర్ సూపర్ జెయింట్స్‌గా) వ్యవహారాలను చూసుకుంటారు. ఆటగాళ్ల ఎంపిక, కూర్పు, వ్యూహాలు.. అన్నీ మూడీ కళ్ల మీదే జరగనున్నాయి.

ఐపీఎల్ 2026 సీజన్ ముందు జాహిర్ ఖాన్ పోషించిన పాత్రనే మూడీ చేపట్టనున్నారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్)తో 2022 తర్వాత ఐపీఎల్‌కు మూడీ రిటర్న్ చేస్తున్నారు. 2013-19 మధ్య ఎస్ఆర్‌హెచ్ కోచ్‌గా 2016 టైటిల్ గెలిపించిన మూడీ, 2021లో డైరెక్టర్ ఆఫ్ క్రికెట్‌గా, 2022లో మళ్లీ హెడ్ కోచ్‌గా పనిచేశారు. దేశాంతరాల్లో మూడీ అనుభవాలు అద్భుతం. ది హండ్రెడ్‌లో ఓవల్ ఇన్విన్సిబుల్స్‌కు మూడు వరుస సీజన్‌లలో (2021-23) టైటిల్స్, ఐఎల్‌టీ20లో డెజర్ట్ వైపర్స్‌తో 2023, 2025 ఫైనల్స్‌కు చేర్చారు. ముంబై ఇండియన్స్ (ఎంఐ) 49% స్టేక్ కొన్న ఇన్విన్సిబుల్స్‌లో మూడీని ఉంటూ లక్నో ఆఫర్‌ను ఎంచుకున్నారు. ఇది మూడీకి పెద్ద రోల్ అందించడమే కాక, లక్నోకు అనుభవ సముద్రాన్ని తీసుకురాగలదు. ఈసారి ఐపీఎల్ మెంటర్‌గా జస్టిన్ లాంగర్‌ను నియమించిన లక్నో, విలియమ్సన్ సలహాలతో మూడీ బాధ్యతలు కలిపి సూపర్ జెయింట్స్ గ్రూప్‌ను బలోపేతం చేయాలని భావిస్తోంది. లక్నో యాజమాన్యం మరో మార్గదర్శకుడు జాహిర్ ఖాన్‌తో విడిపోయిన నేపథ్యంలో మూడీ వచ్చినట్లు కనిపిస్తోంది. మూడీ అధికారిక ప్రకటన త్వరలో రానుందని, కాంట్రాక్ట్ వ్యవధి ఇంకా వెల్లడి కాలేదని సమాచారం. ఈ నిర్ణయంతో లక్నో ఐపీఎల్ 2026లో మరింత బలంగా మారనుంది.

## ప్రపంచ విజేతలపై ప్రశంసల వర్షం

భారత్ ప్రపంచ ఛాంపియన్?గా నిలిచింది. ఫైనల్?లో సౌతాఫ్రికాను ఓడించి సగర్వంగా కప్పును ముద్దాడంది. దీంతో ప్రపంచ కప్ గెలిచిన భారత మహిళాల జట్టుపై ప్రశంసల జల్లు కురుస్తుంది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ టీమ్?ఇండియాకు అభినందనలు తెలిపారు. మహిళల జట్టు అసమాన ప్రతిభ, అద్వితీయ ప్రదర్శనకు తగిన ఫలితం లభించిందని మోదీ అన్నారు. విశ్వవిజేతగా నిలిచిన భారత జట్టుకు అభినందనలు తెలిపిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము భారత అమ్మాయిలు చరిత్ర సృష్టించారని ఎక్స్ వేదికగా కొనియాడారు. 'మహిళల అసమాన ప్రతిభ, అద్వితీయ ప్రదర్శనకు తగిన ఫలితం లభించింది. ఈ గెలుపు మహిళల క్రికెట్‌ను మరింత ఉన్నతస్థాయికి తీసుకెళుతుంది. ఫైనల్‌లో గొప్ప నైపుణ్యం, ఆత్మవిశ్వాసంతో ప్రదర్శన చేశారు. ప్లేయర్లందరికీ శుభాకాంక్షలు. ఈ చరిత్రాత్మక విజయం భవిష్యత్ తరాలను క్రీడలవైపు మళ్లిస్తుంది' అని మోదీ ట్వీట్ చేశారు. 'టోర్నీ ఆసాంతం ఆటగాళ్లు అసాధారణ సమష్టి కృషి, పట్టుదలను ప్రదర్శించారని మెచ్చుకున్నారు. ఈ చారిత్రాత్మక విజయం భవిష్యత్తు ఛాంపియన్లకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. భారత జట్టుకు శుభాకాంక్షలు' తెలిపిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా. "ఈ విజయం లక్షలాది మంది అమ్మాయిలకు స్ఫూర్తిదాయక మార్గాన్ని సుగమం చేస్తుందన్నారు.

**భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిగా నిలిచారు : కోహ్లీ**

మహిళల వన్డే ప్రపంచకప్ 2025లో విజేతగా నిలిచిన భారత మహిళల జట్టుపై టీమిండియా మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ ప్రశంసల జల్లు కురిపించాడు. ఈ విజయంతో ఎన్నో తరాలకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడాడు. ఈ గెలుపుతో ప్రతీ భారతీయుడు గర్వ పడుతున్నాడని, ఈ విజయానికి భారత అమ్మాయిలు పూర్తి అర్హులని పేర్కొన్నాడు. ఈ మేరకు కోహ్లీ సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్‌ను షేర్ చేశాడు. ప్రపంచకప్‌తో ఉన్న మహిళల జట్టు ఫొటోను కూడా పంచుకున్నాడు.




# ఉమెన్ ఇండియా క్రికెటర్స్ కు బీసీసీఐ భారీ నజరానా

మహిళ క్రికెట్ లో విశ్వ విజేతగా నిలిచిన క్రికెట్ టీమ్ కు రూ. 51 కోట్ల రూపాయలు ప్రైజ్ మనీ ఇవ్వబోతోంది. ఇంతటి మొత్తాన్ని పురుషుల జట్లకు కూడా ఇప్పటివరకూ బీసీసీఐ ఇవ్వలేదు. అటు, గత ఎడిషన్‌తో పోలిస్తే ఈసారి ఐసీసీ కూడా ప్రైజ్ మనీనీ దాదాపు మూడు రెట్లు పెంచింది. దీంతో మన మహిళా క్రికెటర్లు పండుగ చేసుకోబోతున్నారు. ఇదే కాదు, భారత మహిళల విజయానికి ఇంకా ఎన్నో సంస్థలు భారీగా క్యాష్ రివార్డులు అందించేందుకు ముందుకు వస్తున్నాయి. ఈ టోర్నీలో విజేత, రన్నరప్, ఇతర జట్ల కోసం మొత్తంగా ఐసీసీ 13.88 మిలియన్ డాలర్లు (రూ.123 కోట్లు) ప్రైజ్ మనీ పూల్‌ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అంతకుముందు, వరల్డ్ కప్ టోర్నీతో పోలిస్తే ఇది 297 శాతం ఎక్కువ. ఇక విజేతకు ఇచ్చే ప్రైజ్ మనీ కూడా గతంతో పోలిస్తే 239 శాతం మేర పెరిగింది. 2023 వరల్డ్ కప్ విజేతగా నిలిచిన పురుష జట్టుకు ఇచ్చిన ప్రైజ్ మనీ కంటే ఇది అధికం. ఇక ఐసీసీ మహిళల ప్రపంచకప్ ఫైనల్‌లో భారత జట్టు చరిత్ర సృష్టించింది. శఫాలీ వర్మ అద్భుత ఆల్‌రౌండ్ ప్రదర్శనతో భారత్‌కు తొలి వరల్డ్‌కప్ టైటిల్ అందించింది. నాకౌట్ దశకు ముందు జట్టులోకి చివరి వేళ చేర్చబడిన శఫాలీ, ఫైనల్‌లో 87 పరుగులు సాధించి, తర్వాత కీలక వికెట్లు తీసి మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పింది. ఆమెతో పాటు దీప్తి శర్మ కూడా అద్భుత ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చింది. ఫలితంగా భారత్ దీర్ఘ కాలంగా ఎదురుచూస్తున్న తొలి ప్రపంచకప్ ట్రోఫీని గెలుచుకుంది. లారా వోల్వార్డ్ శతకంతో పోరాడిన దక్షిణాఫ్రికా మరోసారి రన్నరప్‌గా ముగిసింది. భారత్ తొలి బ్యాటింగ్‌లో 7 వికెట్ల నష్టానికి 298 పరుగులు చేసింది. శతకం లేకుండా జట్టు సాధించిన మూడవ అతిపెద్ద స్కోరు ఇది. ఓపెనర్ స్మృతి మంధాన హిస్టరీ క్రియేట్ చేసింది. ఫైనల్‌లో చేసిన 45 పరుగులతో మరో అరుదైన మైలురాయిని చేరుకుంది. ఒక వరల్డ్ కప్ ఎడిషన్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా రికార్డు సృష్టించింది. ఆమె ఈ సీజన్‌లో 434 పరుగులు చేసింది. ఇంతకుముందు ఈ రికార్డు లెజెండరీ బ్యాటర్ మిథాలీ రాజ్ పేరిట ఉండేది. 2017 ఎడిషన్‌లో మిథాలీ 409 పరుగులు చేసింది.

# ఈ కల కోసం 20 ఏళ్లు ఎదురుచూశా..

**విజయంపై మిథాలీ రాజ్ ఎమోషనల్ పోస్ట్**

భారత మహిళా క్రికెట్ జట్టు తొలిసారిగా ఐసీసీ ప్రపంచకప్ టైటిల్‌ను గెలుచుకోగానే, రెండు దశాబ్దాలుగా ఆ కలను మోసిన దిగ్గజ క్రీడాకారిణి, మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ భావోద్వేగానికి లోనయ్యారు. ఆదివారం నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో జరిగిన థ్రిల్లింగ్ ఫైనల్‌లో భారత్ 52 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించి విశ్వ విజేతగా నిలిచింది. 2005, 2017లో భారత్‌ను రెండు ప్రపంచకప్ ఫైనల్స్‌కు నడిపించిన మిథాలీకి, ఈ విజయం ఆమె జీవితకాలపు స్వప్నం నెరవేరిన మధుర క్షణం. రెండు దశాబ్దాలకు పైగా భారత మహిళా క్రికెట్‌కు సేవ చేసిన దిగ్గజ బ్యాటర్ మిథాలీ రాజ్, జట్టు ప్రపంచకప్ గెలిచిన వెంటనే తన భావోద్వేగాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. "వరల్డ్ ఛాంపియన్.. భారత మహిళల జట్టు ఆ ప్రపంచకప్ ట్రోఫీని ఎత్తుకోవడం చూడాలని నేను రెండు దశాబ్దాలకు పైగా ఈ కల చూశాను. నేడు ఆ కల ఎట్టకేలకు నిజమైంది" అని మిథాలీలో పోస్ట్ చేశారు. "2005లో గుండె పగిలిన బాధ నుంచి 2017లో పోరాటం వరకు.. ప్రతి కన్నీరు, ప్రతి త్యాగం, ఇక్కడ మనం ఉన్నామని నమ్మి బ్యాట్ పట్టిన ప్రతి యువతి.. ఇవన్నీ ఈ క్షణానికి దారితీశాయి. మీరు కేవలం ఒక ట్రోఫీని గెలవలేదు, భారత మహిళల క్రికెట్ కోసం కొట్టుకున్న ప్రతి హృదయాన్ని మీరు గెలిచారు. జై హింద్" అని మిథాలీ ముగించారు. మిథాలీ రాజ్ పోరాట పటిమ, మహిళా క్రికెట్‌కు ఆమె చేసిన అసాధారణ కృషిని హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని జట్టు గుర్తించింది. విజయోత్సవ ర్యాలీ సమయంలో హర్మన్‌ప్రీత్ కౌర్ జట్టు సభ్యులు ప్రపంచకప్ ట్రోఫీని మిథాలీ రాజ్ చేతికి అందించారు. తమ విజయం ఆమె కృషికి దక్కిన ఫలితమేనని ఆటగాళ్లు కీర్తించారు. ఈ చారిత్రక విజయం తర్వాత మిథాలీ మీడియాతో మాట్లాడుతూ.. "భారత్ ఎట్టకేలకు ప్రపంచకప్ గెలవడం పట్ల నేను చాలా సంతోషంగా, భావోద్వేగంగా ఉన్నాను. ఇది సంవత్సరాలుగా మేమంతా ఎదురుచూస్తున్న విషయం చివరకు మేము దానిని చూశాం" అని అన్నారు. భారత జట్టు అమోల్ మజుందార్ కోచ్‌గా, హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్‌గా గ్రూప్ దశలో మూడు వరుస ఓటముల నుంచి పుంజుకుని చరిత్ర సృష్టించడం విశేషం. ఫైనల్‌లో భారత్ తొలుత బ్యాటింగ్ చేసి 298/7 పరుగులు చేసింది. షఫాలీ వర్మ (87), దీప్తి శర్మ (58) కీలక ఇన్నింగ్స్‌లు ఆడగా, స్మృతి మంధాన, రిచా ఘోష్ కూడా పటిష్టమైన సహకారాన్ని అందించారు. అనంతరం దీప్తి శర్మ బంతితో అద్భుత ప్రదర్శన చేస్తూ 5/39 వికెట్లు తీసి సౌతాఫ్రికాను ఆలౌట్ చేసింది. రెండు దశాబ్దాలకు పైగా మిథాలీ, మిలియన్ల మంది అభిమానులు చూసిన కల ఈ విజయం ద్వారా పూర్తయింది.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
4 నవంబర్ 2025

# తీవ్ర విషాదం.. తీరని శోకం




## ఆర్టీసీ బస్సును ఢీకొన్న కంకర లారీ

## 19 మంది దుర్మరణం


### కన్నబిడ్డలకు తల్లిదండ్రులను దూరం చేసిన మృత్యువు

### అనాథలై ఆక్రందనతో రోదనలు

### ఘటనా స్థలంలో హృదయ విదారకర సన్నివేశాలెన్నో..

వారంతా మరికొద్ది సమయంలో గమ్యాన్ని చేరుకోబోతున్న ప్రయాణికులు.. పల్లెవెలుగు బస్సులో ప్రయాణిస్తుండగా మృత్యువు కంకర లోడుతో ఉన్న లారీ రూపంలో వచ్చింది.. ఎదురుగా వచ్చి ఢీకొట్టడంతో బస్సులోని దాదాపు 70 మంది ప్రయాణికుల్లో 19 మంది మృతి చెందారు. మరెందరికో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రులకు తరలించారు. ఈ హృదయవిదారకర ఘటన రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాగూడ వద్ద జరిగింది. ఈ ప్రమాదంలో అమ్మానాన్నలను కోల్పోయి అనాథలుగా మిగిలిన కొడుకూ కూతుర్లున్నారు. బిడ్డలను కోల్పోయి జీవచ్ఛవాలుగా మారిన తల్లిదండ్రులున్నారు. చంటి బిడ్డను పొత్తి కడుపులో దాచుకున్నా వదలని మృత్యువు వారిద్దరికి పొట్టన పెట్టుకున్న హృదయ విదారకరమైన సన్నివేశాలూ ఉన్నాయి.

రంగారెడ్డి/చేవెళ్ల (జనంసాక్షి) :















### క్షతగాత్రులకు చిన్నారెడ్డి పరామర్శ



టిప్పర్ – ఆర్టీసీ బస్సు ఢీకొన్న దుర్ఘటన స్థలాన్ని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి పరిశీలించారు. క్షతగాత్రులను చేవెళ్ల ఆసుపత్రిలో పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. చేవెళ్ల – వికారాబాద్ – తాండూర్ మధ్య రోడ్డును త్వరలో నాలుగు లేన్లుగా మారుస్తే ప్రమాధాలకు అవకాశం ఉండదని అభిప్రాయం వెల్లడించారు.

### ముగ్గురు అక్కాచెల్లెళ్లు మృతి






రంగారెడ్డి జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కాచెల్లెళ్లు మరణించారు. లి తాండూరుకు చెందిన ఎల్లయ్య గౌడ్ ముగ్గురు కూతుళ్లు నందిని (డిగ్రీ ఫస్టియర్), సాయిప్రియ (డిగ్రీ థర్డ్ ఇయర్), తనూష (ఎంబీఏ) హైదరాబాద్లో చదువుతున్నారు. ఇటీవల బంధువుల పెళ్లి ఉండటంతో సొంతూరుకు వచ్చారు. ఈ తెల్లవారుజామున తిరిగి హైదరాబాద్ వెళ్తుండగా బస్సు ప్రమాదం జరిగి చనిపోయారు.


ఈ ముగ్గురు యువతులు హైదరాబాద్‌లో చదువుకుంటున్నారు. వీకెండ్ కావడంతో ఇంటికి వెళ్లారు. కాలేజ్‌కి వెళ్లేందుకు ఈరోజు తెల్లవారుజామున సొంతూరు అయిన వికారాబాద్ జిల్లా యాలాల మండలం పేర్కంపల్లి గ్రామం నుంచి హైదరాబాద్‌కు బయల్దేరారు. ముగ్గురిని తండ్రి బస్టాప్ వద్ద డ్రాప్ చేశాడు. దగ్గరుండి మరీ బస్ ఎక్కించాడు. ముగ్గురు కూతుర్లు తండ్రికి సంతోషంగా బై చెప్పారు. కానీ.. అవే ఈ ముగ్గురు కూతుర్లు పలికే చివరి మాటలు అవుతాయని ఆ కన్న తండ్రి కలలో కూడా అనుకోలేదు. నవ్వుతూ సరదాగా వెళ్లిన ముగ్గురు కూతుర్లు ఆ తల్లిదండ్రులకు మృతదేహాలుగా కనిపించారు. కన్న వాళ్లు ఈ బాధ భరించలేక గుండెలవిసేలా రోదించారు. ముగ్గురమ్మాయిల ఫ్రెండ్స్ విషాదంతో విలపించారు. మీర్జాగూడ బస్సు ప్రమాద ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు చనిపోయిన సంగతి తెలిసిందే. ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. చనిపోయిన ముగ్గురిని నందిని, సాయి ప్రియ, అనూషగా పోలీసులు గుర్తించారు. ఈ అమ్మాయిల సొంతూరు వికారాబాద్ జిల్లా యాలాల మండలం పేర్కంపల్లి గ్రామం. ఈ అమ్మాయిల తండ్రి ఎల్లయ్య గౌడ్ ప్రైవేట్ ట్రావెల్స్ నడుపుతున్నాడు. చనిపోయిన ఈ ముగ్గురు అమ్మాయిల్లో ఇద్దరు డిగ్రీ చదువుతున్నారు. పెద్దమ్మాయి ఎంబీఏ చదువుతోంది. ఈ ముగ్గురు అమ్మాయిలకు మరో అక్క ఉంది. ఆమెకు ఇటీవలే పెళ్లైంది. సొంతూరు నుంచి హైదరాబాద్ కు బస్సులో వెళుతుండగా ఈ ముగ్గురు అక్కాచెల్లెళ్లను ఇలా మృత్యువు టిప్పర్ రూపంలో కబళించింది.

### గుండెలు...పగిలే ఫొటో..



తల్లి, బిడ్డ మృతదేహాలను బస్సులో నుంచి బయటకు తీసి రోడ్డుపై ఉంచిన ఫొటో కన్నీరు తెప్పిస్తోంది. ప్రమాద సమయంలో టిప్పర్ మితిమీరిన వేగంతో వెళ్లినట్లు సమాచారం. ఘటనాస్థలం వద్ద ప్రయాణికుల ఆర్తనాదాలతో భీతావహ వాతావరణం నెలకొంది.

### తల్లిని కోల్పోయి దీనంగా..



మీర్జాగూడ బస్సు ప్రమాదంలో తల్లి మృతి చెందింది. తండ్రి గాయాల పాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దిక్కుతోచని స్థితిలో అంబులెన్స్‌లోనే చిన్నారులు బిక్కుబిక్కుమంటూ ఉన్నారు. ఈ ప్రమాదంలో వారి ముగ్గురు పిల్లలు అదృష్టవశాత్తు సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డారు. అయితే ఓవైపు తల్లి మరణం, మరోవైపు ఆసుపత్రిలో తండ్రి ఉండటంతో ఏం జరుగుతుందో తెలియని స్థితిలో ఆ చిన్నారులు ఉండిపోయారు. ఈ దృశ్యం స్థానికులను కంటతడి పెట్టిస్తోంది.

### మెరుగైన వైద్యం అందించండి : మంత్రి దామోదర రాజనర్సింహ



రాష్ట్ర వైద్య , ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా చేవెళ్ల రోడ్డు ప్రమాద ఘటన లో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన చికిత్స ను అందించాలని రాష్ట్ర వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. బాధితులకు మెరుగైన చికిత్స ను అందించేందుకు వైద్యుల బృందాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత , రాష్ట్ర మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డా. నరేంద్ర కుమార్, రాష్ట్ర వైద్యవిధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ లను ఆదేశించారు. మంత్రి అధికారులతో ఎప్పటికప్పుడు టెలిఫోన్ లో మాట్లాడి పరిస్థితి ని సమీక్షించారు. ఘటన లో గాయపడిన వారికి మెరుగైన చికిత్స ను అందించేలా వైద్యుల కమిటీ ని నియమించాలని అధికారులతో టెలిఫోన్ లో ఆదేశించారు. ఘటనలో చనిపోయిన వారి మృతదేహాలను త్వరగా వారి కుటుంబ సభ్యులకు అందించేలా చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

### రవాణా శాఖ అధికారులతో పొన్నం జూమ్ మీటింగ్

రాష్ట్రంలో ప్రమాదాలు జరగకుండా రవాణా శాఖ అధికారులు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం అధికారులకు సూచించారు. మీర్జాగూడలో జరిగిన ప్రమాదంలో రెండు వాహనాలకు ఫిట్నెస్ ఉన్నప్పటికీ ఇరుకు రోడ్డు డివైడర్ లేకపోవడం వల్ల ప్రమాదం జరిగిందని, వాహనాల స్పీడ్ లాక్ ఎంత వరకు అమలవుతున్నాయి చూడాలి.. దానిని బ్రేక్ చేస్తే ట్రిపుల్ పెనాల్టీ వేయాలని సూచించారు. రవాణా శాఖ అధికారులు ఎన్ఫోర్స్మెంట్ సీరియస్ గా యాక్టివ్ గా ఉండాలని సూచించారు. ఘటన జరిగినప్పుడు దాడులే కాదు నిరంతరం యాక్షన్ ప్లాన్ ఉండేలా కఠినంగా వ్యవహరించాలన్నారు.

### చేవెళ్ల రోడ్డు ప్రమాదంపై సీఎస్ రామకృష్ణారావు టెలికాన్ఫరెన్స్



రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మీర్జాగూడ ప్రాంతంలో నేడు ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు, ప్రమాదంలో గాయపడిన వారికి అత్యవసర చికిత్స అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, మెరుగైన వైద్య సాయం కోసం బాధితులను హైదరాబాద్‌కు తరలించాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేక అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచి బాధితులను వెంటనే ఆదుకోవాలని సీఎస్ సూచించారు.

### ఆస్పత్రిలో క్షతగాత్రులకు మంత్రి శ్రీధర్‌బాబు పరామర్శ



సోమవారం చేవెళ్ల ఏరియా ఆసుపత్రిలో చిక్సిత పొందుతున్న బస్సు ప్రమాద ఘటన క్షతగాత్రులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పరామర్శించారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఏరియా ఆసుపత్రి దగ్గర మంత్రి శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడారు. బాధితులకు ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా అండగా ఉంటామని క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తాం. మృతులకు రూ. 7 లక్షల ఎక్స్ గ్రేషియాను అందించనున్నామని అన్నారు. వాస్తవ పరిస్థితి, ప్రమాదం జరిగిన తీరును మంత్రులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అందుతున్న వైద్య సేవలు, సహాయక చర్యలపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారని తెలిపారు.

### ఎమ్మెల్యే కాలె యాదయ్యకు నిరసన సెగ

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య నిరసన సెగ తగిలింది. ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ స్థానికులు నినాదాలు చేశారు. రోడ్డు నిర్మాణ పనులను ఎందుకు ఆలస్యం చేశారని నిలదీశారు. దీంతో ప్రమాద స్థలం నుంచి కారు ఎక్కి వెళ్లిపోయారు. దీంతో ఖానాపూర్ – మీర్జా గూడ వద్ద బస్సు ప్రమాదం వద్ద కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370